ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 458

వెల : రూ.25/-

మే 2023





జనసాహితి ప్రచురణ

## ప్రముఖ ఆఫ్రో అమెరికన్ గాయకుడు, పౌరహక్కుల కార్యకర్త, ప్రపంచశాంతి ఉద్యమకారుడు

# హారీ బెలాఫాంటే (Harry Belafonte) మరణం

**హారీ** బెలాఫాంటే మానవహక్కులకై పోరాడారు. అన్నిరకాల అన్యాయాలను ఎదిరించారు. పౌరహక్కుల ప్రచారంలో క్రియాశీలంగా పాల్గొన్నారు. న్యూయార్క్, మాన్‌హాటన్‌లో 25-4-2023న తన 96వ యేట మరణించారు. ఆయన న్యూయార్క్‌లోని హార్లెమ్‌లో 1-3-1927లో జన్మించారు.

బెలాఫాంటే జమైకన్ అమెరికన్ గాయకుడు, నటుడు. పౌరహక్కుల కార్యకర్త. 1950లలో కాలిప్సో (Calypso) సంగీతాన్ని బహుళ ప్రచారం చేశారు. గాయకునిగా ఎమ్మీ, గ్రామీ, ఆస్కార్, టోనీ బహుమతులను అందు కున్నారు. డెమొక్రటిక్ పార్టీని బలపరిచారు.



ఆయన 1949-2023 మధ్య చురుకుగా అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆయన రికార్డింగ్స్‌లో అత్యుత్తమమైనవి 'ది బనానా బోట్‌సాంగ్', 'జంప్ ఇన్ ది లైన్', 'జమైకా! ఫేర్‌వెల్', 'మేరీస్ బాయ్ చైల్డ్'. కొన్ని చలనచిత్రాలలో కూడా నటించారు. పాల్ రోబ్సన్‌ను తన గురువుగా తలచారు. మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్‌కు సన్నిహితుడు. 1950 - 1960ల మధ్య పౌరహక్కుల ఉద్యమంలో ఉధృతంగా కృషిచేశారు.

బెలాఫాంటే జార్జిబుష్, ట్రంప్‌ల పరిపాలనా పద్ధతులను తీవ్రంగా విమర్శించారు. 1964లో లిండన్ బి. జాన్సన్‌ను సమర్థించారు. క్యూబాపై అమెరికా విధించిన ఆంక్షలను తప్పుబట్టారు. గ్రెనడాపై అమెరికా దాడిని వ్యతిరేకించారు. ఫిడెల్ కాస్ట్రోను ప్రశంసించారు. జాతివివక్ష వ్యతిరేక పోరాటంలో క్రియాశీలంగా కృషిచేశారు. 2002లో బుష్ ఇరాక్‌పై చేసిన యుద్ధాన్ని విమర్శిస్తూ వ్యాఖ్యానించారు. ఆ యుద్ధాన్ని సెప్టెంబర్ 11న దాడిచేసిన హైజాకర్స్ సంఘటనతో పోలుస్తూ 2006లో డ్యూక్ యూనివర్శిటీలో ప్రసంగించారు. దానిలో ఆయన బుష్‌ను ఇరాకీయులను చంపిన టెర్రరిస్టని అభివర్ణించారు. బుష్ పరిపాలన "అజ్ఞానంతో కూడిన అహంకారయుత పాలన" అని దుయ్యబట్టారు. ప్రపంచ రాజకీయాలలో అమెరికా విధానాలు 'నైతికంగా దివాళాకోరుతనంతో కూడుకున్నది' అని వ్యాఖ్యానించారు.

బెలాఫాంటే తన బాల్యాన్ని 1932-1940 మధ్య తన అమ్మమ్మ దేశమైన జమైకాలో గడిపారు. న్యూయార్క్ వచ్చిన తర్వాత జార్జి వాషింగ్టన్ స్కూలులో చదివి, రెండవ ప్రపంచ యుద్ధకాలంలో అమెరికా నౌకాదళంలో పనిచేశారు. 1940ల చివరి సంవత్సరాలలో నటనలో శిక్షణ పొందారు.

క్లబ్‌లలో పాడటం ద్వారా గాయకునిగా తన జీవితం ప్రారంభించారు. 1956లో 'కాలిప్సో' ఆల్బమ్ విడుదల చేయగా అది మిలియన్ కాపీలు పైగా ఒక ఏడాది కాలంలో అమ్ముడు పోయాయి. ఇది అమెరికన్లకు కాలిప్సో సంగీతాన్ని పరిచయం చేసింది ఈ సంగీతం 19వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో ట్రినిడాడ్, టొబాగోలో రూపుదిద్దుకుంది.

1960లలో అమెరికా సంగీత ప్రియులకు దక్షిణాఫ్రికా గాయని మిరియం మకేబాను, గ్రీకు గాయకుడు నానా మౌస్కౌరి, బాబ్ డిలాన్‌లను ఆయన పరిచయం చేసారు. 1970ల మధ్య నుండి 1980ల తొలి సంవత్సరాల వరకు జపాన్, యూరప్, క్యూబాలలో కచేరీలు చేశారు. 1988లో విడుదల చేసిన ఆల్బమ్‌లో, దక్షిణాఫ్రికా పాటించిన జాతివివక్ష విధానాన్ని వ్యతిరేకించే 10 నిరసన (protest) పాటలు వున్నాయి. ఆయన 1954-1961 మధ్య దక్షిణ అమెరికాలో కచేరీలు ఇవ్వడానికి నిరాకరించారు. ఇప్పటికీ నల్లజాతివారిపై సాగుతున్న వివక్షకు వ్యతిరేకంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. 1960లో జాన్.ఎఫ్. కెన్నడీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 1964లో లిండన్ బి జాన్సన్‌ను బలపరిచారు.

ఆయన రాజకీయంగా పౌరహక్కుల కార్యకర్త, గాయకుడు, నటుడు పాల్‌రోబ్సన్ సిద్ధాంతాలతో ఏకీభవించారు. రోబ్సన్‌లాగానే అమెరికాలో జాతివివక్షా విధానాన్నే కాక ఆఫ్రికాలో పశ్చిమ దేశాల వలసవాదాన్ని ఎదుర్కొన్నారు. సామాజిక కార్యకర్తలుగా కళాకారుల పాత్రపై స్పష్టమైన, నిర్దుష్టమైన అవగాహనతో కృషిచేసిన బెలా ఫాంటే 2003 అక్టోబర్ 25న అట్లాంటా ఒపేరా బృందం కోసం నిధుల సేకరణలో భాగంగా ఆఖరి కచేరీ చేశారు. 1985లో 'వుయ్ ఆర్ ది వరల్డ్' గ్రామీ అవార్డు పాటతో ఆఫ్రికాకు నిధిసేకరణకై కచేరీ చేశారు. 2001లో దక్షిణాఫ్రికాలో ఎయిడ్స్ వ్యాధిపై ప్రచారం చేశారు. కెన్యాలో బాలలవిద్య ప్రాముఖ్యతను తెలియచేశారు.

మెకర్థీ కాలంలో బ్లాక్‌లిస్టులో వున్న బెలాఫాంటే "పాల్‌రోబ్సన్ నాకు వెన్నెముక, మార్టిన్ లూథర్‌కింగ్ నా ఆత్మను అవహించాడు" అని ప్రకటించారు. 1987 నుంచి చనిపోయేవరకు యునిసెఫ్ గుడ్‌విల్ రాయబారిగా కృషిచేశారు.

46 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

458

సంపుటి : 46
సంచిక : 10
మే 2023

జనసాహితి ప్రచురణ

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...

| | | | |
|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : | మేడే.... చిత్రకారుడు : చిత్త్రప్రసాద్– చిత్రం అంతర్జాలం నుండి | .....01 |
| ✦ రెండవ అట్ట | : | హోరీ బెలాఫాంటే మరణం | .....02 |
| ✦ మూడవ అట్ట | : | డార్విన్ జీవ పరిణామక్రమ సిద్ధాంతం (కవిత), చిత్రకారుడు బాలి కి సంతాపం | .....35 |
| ✦ నాల్గవ అట్ట | : | ఎర్రజెండాలెత్తిపట్టిన ఆడవాళ్ళు (కవిత) – డా॥ బి. అరుణ | .....36 |
| ✦ సంపాదకీయం | : | శ్రామికవర్గ చైతన్యయుత పోరాటాల దీక్షాదినం మేడే! | .....05 |
| ✦ కథలు | : | ఖూనీ – కాళీపట్నం పేర్రాజు | .....07 |
| | : | అపారమైన దయ తెలుగు అనువాదం : కొత్తపల్లి రవిబాబు | .....23 |
| ✦ వ్యాసం | : | చైనా రచయిత్రి డింగ్‌లింగ్ పరిచయం పేరిట...... – జి.వి. భద్రం | .....12 |
| ✦ ధారావాహిక | : | దేశ విభజన వస్తువుగా సాహిత్యం (9) | |
| | | అనీస్ కిద్వాయ్ ఉర్దూ రచన 'ఆజాదీకి ఛాయోంమేం' – కొత్తపల్లి రవిబాబు | .....10 |
| ✦ గల్పిక | : | ష్! గప్‌చుప్!! – శంకరం | .....18 |
| ✦ సినిమా సమీక్ష | : | 'ఇన్హెరిట్ ది విండ్ 1960' – బాలాజీ (కోల్‌కతా) | .....20 |
| ✦ జాతీయ అక్షరయోధులు | : | కోట శివరామకరంత్ – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....17 |
| ✦ కరపత్రం | : | స్త్రీ విముక్తి సంఘటన మహాసభలు | .....27 |
| ✦ కవితలు | : | దీర్ఘకవిత : శీలా సుభద్రాదేవి (**34**) | |
| ✦ వివిధ | : | ముప్పై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**30**); | |
| | | వర్తమాన సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు (**11, 16, 19, 29**); | |
| | | చైతన్యవాహిని (**31**); ఈ పుస్తకాలు అందాయి (**33**) | |
| ✦ సంతాపాలు | : | పైగంబర కవి కమలాకాంత్ (**06**), రవ్వా శ్రీహరి (**09**), 'ఆహ్వానం' లక్ష్మి (**22**), | |
| | | లాలం సుబ్బయ్య (**28**) | |

ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

రచనలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాకృష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దర్గాస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X
LIBRARY OF CONGRESS
LCCN 94903393

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం



# కృతజ్ఞతలు

**ఉపాధ్యాయిని** తాతినేని (కోగంటి) స్వరాజ్యలక్ష్మిగారు గుంటూరుజిల్లా కొల్లూరు గ్రామంలో 15-3-2023న తన 90వ ఏట మరణించారు. ఆమె 1933 జులైలో కొల్లూరులోనే జన్మించారు.

1952 మే నెలలో తాతినేని వెంకట్రామయ్యగారితో ఆమె వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. రేపల్లె మున్సిపల్ హైస్కూలు ఉపాధ్యాయినిగా స్వరాజ్యలక్ష్మిగారు 18 సం॥లు పనిచేశారు. ప్రముఖ కవి సి.వి.కి స్నేహితులైన వెంకట్రామయ్యగారు సాహిత్య పరనాసక్తి ఉన్నవారు. వెంకట్రామయ్యగారూ స్వరాజ్యలక్ష్మిగారూ ప్రజాసాహిత్యాభిమానులు, 'ప్రజాసాహితి' పాఠకులు. 'ప్రజాసాహితి'కి ఆప్తమిత్రులు. వెంకట్రామయ్యగారు తంతి, తపాలా శాఖ వామపక్ష బావజాల ట్రేడ్ యూనియన్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ప్రజాసంఘాల కార్యక్రమాలలో, ప్రజాసాహిత్య ప్రచారంలో ఇప్పటికీ ముందుంటారు.

స్వరాజ్యలక్ష్మిగారిని గుర్తుచేసుకుంటూ వారి కుటుంబ సభ్యులు 'ప్రజాసాహితి' పత్రికకు 50,000 విరాళంగా అందించారు. వారికి మా కృతజ్ఞతలు.

– సంపాదకులు

# కృతజ్ఞతలు

**తలశిల** పురుషోత్తంగారు ప్రజాతంత్రవాది, ప్రజాసాహిత్యాభిమాని. వారు 'ప్రజాసాహితి' పత్రిక అవసరాల కోసం 50,000 విరాళంగా అందించారు. వారికి మా కృతజ్ఞతలు.

– సంపాదకులు

# కృతజ్ఞతలు



**చందు** యశోదమ్మగారు 16-5-2016న మరణించారు. యశోదమ్మ 7వ వర్ధంతి సందర్భంగా, ఆమె నాల్గవ సంతానం చందు నాగేశ్వరరావు, కోడలు అనురాధ, మనుమలు డాక్టర్ విశ్వచైతన్య, చార్టర్డ్ ఎకౌంటెంట్ బాపు చైతన్యలు 'ప్రజాసాహితి' ఒక సంచిక ముద్రణకై ఆర్థిక సహాయం అందించారు. వారికి కృతజ్ఞతలు.

– సంపాదకులు

సంపాదకీయం

# శ్రామికవర్గ చైతన్యయుత పోరాటాల దీక్షాదినం మేడే!!

**రెండు** మహత్తర ప్రాధాన్యతలు గల దినం మేడే. అది ప్రపంచ శ్రామికుల అంతర్జాతీయతా దినం. అది శ్రామికుల పోరాట దీక్షాదినం కూడా. దోపిడీ పీడనలు లేని సమసమాజ నిర్మాణం దాని లక్ష్యం. 1889లో పారిస్‌లో జరిగిన సోషలిస్టు ఇంటర్నేషనల్ మొదటి కాంగ్రెస్ ఈ క్రింది డిమాండ్ల సాధన కోసం పిలుపునిచ్చింది. అది 8 గంటల పనిని చట్టబద్ధం చేయాలని కోరింది. రాత్రి పనికి, ప్రమాదకరమైన పనులకు ప్రత్యేక నిబంధనలు వుండాలని కోరింది. చట్టబద్ధ వారాంతపు విశ్రాంతి ఇవ్వాలని, బాలల శ్రమను నిషేధించాలని, యువ, మహిళల శ్రమపై పరిమితులు విధించాలని, ఫ్యాక్టరీ నడిపే షాపుల ద్వారా అమ్మకాలు లేదా వస్తురూపమైన ప్రతిఫలం నిషేధించాలన్నది. ప్రభుత్వమే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని, జాతితో సంబంధం లేకుండా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఎలాంటి అడ్డంకులు లేకుండా యూనియన్లు, సమిష్టి సంఘాలు ఏర్పర్చుకునే స్వేచ్ఛ వుండాలని ఆ పిలుపులో కోరింది.

19వ శతాబ్దిలో అమెరికా, ఐరోపా ఖండాల దేశాలలో పారిశ్రామిక అభివృద్ధితో విప్లవకర పారిశ్రామిక కార్మికవర్గం వృద్ధి చెందింది. తక్కువ వేతనాలతో, ఎక్కువ పనిగంటలతో పరిశ్రమల యజమానులు కార్మికులను వేపుకు తినేవారు. 14-18 గంటల పనిదినం సర్వసాధారణంగా వుండేది. ఫ్రెడరిక్ ఎంగెల్స్ రచించిన పరిశోధనాత్మక గ్రంథం "ఇంగ్లండ్‌లో కార్మికవర్గ స్థితిగతులు" ఆ రోజుల నాటి కార్మికవర్గ దుస్థితిని కళ్ళకు కట్టించింది. సమంజస వేతనాల కోసం, పనిగంటల తగ్గింపుకోసం కార్మికవర్గ చైతన్యయుత పోరాటాల దీక్షాదినంగా మే డే! ఆవిర్భవించింది. పారిశ్రామిక సమాజాల్లో అనేక కార్మికసంఘాలు ఈ లక్ష్యాల సాధనకై పుట్టుకొచ్చాయి.

అమెరికాలో చికాగో నగరం అటువంటి పోరాట దీక్షకు ప్రబల కేంద్రంగా నిలిచి వెలిగింది. అక్కడ 1886 మే నెల ఒకటవ తేదీన 8 గంటల పనిదినం నినాదంతో వివిధ పరిశ్రమలకు చెందిన వేలాది కార్మికులు బ్రహ్మాండమైన ప్రదర్శన చేశారు. ఆ ప్రదర్శన చేస్తున్న కార్మికులపై ప్రభుత్వ సాయుధ బలగాలు విరుచుకుపడి కాల్పులు జరిపి హేమార్కెట్ ప్రదేశాన్ని రక్తసిక్తం చేశాయి. ఆ పోరాట రుధిరంలోంచి పుట్టిందే కార్మికవర్గపు ఎర్రజెండా. కొంతమందిని ఉరికంబం ఎక్కించారు. అనేకమందిని జైళ్ళలో నిర్బంధించారు. ఆ త్యాగమయ పోరాటాల ఫలితంగా కార్మికుల పని పరిస్థితులలో మెరుగుదల జరిగింది. ప్రపంచ కార్మికోద్యమ చరిత్రను మలుపుతిప్పిన, దిశానిర్దేశం చేసిన 'మేడే' కార్మికవర్గ సమైక్యశక్తిని చాటింది. ఈ పోరాటాలన్నింటా మహిళలు సమరశీలతతో సంఘటితశక్తిగా పాల్గొన్నారు.

అమెరికా, ఐరోపాలో పారిశ్రామిక సమాజాలేర్పడిన కాలంలో భారత ఉపఖండం భూస్వామ్య వ్యవస్థగా వెనుకబాటుతనంలో వుండిపోయింది. మొఘలుల పరిపాలనా కాలం నాటికి భారతదేశంలో (ఉపఖండం మొత్తంలో) చేతివృత్తుల కార్ఖానాలు పెంపొంది విదేశీ వర్తకం చేసే వ్యాపార శ్రేణులు ఇనుమడించాయి. ఈనాడు ప్రపంచ వాణిజ్యం (Trade)లో భారతదేశపు వాటా 2% మాత్రమే ఉంటే షాజహాన్ చక్రవర్తి కాలంలో 23% వుండేదని చరిత్ర చెబుతోంది. అయితే పెట్టుబడిదారీ పరిశ్రమలు ఏర్పడకముందే ఐరోపా వర్తక పెట్టుబడిదారులు ప్రవేశించి భారతదేశంలో ఆ క్రమాన్ని అడ్డుకున్నారు. ఫలితంగా భారతదేశం వలస దేశంగా మగ్గిపోయింది. వలసదారులు తమ దేశాల వ్యాపార, పారిశ్రామిక ప్రయోజనాలకనుగుణంగా పెట్టుబడిదారీ విధానాన్ని పరిమితంగా, వక్రంగా ప్రవేశపెట్టారు. నూతన పారిశ్రామిక కార్మికవర్గం పరిమితంగా వృద్ధి చెందింది. జాతీయోద్యమంలో అది నిర్వహించిన అభ్యుదయకర పాత్ర చిన్నదేమీ కాదు.

వలస పాలనా కాలంలో రూపుదిద్దుకున్న అర్ధభూస్వామ్య – వలస సామాజికార్థిక రాజకీయ వ్యవస్థ వలసానంతర కాలంలో అర్ధభూస్వామ్య – అర్ధవలసగా రూపొంది నేటికీ కొనసాగుతున్నది. అధికారం చేపట్టిన దళారీ పాలకవర్గాలు అశేష శ్రామిక జనావళిపై దోపిడీ పీడనల నిరంకుశత్వాన్ని అమలుపరుస్తున్నారు. 95 శాతం శ్రామికులు, ఉద్యోగులు అసంఘటితరంగంలో శ్రమ ధారపోస్తూ కనీస జీవన వసతులు పొందలేని స్థితిలో అలమటిస్తున్నారు.

1990ల నుండి ఊపందుకున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు శ్రామిక మధ్యతరగతి ప్రజల జీవితాలను పెనమ్మీద నుంచి పొయ్యిలోకి తోసివేసాయి. దళారీ ప్రభుత్వాలు దేశ సంపదను, శ్రమజీవుల కష్టాన్ని దేశ, విదేశీయ కార్పొరేట్ శక్తులకు చౌకగా కట్టబెడుతూ ప్రజాజీవనాన్ని విధ్వంసం చేస్తున్నాయి. వ్యవసాయిక సంక్షోభం రైతులను, రైతుకూలీలను వలసలవైపు, ఆత్మహత్యలవైపు నెడుతున్నది. కరోనా వ్యాప్తిచెందిన సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఆకస్మికంగా విధించిన

దుర్మార్గపు లాక్‌డౌన్ కార్మికుల దుర్భర జీవితాలని కళ్ళ ముందు నిలిపింది. వాళ్ళ జీవితాలు నేటికీ కుదుటపడలేదు.

భా.జ.పా. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గపు వ్యవసాయ చట్టాలని తెచ్చింది. కార్మికులు తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కుల చట్టాలను నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లుగా మార్చింది. అంతకుముందు అత్యంత బాధ్యతారహితంగా చేసిన పెద్ద కరెన్సీనోట్ల రద్దు.... రైతులను, కూలీలను, సూక్ష్మ చిన్న మధ్యస్థాయి పరిశ్రమలను, కార్మికులను కోలుకోలేని దెబ్బతీశాయి. కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలను నిరసిస్తూ లక్షలాది రైతాంగం సంవత్సరం పైగా ఉత్తేజకరమైన పోరాటం చేసింది. కార్మికులు, ఉద్యోగులు కూడా ప్రజారంగ ఆస్తుల ప్రయివేటీకరణకు, వారి జీతభత్యాల కత్తిరింపులకు వ్యతిరేకంగా నిరంతరం దేశమంతటా ఉద్యమిస్తున్నారు. ప్రజా ఉద్యమాలు వ్యవస్థలో మౌలిక మార్పును కాంక్షించే విధంగా కార్మికవర్గ నాయకత్వం శ్రమజీవులను చైతన్యపరచాలి.


నిరుద్యోగం యువతను తీవ్రంగా పీడిస్తున్నది. వాళ్ళ అసంతృప్తి పక్కదార్లు పట్టే విధంగా సంకుచిత, క్షీణ సంస్కృతి ధోరణులను వ్యవస్థాగతంగా వ్యాప్తిచేస్తున్నారు. కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రగిలించి విధ్వంసకారులుగా మార్చడానికి పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయి. గిగ్ ఆర్థికవ్యవస్థలో కాంట్రాక్టు ఉద్యోగులుగా, పార్ట్‌టైం ఉద్యోగులుగా, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా యువత తీవ్రమైన శ్రమదోపిడీకి, జీవన అస్థిరతకు గురవుతున్నారు.

ప్రభుత్వాలు అటవీ భూముల్ని, వాటిలో నిక్షిప్తమై వున్న అత్యంత విలువైన సహజవనరుల్ని, పెసా చట్టాన్ని ఉల్లంఘిస్తూ వాటిని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ అడవి బిడ్డలైన ఆదివాసుల్ని నిరాశ్రయుల్ని చేస్తున్నాయి. ప్రతిఘటిస్తున్నవారిపై హత్యాకాండ సాగిస్తున్నాయి. శ్రామికోద్యమం, ఆదివాసీల హక్కుల పోరాటానికి అండగా నిలవాలి.

వ్యవసాయంలో 80% పని స్త్రీలే నిర్వహిస్తున్నారు. కానీ వారి జీవితాలు శ్రమదోపిడీకి, పితృస్వామిక అణచివేతకు, అనారోగ్యాలకు గురౌతున్నాయి. నిస్సహాయ, నిరుపేద స్త్రీలపై పెత్తందారీవర్గాలు లైంగిక దాడులు నిత్యం సాగిస్తున్నాయి. విద్యావంతులైన స్త్రీలు ఉద్యోగాల్లోకి ప్రవేశించడం అధికమవుతున్న కాలంలో వారిపై విద్యాలయాల్లోనూ, పని ప్రదేశాల్లోనూ అత్యాచారాలకు, అవమానాలకు పాల్పడడం మితిమీరుతున్నది. కనీస జీవనావసరాలు సమకూర్చుకొనే తాపత్రయంలో పేదవర్గాల స్త్రీలు చిరుఉపాధుల్ని ఆశ్రయిస్తున్న నేపథ్యంలో వసతుల లేమి, భద్రతాలేమి వారిని క్రుంగదీస్తున్నాయి. శాస్త్ర సాంకేతికరంగాల్లో అభివృద్ధిచెందిన పరిజ్ఞానంతో ఆధునిక యంత్రాల వంటి ఆవిష్కరణలు మానవులందరికీ సుఖశాంతులను అందివ్వటానికి ఉపయోగపడాలి. కానీ ఆవిష్కరణలన్నింటి మీద యాజమాన్య హక్కుల్ని దోపిడీదారులు ఏర్పర్చుకుని శ్రామికుల శ్రమశక్తిని మరింత చౌకగా దోచుకుంటున్నారు. శ్రామికులుగానూ, శ్రామిక కుటుంబాలలోని పీడితులుగానూ మహిళలు అత్యంత దోపిడీ పీడనలకు గురౌతున్నారు. ఫ్యూడల్ బంధనాలు, మతాలు, కులాలు మహిళల పరిస్థితులను మరింత దిగజారుస్తున్నాయి.

ఈ పరిస్థితులలో మహత్తర మేడే చరిత్ర నుండి భారత శ్రామికోద్యమం స్ఫూర్తిని పొంది మరింతగా సంఘటితమవ్వాలి. ఈ రుగ్మతలన్నిటికీ మూలకారణమైన మనదేశపు అర్ధభూస్వామ్య – అర్ధవలస సామాజికార్థిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా సాగుతున్న నూతన ప్రజాతంత్ర విప్లవోద్యమం బలీయం కావాలి. సమస్త శ్రమజీవులు సమాన హక్కులను, సమాన అవకాశాలను సాధించుకోవటానికి 'మేడే' స్ఫూర్తిని స్వీకరించాలి! మేడే శ్రమజీవులు సమస్త పీడిత జనావళి సాగించే ఉద్యమాలకు, పోరాటాలకు తమ తమ పద్ధతులలో అండదండలనందివ్వాలి!!.

# పైగంబర కవి కమలాకాంత్ మరణం



**ఐదుగురు** పైగంబర కవులలో ఒకరైన కమలాకాంత్ (వర్ఘూ సీతారామశర్మ) 24-4-2023న ముంబాయిలో మరణించారు. ఆయన గుంటూరుజిల్లా చెరుకుపల్లి మండలం పల్లెకోనలో 18-2-1941న జన్మించారు.

మానవతా భావనలతో కూడిన సాహిత్యాన్ని సృజించిన కమలాకాంత్ పైగంబర కవిగా కవితాసంకలనం తీసుకురావటానికి ముందే ఆయన మంచి కథా రచయిత. ఒక కథాసంకలనాన్ని కూడా ప్రచురించారు. 1974 వరకు గుంటూరులో పోస్టల్ మరియు టెలిగ్రాఫ్ శాఖలో పనిచేసి 1976లో ప్రమోషన్‌పై ముంబయి వెళ్ళి 1998లో రిటైరయ్యారు. అక్కడే స్థిరపడ్డారు.

ఆయన 'శాంతపెళ్ళి', 'ఆ కథ అంతే', 'బొమ్మా-బొరుసు' నవలలు రాశారు. 50 ఏళ్ళ తర్వాత ఆయన కథల్నీ, కవితల్ని 'వికాసధాత్రి', విశాఖ సెప్టెంబరు 2018లో ప్రచురించారు. 1960-1974 మధ్య కాలంలో రాసిన 23 కథలు పైగంబర కవిగా రాసిన 8 కవితలూ కలిపి 'అసమ బాహు త్రిభుజం' పేరుతో ప్రచురించారు. కమలాకాంత్ రచనలన్నింటినీ కలిపి 'కెంపులు - మందారాలు' అనే సంకలనంగా తీసుకువచ్చారు.

కథ

# ఖూనీ

- కాశీపట్నపు పేర్రాజు

**వాతావరణమంతా** వేడిగాను, ఉక్కగాను ఉంది. దానికి తోడు కరెంటు కోత వల్ల ఒళ్ళంతా చెమటతో తడిసి పోయి చిరాగ్గా ఉన్నాడు సబ్ ఇన్‌స్పెక్టర్ వాసు. ఏదో కేసు ఎంక్వైరీ కోసం బయటకు వెళ్ళిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్ కోసం ఎదురు చూస్తూ స్టేషన్లో ఒంటరిగా కూర్చున్నాడు. టోపీ తీసి పక్కన పెట్టి జుత్తు సవరించుకుంటూ టేబిల్‌పై ఉన్న కోర్టు కేసుకు సంబంధించిన ఫైలు తీసి చదువుతున్నాడు.

అప్పుడు వచ్చాడా అగంతకుడు.

వస్తూనే....

"బావూ.... ఎస్సై బావూ.... నువ్వు బేగి బయలెల్లి మా ఊరొచ్చి ఆళ్ల నందరిని అరెస్టు సేసి బొక్కలో ఏసియాల" అంటూ తలపాగా తీసి ముఖం చేతులు తుడుచుకొని భుజం మీద వేసుకున్నాడు.

ఎస్సై వాసు తల ఎత్తి చూశాడు. పొడుగు, పొట్టి కాని ఎత్తు, దృఢంగా ఉన్న శరీరం, మోకాళ్ళ దిగువ వరకు ఎత్తి కట్టిన పంచె, పైన ఖద్దరు జుబ్బా, భుజం మీద తువ్వాలు, చేతిలో క్రరతో ఎదురుగా నిల్చున్న ఆగంతకుడ్ని చూసి

"నీ పేరేంటి?

"సన్నాసండి"

ఏ ఊరు?

"కిల్లిపాలెం....."

కిల్లిపాలెమా.....?

"కాదు బావూ.... కిల్లిపాలెం అడ్రోడ్డుకి మూడు కోసుల దూరంలో ఉన్న నక్కపాలెం".

నక్కపాలెమా?

"అవును బావూ".

"ఆc.. ఏదో చెబుతున్నావ్" ఏంటి?

"సెప్పేను కదా బావూ ఇన్నేదా

"అదే బావూ, అందరూ కలిసి సంపేంద్రు. నెమ్మది నెమ్మదిగా పీక నులిమి సంపీసేరు బావూ...."

నువ్వు ఎమ్మట్నే బయలెల్లి ఆళ్లనందరినీ అరెస్టు చేసి జైల్లెట్టి కుళ్ళబొడిసీయాల్నా కొడుకులందర్నీ". అన్నాడు.

"చంపీశారా...." ఎవర్ని? ఎందుకు? చంపడం నువ్వొక్కడివే చూశావా? ఇంకెవరైనా చూశారా? అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు వేశాడు ఎస్సై వాసు.

"నానే కాదు.... అందరూ సూస్తుండగానే సంపీశారు బావూ"

"అందరూ చూస్తుండగానే చంపేశారా...." అంటూ

ఒక్క క్షణం ఆగి

"అంతమంది చూస్తే నీతోపాటు ఇంకెవరు రాలేదేం" అంటూ సన్నాసివైపు అనుమానంగా చూశాడు.

"అల్లెవురికీ దైర్నం లేదండి. రండర్రా టేషన్కెల్లి రుపోటు ఇద్దాం అని బయల్దేరదీశాను. కానీ వొవ్వుళూ కదల్లేదు. నేనుండలేకపోనాను. అదీకాక నా మనసుకు సాలొచ్చింది. అందుకే రుపోర్టు సెయ్యినానికొచ్చేను". అన్నాడు. కళ్ళు పెద్దవి చేసి తలెగరేస్తూ.

ఖూనీ కేసులైతే కానిస్టేబుల్స్‌తో సహా వెంటనే బయలుదేరుతాడు. కానీ ఈ కేసులో ఏదో తిరకాసుంది. రిపోర్టు చేయడానికి వచ్చిన మనిషి మాటలు ఎంతవరకు నమ్మాలో అర్థం కావట్లేదు. అందుకే అతను చెప్పినది పూర్తిగా వినడానికి నిశ్చయించుకుని అతనివైపు తిరిగి నువ్వు చెప్పు అన్నట్టుగా తలెగరేశాడు ఎస్సై వాసు.

సన్నాసి ఎస్సైని చూస్తూ క్రింద కూర్చో బోయాడు. బెంచి మీద కూర్చో అన్నట్టుగా సైగ చేసి "ఇప్పుడు చెప్పు" అన్నాడు ఎస్సై.

"నాను సెప్తాను నువ్ రుపోర్టు రాసుకో బావూ...." అంటూ బెంచీని కొంచెం ఎస్సైకి దగ్గరగా జరిపి కూర్చున్నాడు.

"సరే సరే.... రాసుకుంటాను గాని ఎవరు ఎవర్ని చంపారు.... ఎందుకు చంపారో వివరంగా చెప్పు". అన్నాడు ఎస్సై.

"బావూ.... ఎస్ఐ బావూ.... ఈ ఖూనీకి ఇప్పుడు కాదు బావూ.... ఇప్పుడు కాదు.... పదేళ్ళ కిందటే యిత్తనం పడింది. ఈ ఖూనీ ఎలా జరిగిందో నీకు పూర్తిగా ఎరుకవాలంటే అప్పటి కానించి మొదలెట్టాలి. నాను సెప్పేది నువ్ కూసింత ఓపికతో యినాలి.

"మా ఊరు నక్కపాలెం అని సెప్పేను కదా. మా ఊరి గురించి తెలిసినోళ్ళందరికీ మా ఊరికి తూర్పుగా కొంచెం అయిమూలగా కొత్తపేట కేసి.... అదే సెల్లయ్యమ్మ అగ్గురోరం అంటారు కదా, అటుకేసి పదెకరాల యిస్తీర్ణంతో ఉండే టిక్క సెరువు గురించి తెలుస్తాది. ఎందుకంటే బావూ.... మా ఊరికి ఆ సెరువుకి ఎంత బందం ఉందో మాటల్లో సెప్పలేం. అసలు టిక్క సెరువు నేకపోతే నక్కపాలేమూ నేదు, మావూcనేము అనీవోరండీ.... మా పెద్దలు అంటూ తల పైకెత్తి ఒక్క క్షణం కళ్ళు మూసుకొని దండం పెట్టాడు సన్నాసి.

మళ్ళీ ఎస్సై వైపు తిరిగి "ఎందుకంటే బావూ ఏసవిలో ఏ సెరువు ఎండినా మా టిక్క సెరువు మాత్రం ఎండేది కాదు. నిండు ఏసంగిలో కూడా మొలబంటెడు నీరుండేది. సెరువుకి ఎగాన మెరక భూవూcలు దిగాన పల్లంబావుcలు ఉండేవి. ఏమాత్రం గట్టిగా వర్సం పడినా వర్సానికి మా ఊరికి ఐదారు కోసులు దూరంలో ఉన్న సిట్టడివి కానించి బయలెల్లిన ఈరన్నగడ్డ దారిలో ఉన్న సిన్నా సితక బట్టీలన్నింటినీ కలుపుకొని వోనాకాలంలో నదిలా పెవసించి టిక్కసెరువు కడుపునిండా నీరు నింపీసీది బావూ. ఆ గెడ్డకి అటు ఇటు

పచ్చగా ఉన్న మొగల్దొంకలు నుంచొచ్చిన పూలవోసన మత్తు….గా ఉండి పెనిమిటికి పెళ్ళాన్ని, పెళ్ళానికి పెనిమిటిని యాదకొచ్చినట్టు సేసీదండి" అని మళ్ళీ చెప్పబోతుండగా గుమ్మం దగ్గర అయిన అలికిడికి ఇద్దరు తల ఎత్తి చూసారు. హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ వచ్చి ఎస్పైకి సెల్యూట్ చేసి నిలబడ్డారు. వారికి చెప్పవలసిన విషయాలు చెప్పి వారిని పంపించేసి" చెప్పు…. నువ్వు చెప్పు" అన్నట్టుగా సన్నాసి వైపు చూశాడు ఎస్పై.

సన్నాసి అలాగే అన్నట్టుగా తల ఊపి –

"పెద్ద వర్సాలకైతే బావూ…. టిక్క సెరువు నిండిపోగా మిగులు నీరు సెప్టా మీంచి పారి కారుబట్టీ కెళ్ళి బక్కన్నపాలెం కావుఁడు సెరువు కూడా గంగతో నిండిపోయేదండి. అలా సెప్టా మీదనుండి పారుతున్న గంగను సూడ్డానికి పెద్ద సిన్న అని తేడా లేకుండా ఎగబడి పోయివోరండి జనాలు. ఏం గంగండీ బావూ…. ఎంత గంగండీ…. ఆ గంగను సూడ్డానికి రెండు కళ్ళు సాలవండి బావూ…. రెండు కళ్ళు సాలవు" అని చెప్పి ఏదో మగతలోకి వెళ్ళినట్లు కళ్ళు మూసుకొని అలా ఉండిపోయేడు సన్నాసి.

ఎస్పై కొంచెం ముందుకు వంగి సన్నాసి భుజాన్ని పట్టుకొని కుదిపేడు. మళ్లీ ఈ లోకంలోకి వచ్చినట్లు "ఆఁ…. ఆఁ…. బావూ గంగ కళ్ళముందు కొచ్చినట్లయ్ అలా ఉండిపోనాను బావూ.. ఉండిపోనాను". అని సర్దుకుని మళ్ళీ చెప్పటం మొదలెట్టాడు.

"సెరువులో నీళ్లు పికపికలాడుతున్నట్లే ఊళ్లో వాళ్ళ ముఖాలు కళకళలాడుతూండేవి బావూ…. పంట పోతుందన్న దిగులుండేది కాదేమో పెద్ద మొత్తం బీమా సేసినట్లు దీమాగా ఉండీవోళ్ళం.

"సిన్న వర్సాలకి యితనాలు జల్లీసీవోళ్ళం. పెద్దొర్సాలు పడీసరికి ఆకులు ఎదిగీసీవి. మొగోళ్ళం దమ్ములకు దిగీవోళ్ళం. ఆడోళ్ళు పాటలు పాడుకుంటా ఉడుపులు ఉడిసీసీవోరు. ముసలి ముతక, ఉయ్యాల్లో పిల్లలు తప్ప ఊరు ఊరంతా పొలాల్లోనే ఉండీ వోరం బావు".

"ఉడుపులు పూర్తవగానే ఆ సెరువుగట్టు మీదే శిలాపెతిమ రూపంలో ఉన్న జల దేవతకు వరద పాశం పోసీవోళ్ళమండి. ఆ తరువాత నెలలో మమ్మల్ని మా ఊరిని కాపాడుతున్న నీలమ్మ, సింతమ్మ, అసిరమ్మ గేమ దేవతలకి మొక్కుబడులు చెల్లించి వోరాలు సేసీవోరమండి. ఆ తంతు అలాగయిాదో లేదో గౌరీపున్నం వచ్చేసీదండి. ఇక సూడండి బాబు సందడి…. సందడే…. సందడి…. నందెమ్మ, గౌరమ్మలను నిలిపి కొలిచీవోరమండి. పులి వేసాలు, తాటకి, ఆంజనేయుడు తాౘ్రాజు వోళకాలు ఇలా రోజుకొక వేసం ఏసీవోరండి. ఒకపక్క గాబు తీతలు, గుండలు జల్లడాలు, నీరు కట్టడాలు, ఇంకోపక్క సంబరాలు. ఊరంతా ఇళ్ళల్లో ఉండివోరం కాదండి. ఉంటే పొలంలో నేకపోతే ఊరంతా తిరిగే వేషాలతో రోడ్లమీద ఉండీవోరం. ఎన్నెల రాత్రుల్లో కుఱ్రాళ్ళే కాదండి, నడివొయస్సోళ్ళు, పిల్లలు అందరూ కూడా జాతుల్ని, కులాల్ని మరిచి బావ, మావ, బాప్పు, అన్నా, వదిన, మరిది అంటూ వరుసలు కలుపుకుంటూ అరుపులు, కేకలతో అర్ధరాత్రి వరకు పరాచకాలాడుతూ ఉండివారమండి. పది పదిహేను రోజుల తరువాత డప్పులతో సంబరాలు చేసి నందెమ్మ, గౌరమ్మలను అంపీసీ వోరండి". అని ఒక దీర్ఘ శ్వాస తీసుకున్నాడు సన్నాసి.

అంతలోనే నమస్కారం ఎస్పైగారు అంటూ వచ్చి కొబ్బరి బొండాం అందించాడు. పోలీస్‌స్టేషన్‌కి ఎదురుగా రోడ్డుకు అవతల ముద్దాయిలా నిల్చున్న చెట్టు కింద కొట్టు పెట్టుకున్న యజమాని.

"తాతా! కొబ్బరి బొండాం కావాలేటి. పదిహేను రూపాయిలే తాగుతావేటి ఎండగా ఉంది కదా!" బేరం కలిసొస్తుందేమోనని ఆశపడి అడిగాడు. వద్దంటున్నట్టుగా చెయ్యి ఊపేడు సన్నాసి. ఎస్పై తాగిన బొండాన్ని తీసుకొని వెళ్ళిపోయాడు అతను. రుమాలుతో మూతి తుడుచుకుని నువ్వు చెప్పు అన్నట్టుగా సన్నాసివైపు చూశాడు.

"యవసాయానికి కట్టిన నీరు పోగా టిక్క సెరువు కాస్త సిక్కినట్లుండేది. సక్కనమ్మ సిక్కినా అందమే అన్నట్లు, సిక్కిన సోటల్లా పచ్చని పచ్చికతో మిలమిలా మెరిసిపోయేది. ఊర్లో శానామందికి పశువులు ఉండేవి. పశుల కాపర్లు పగలల్లా వాటిని అడవి గుడ్లంట తిప్పి, సాయంకాలం అయ్యేసరికి టిక్కసెరువు కాడికి తీసుకొచ్చి మేపీవోరు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కడుపునిండా పచ్చిక తిని కావలిసినంత నీరు తాగీవి. కొన్ని వందల పశువులతో ఆ సెరువంతా కళకళలాడిపోతూ ఉండేదండి. అవి మేమున్నతంగ సేపు సొమ్ములు గుంటలు సెరువులో ఈత కొడుతూ తాన్నాలు సేసీవోరు". అని ఒక్క క్షణం ఆగి మళ్ళీ మొదలుపెట్టబోయి ఎందుకో బుర్ర దించుకుని కూర్చున్నాడు సన్నాసి.

ఏమయ్యింది….? అడిగాడు ఎస్పై.

తల పైకెత్తి ఎస్పై కళ్ళలోకి చూశాడు సన్నాసి.

అంతవరకు మనిషిలో హుసారు, గొంతులో సంతోషం కలిపించిన ఎస్పైకి సన్నాసి ముఖంలో, కళ్ళలో కూడా దిగులు కనిపించింది.

సన్నాసి సర్దుకుని కూర్చొని, గొంతు సవరించుకొంటూ "ఏటి పోయేకాలం దాపరించిందో, మావేఁటి పాపం సేసినామో లేక ఏ జనమ శాపమో గాని బావూ….

ఇటు భూ అభిరుద్ధి పథకం అంటూ గవర్మెంటోళ్ళు టిక్క సెరువు గరబంలో, ఈరన్న గెడ్డకి అటూ ఇటూ ఉన్న మెరకలో గట్లు పోయించీసినారు. ఓ పద్ధతి, పాడు నేకుండా పేదల పేరు మీద దపదపాలుగా పట్టాలు పంపిణీ సేస్సారు. పట్టాలు తీసుకున్నోళ్ళు, పెద్దోళ్ళు అండతో సాగులోకి దిగి ఇచ్చిందానికన్నా ఎక్కువ వర కట్టీశారు".

"అటు నీటి ఎత్తిపోతల పథకం అంటూ యీరన్నగెడ్డలో అడ్డంగా అక్కడక్కడ ఎత్తుగా సెప్టాలు కట్టీశారు".

"సెరువులో ఉన్న సొశానాన్ని కూడా ఇడలేదు. దాన్ని కూడా కలుపుకొని ఫారెస్టాపీసోళ్ళు తుమ్మ తోపు ఏసీసేరు. పక్కూర్లకు రాకపోకలకని యీరన్న గెడ్డని సగం వరకు కప్పీసి రోడ్డేసీసేరు".

రాను రాను ఈరన్నగడ్డ రూపురేకలు మారిపోనాయి. కాదు కాదు మార్చేసినారు బావూ…."

అవే రోజుల్లో సిట్టడివి దాని చుట్టూతా ఉన్న బంజర భూమి దక్కించుకున్న నాయుడు బాబు అడవి అంతా కొట్టించీసి, బోర్లు తవ్వించీసి యవసాయం మొదలెట్టేడు".

"వాగులు వంకలు బట్టీలు ఎక్కడికక్కడ మాయమైపోయాయి. కాదు బాబు మాయం చేసేసి ఈరన్నగెడ్డకు, టిక్క సెరువుకి

తెగతెంపులు సేసీసేరు. దీనివల్ల టిక్కసెరువు ఎండిన డొక్కలా తయారయింది. దాన్ని నమ్ముకుని బతుకుతున్న సెరువు ఆయకట్టదారుల రైతుల కడుపులకు తిండి కరువైంది”.

“నీరు లేక వరుసగా ఈ ఏటితో నిండా పదేళ్లు పంటలు పండలేదు. పంటలేని సెరువు కింద భూముల రేట్లు రాను రాను పడిపోనాయి. ఆస్తుల అంచనాలు తారుమారు అయిపోయినాయి బావూ.... తారుమారు అయిపోయినాయి”. అంటూ డగ్గుత్తికతో కొంతసేపు మాట్లాడలేకపోయాడు సన్నాసి. తరువాత గొంతు కూడదీసుకుని అప్పులు ఇచ్చినవాళ్లు అరువిచ్చినోళ్ళు బెడదలు ఎక్కువైపోయి పశువులకు మేత తగ్గిపోవడం వలన సాకలేక చాలామంది ఎడ్లతో సహా పశువుల్ని అమ్ముకున్నారు. ఉన్నవాటి విలువలు తగ్గాయి. ఆకలి అప్పులు తెలియని ఆఫీసర్లు కార్లలో వచ్చి చూసి వెళ్లారు. మండలం మొత్తం మీద చూస్తే వర్షాలు బాగానే పడ్డాయి అంటూ కరువు ప్రాంతంగా ప్రకటించడం అవదని తేల్చేశారు. ప్రతి సంవత్సరం ఇదే తంతు పది సమత్సరాలుగా పడుతున్నాం బావూ. ఏటి సెయ్యాలో తెలియక, ఏటి సెయ్యినానికి మా మెదళ్లకు పదును సాలక శానమంది రైతులు బూవుల్ని అమ్మీసుకున్నారు. పొమ్మనలేక పొగబెట్టినట్లు అమ్ముకునే ఇరకాటంలోకి నెట్టిసినారు బావూ..... నెట్టీసినారు”.

“నెల రోజుల కితం నానూ దస్తావేజి మీద నిశాని ఎట్టీసేను. మూడు తరాల కితం మా ముత్తాత సన్నాసి సంపాదించిన భూమాతని ఈ సన్నాసిగాడు.... ఈ సేతకాని సన్నాసిగాడు దారపోసీసేడు బావూ.... దారపోసీసేడు” అంటూ బెంచీ మీద నుండి దిగి కింద కూర్చుని తలొంచుకుని పిడికిలి బిగించి నేలమీద గట్టిగా కొడుతున్నాడు.

ఎస్సై ఏదో అనీలోగా

“నమస్కారం ఎస్సైగారూ....” అంటూ ఇద్దరు కుర్రాళ్ళు వచ్చేరు.

“సారీ ఎస్సైగారూ.... ఇతను మా మామయ్య.... పదిరోజుల కాణ్ణించి, ఖూనీ చేసారు, స్టేషన్‌కి వెళ్ళి పోలీసులకి రిపోర్ట్ ఇచ్చి ఆళ్ళనందర్నీ జైల్లో పెట్టిస్తానంటూ అందరితో చెబుతూ తిరుగుతున్నాడు. నిన్న రాత్రల్లా అదేమాట. ఒక్క క్షణం పడుకోలేదు. మమ్మల్ని పడుకోనివ్వలేదు. డాక్టరుకి చూపిద్దామనుకుని ఎందుకైనా మంచిదని గదిలో పెట్టి ఉంచేం. అది తెలీక పిల్లలెవరో తలుపు తీస్తే ఇలా వచ్చీశాడు. అనుమానం వచ్చి ఇక్కడికి వచ్చాం, మీరేమి అనుకోకండి” అంటూ అతన్ని తీసుకెళ్ళబోతుంటే –

వాళ్ళ నుండి విడిపించుకోడానికి పెనుగులాడుతూ

“బావూ.... ఎస్సై బావూ.... ఉప్పుడు ఎరుకయ్యిందా యెవురు యెవుర్ని ఖూనీ సేసేరో.... ఖూనీ కోరులు ఎవురో.... రుపోర్టు రాసుకున్నావు కదా! బేగొచ్చి ఆ ఖూనీ సేసినోళ్ళందరిని అరెస్టు సేసి జైల్లెట్టి కుళ్ళబొడిసీయాల బావూ.... ఎస్సై బావూ.... బేగి రావాల.... బావూ.... బేగి రావాల అంటూ అరుస్తున్నాడు.”

అతని అరుపులు గాలిలో కలిసిపోయాయి. ●

## ఆచార్య రవ్వా శ్రీహరి మరణం



**తెలుగు,** సంస్కృతం భాషలలోనూ, సాహిత్యంలోనూ విశేష కృషి చేసిన రచయిత రవా శ్రీహరి 21-4-2023న హైదరాబాదులో తన 80వ యేట మరణించారు. ఆయన స్వగ్రామం నల్లగొండ జిల్లా వలిగొండ మండలం వెల్వర్తి గ్రామం. ఆయన అమ్మమ్మగారి వూరు రామన్నపేట తాలూకా మునిపంపుల గ్రామంలో 7-9-1943న పేద కుటుంబంలో జన్మించారు.

ఉచిత భోజన సౌకర్యంతో విద్యాబోధన చేసే యాదగిరిగుట్ట సంస్కృత విద్యాపీఠంలో నాలుగేళ్ళు, సీతారాంబాగ్‌లోని మున్నాలాల్ సంస్కృత కళాశాలలోనూ సంస్కృత విద్యాభ్యాసం చేశారు. 1967లో ఉస్మానియాలో సంస్కృతం ఎమ్.ఏ., ఆ తర్వాత తెలుగు ఎం.ఏ., అప్లైడ్ లింగిస్టిక్స్‌లో పి.జి. డిప్లమో ప్రైవేటుగా చేశారు. మొదట వివేకవర్ధిని కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా, ఆ తర్వాత ఆరేళ్ళపాటు ఆంధ్ర సారస్వత పరిషత్తువారి ప్రాచ్య కళాశాలలో, 1973లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా, కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా 17 ఏళ్ళు పనిచేసి 2002లో ద్రవిడ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా చేశారు. రిటైరైన తర్వాత 2011లో టి.టి.డి. ప్రచురణల విభాగం ప్రధాన సంపాదకునిగా పనిచేశారు.

తన 17వ యేట “కాళహస్తీశ్వర శతకం”లోని పది పద్యాలు సంస్కృతంలోకి అనువదించిన రవ్వా శ్రీహరి, తెలుగు కావ్యాలను సంస్కృతంలోకి అనువదించారు. 50కి పైగా తెలుగు, 25 సంస్కృత గ్రంథాలను రచించారు. వారి రచనల్లో ముఖ్యమైనవి 1. శ్రీహరి నిఘంటువు. దీనిలో 13 వేల అచ్చ తెలుగు పదాలు పొందుపరిచారు. 2. నల్లగొండజిల్లా మాండలిక పదకోశం; 3. తెలుగులో అలబ్ధ వాఙ్మయం; 4. వాడుక తెలుగులో అపప్రయోగం; 5. అన్నమయ్య పదకోశం; 6. అన్నమయ్య భాషావైభవం; 7. అన్నమయ్య అచ్చతెనుగు; 8. అన్నమయ్య సూక్తి వైభవం మొదలైనవి. సినారె ‘ప్రపంచ పదులు’, జాషువా ‘పిరదౌసి’, ‘గబ్బిలం’, వేమన ‘నరసింహ శతకాలను’ సంస్కృతంలోకి అనువదించారు. ●

## దేశ విభజన వస్తువుగా సాహిత్యం-9

# అనీస్ కిద్వాయ్ ఉర్దూ రచన 'ఆజాదీకి ఛాయోంమేం'

- కొత్తపల్లి రవిబాబు

**ఇది** నవల కాదు. అనీస్ కిద్వాయ్ భర్త 1947 అక్టోబర్‌లో హత్యకు గురైన తర్వాత, ఆమె ఢిల్లీ వెళ్ళి శరణార్థుల శిబిరాలలో శాంతిసేన తరపున చేసిన సేవా కార్యక్రమాలలో వచ్చిన అనుభవాలను, ఎదుర్కొన్న సమస్యలను చిత్రించిన పుస్తకం. అనీస్ కిద్వాయ్ 1906-1982 మధ్య జీవించారు. తాను జన్మించిన బారాబంకి (ఉత్తరప్రదేశ్)లో బాల్యం గడిపారు. తండ్రి షేక్ విలాయత్ అలీ ప్రముఖ లాయరు. దేశభక్తి గల కుటుంబమే కాని ఛాందస కుటుంబం. కనుక ఆమె బయటకు వెళ్ళి చదువుకోలేదు. తన సోదరులకు ఇంటికి వచ్చి చదువు చెబుతుంటే ఆ పాఠాలు చాటుగా విని ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో స్వయంగా ప్రావీణ్యం సంపాదించారు. షఫీ అహ్మద్ కిద్వాయ్‌ని 1920లో వివాహం చేసుకుని అలహాబాదులోనూ, భర్త ఉద్యోగరీత్యా ఇతర పట్టణాలలోను ఆమె జీవించారు. షఫీ సోదరుడు రఫీ అహ్మద్ కిద్వాయ్ స్వాతంత్ర్య సమరయోధుడు. నెహ్రూ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. అనీస్ 1921-23 మధ్య కాలంలో మహిళా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. 1947 నాటి మత అల్లర్లలో షఫీని దేరాడూన్‌లో హత్య చేశారు. దానితో ఆమె అప్పటివరకు పాటించిన మతాచారాన్ని వదిలివేసి, బురఖా తీసివేసి, ఢిల్లీ వెళ్ళి సుభద్రాజోషి, మృదులా సారాభాయ్ మొదలగువారితో కలసి మత ఘర్షణలకు గురైన బాధితులకు పునరావాస కార్యక్రమంలో శాంతిదళ్‌లో అవిశ్రాంతంగా పనిచేశారు. పాకిస్తాన్ నుండి ఢిల్లీకి పారిపోయి వచ్చినవారికీ, కిడ్నాప్ అయిన స్త్రీలకు, పిల్లలకు - హిందూ, ముస్లిం రెండు మతాలవారికీ లక్నోలో ఒక రక్షణ కేంద్రం నిర్వహించారు. 1956-1962లో రాజ్యసభ సభ్యురాలిగా వున్నారు. న్యూఢిల్లీలోని జామియా మిలియా విశ్వవిద్యాలయపు కోర్టులో సభ్యురాలిగా పనిచేశారు. ఆమె తన 76వ యేట 1982 జులై 16న మరణించారు.

'ఆజాదీకి ఛాయోంమేం' (స్వాతంత్ర్యపు నీడలో) అనే ఈ పుస్తకాన్ని అనీస్ ఉర్దూలో సెప్టెంబర్ 1948 నుండి జనవరి 1949 వరకు - ఆరు నెలలపాటు రాశారు. ఆ పుస్తకం ఉర్దూలో 1974లో పుస్తక రూపంలో వెలువడింది. 1978లో రెండవ ముద్రణ వచ్చింది. 1981లో హిందీ అనువాదం వెలువడింది. మనుమరాలు ఆయేషా కిద్వాయ్ చేసిన ఇంగ్లీషు అనువాదం 2011లో పెంగ్విన్ ప్రచురణగా 'ఇన్ ఫ్రీడమ్స్ షేడ్' పేరుతో వెలుగుచూసింది. ఆయేషా కిద్వాయ్ ఢిల్లీలోని జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

అనీస్ కిద్వాయ్ ఈ పుస్తకమేగాక ఇంకా 1976లో వ్యాస సంపుటి "నజ్రే ఖుష్ గుజ్రే"; 1981లో 'అబ్ జిన్‌కే దేఖ్‌నే కో', 'జులుమ్', 'చర్‌రుఖ్' అనే పుస్తకాలు కూడా రాశారు. దేశ విభజన సందర్భంగా అపహరణకు గురైన స్త్రీలను, విభజన తర్వాత మూడేళ్ళపాటు రక్షించే కార్యక్రమాన్ని నిర్వహించిన అనీస్ కిద్వాయ్, కమలాబెన్ పటేల్‌ల సామాజిక సేవా కృషిని చిత్రిస్తూ ఆకాంక్ష దామిని జోషి సహదర్శకురాలిగా 'మెర్సియా 1947' అనే లఘుచిత్రం విడుదలైంది.

రెండు ముక్కలైన దేశాన్ని మరింత ముక్కచెక్కలు గాకుండా, పునర్నిర్మించే కార్యక్రమం చేబట్టారు అనీస్. ఢిల్లీలోని పురానాఖిలాలోనూ, హుమయూన్ టూంబ్ ప్రాంతాలలో ఏర్పరచిన పునరావాస శిబిరాలు కేంద్రంగా ఆమె సేవా కార్యక్రమాలు కొనసాగాయి. వీధులు శ్మశానాలుగా మారితే, సమాధులు, శిథిలమైన భవనాలు రక్షణ ఇచ్చిన ఆవాసాలుగా మారాయి. బాధితులు అనీస్‌ను 'అనీస్ అక్కా' అని పిలిచేవారు.

ఈ శిబిరాలలో పనిచేస్తున్న సందర్భంగా కలుసుకున్న బాధితుల గాథలు వారిపట్ల ప్రభుత్వసంస్థల నిరాసక్తత, ప్రభుత్వ ఉద్యోగుల ఉదాసీనత, జరిగిన ఘర్షణలు మొదలైనవాటి సమాహారమే 'ఇన్ ఫ్రీడమ్స్ షేడ్' అనే పుస్తకం. ఒక తల్లి రెండు చేతులు నరికివేయగా, కూతురుతోపాటు ఆసుపత్రిలో చేరింది. కాని ఆమె తన కూతురి తల నిమరడానికి చేతులు లేకపోవడాన్ని తలచుకొన్న దుఃఖాన్ని మనం వూహించలేమని వ్యాఖ్యానించారు అనీస్. బాధితులకు కావాల్సిన దుప్పట్లు ప్రభుత్వం సరఫరా చేయలేదు. రెండు ఇటుకరాళ్ళు దొరికితే దానినే పొయ్యిగా మార్చుకునేవారు. చలికాలం వల్ల న్యూమోనియాతో బాధపడేవారు. ఇన్‌ఫ్లుయెంజా విజృంభించే కాలం. కాని తగినంత వైద్య సౌకర్యం లేదు.

పురానాఖిలా శిబిరంలో చనిపోయినవారిని అక్కడ పూడుద్దామంటే అక్కడి మౌల్వీ శవానికి చేయాల్సిన క్రతువును నిరాకరించాడు. దానితో అక్కడి స్వచ్ఛంద సేవకులే ఆ శవాన్ని ఖననం చేశారు. హుమయూన్ టూంబ్ శిబిరంలో శవానికి చుట్టే వస్త్రాలు చాల చిన్నవాటిని సరఫరా చేయగా, ఆ చనిపోయినవారి దుపట్టాలతోనో, మాసిన గుడ్డలతోనో ఖననం చేసిన సందర్భాలున్నాయి.

ఢిల్లీ క్లాత్‌మిల్ వారికి ఢిల్లీలోనూ, పాకిస్తాన్‌లోని లైలాపూర్‌లోనూ ఫ్యాక్టరీలున్నాయి. విభజన సమయంలో వారు ఆ ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న శ్రామికులను మార్పిడి చేసుకోవడం ద్వారా ఒక ఆదర్శాన్ని చూపించారు.

శిబిరాలలో స్త్రీలు పీడకలలు వచ్చి అర్ధరాత్రి అరుపులతో లేచి కూర్చునేవారు. ఆనాడు ప్రజలు మృగాలుగా మారిపోయారు. ఎవరిని ఎలా చంపాలా అని కుట్రలు రచించేవారిగా మారిపోయారు. స్త్రీల శరీరాలు ప్రతీకారానికి చిహ్నాలుగా మారాయి. విభజన సమయంలో జరిగిన అసంఖ్యాక దారుణాలను, బాధితుల గాథలను, వారి మానసిక స్థితిని ప్రత్యక్ష సాక్షిగా అనీస్ ఈ పుస్తకంలో పొందుపరిచారు. కాంగ్రెస్‌పార్టీ అనాసక్తత, ఆర్.ఎస్.ఎస్. కుట్రలూ, కుహకాలు కూడా అనీస్ బట్టబయలు చేశారు. శాంతిదళ్ సభ్యులు ఈ బాధితులకు స్కూళ్ళు నిర్వహించి, వీధుల్లో ఆటలు ఆడించి, ముషయిరాలు జరిపి, చేతివృత్తులు ప్రోత్సహించి వారి జీవితాలను పునర్నిర్మించారు. మానవత్వానికి తగిలిన ఈ గాయాన్ని మాన్పటానికి జరిగిన కృషిని వివరించారు. మానవుడిలోని మృగత్వంపై మానవత్వం సాధించిన విజయాన్ని ఆమె ఈ పుస్తకంలో చిత్రించారు.

**(వచ్చే సంచికలో : యశపాల్ నవల "ఝూటాసచ్")**

# న్యాయస్థానాలలో న్యాయం ఎవరిపక్షమో తెలియచేసిన వాకపల్లి ఆదివాసీ మహిళల అత్యాచార సంఘటనపై కోర్టు తీర్పు

**16 సం॥ల** క్రితం 2007 ఆగస్టు 10న నక్సల్స్ వ్యతిరేక పోలీసు దళానికి చెందిన పోలీసులు కూంబింగ్ కోసం విశాఖజిల్లా వాకపల్లి గ్రామానికి వెళ్ళారు. కూంబింగ్‌లో భాగంగా ఆ గ్రామంలోని కోందు తెగకు చెందిన ఆదివాసీ మహిళలపై అత్యంత దుర్మార్గంగా అత్యాచారం చేశారు. కుల కట్టుబాట్లను ఎదుర్కొంటూ తమపై జరిగిన అత్యాచార ఘోరం గురించి ఆ మహిళలు సమాజం ముందు వెల్లడి చేశారు. అటవీ సంపదలను దోచుకుంటున్న దోపిడీవర్గానికి అండగా నిలబడుతూ, ఆదివాసీలను అడవుల నుండి గెంటివేస్తూ, నక్సల్స్ ఏరివేత కోసం కూంబింగ్‌ల పేరుతో ఆదివాసీలను హతమారుస్తున్న ప్రభుత్వం, పోలీసులు మాపై అత్యాచారం చేశారని వెల్లడిచేసిన ఆదివాసీ మహిళలకు ఏవిధమైన న్యాయం చేయగలరో మనకి తెలిసిందే. ప్రజాసంఘాలు గళమెత్తటంతో సంఘటన జరిగిన 18 రోజులు తర్వాత ఆలస్యంగా వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఆరోజు గ్రేహౌండ్ పోలీసులు వాకపల్లి వెళ్ళారని, వారి పేర్ల జాబితాను విడుదల చేశారు. అప్పటినుండీ కేసును వైద్య నివేదికల, సాక్ష్యాధారాల చుట్టూ తిప్పారు. న్యాయం కోసం వాకపల్లి మహిళలు అన్నిరకాల అడ్డంకులను, బెదిరింపులను ఎదుర్కొంటూ పోరాడారు. ఆఖరికి సుప్రీంకోర్టు చొరవతో ఎస్సీ & ఎస్టీ (పిఓఏ) చట్టం క్రింద ప్రత్యేక కోర్టు విచారణ చేసి – సాక్ష్యాధారాలు, దర్యాప్తు జరపటంలో వున్న వైఫల్యాలను ఎత్తిచూపుతూ 13 మంది పోలీసులను నిర్దోషులుగా ప్రకటించింది. నేరం జరిగింది కానీ నేరస్థులే లేరనే విధంగా వ్యాఖ్యానించింది.

ఆదివాసీలు, దళితులు, మహిళలపై అత్యాచారాలు, హత్యాకాండలు జరిగిన ప్రతి సందర్భంలోనూ న్యాయస్థానాలు ఎవరిపక్షం వహిస్తున్నాయో మరోసారి ఋజువయ్యింది. రక్షక భటులు – భక్షక భటులేనని రమీజాబి, షకిలభాయి కేసులలోనే తేటతెల్లమయింది. అది కాశ్మీరైనా, వాకపల్లి అయినా, యుద్ధాలు జరిగే ప్రాంతాలైనా పోలీసులూ, సైనికులూ మహిళలపై అత్యాచారాలు చేయటం, అవమానపర్చటం చేస్తూనే వున్నారు. లక్ష్మింపేట, చుండూరు, కారంచేడు, ఆనాటి కీలవేన్మణి.... ఏ సంఘటన చూసినా చరిత్ర అంతా భూయజమానుల పక్షానే ప్రభుత్వం, చట్టాలు నిలబడ్డాయే తప్ప దళితులకు, మహిళల మాన ప్రాణాలకు విలువివ్వ, రక్షణగానూ లేరు. 75 సం॥ల ఆజాదీకా అమృత మహోత్సవాలు వేళ మన ప్రజాస్వామ్యపు మేడిపండు రూపాన్ని, మన న్యాయస్థానాల నేతిబీర చందాన్ని మరోమారు వెల్లడి చేసిందీతీర్పు. చట్టాలపట్ల, కోర్టులపట్ల వున్న భ్రమలను పటాపంచలు చేశాయి. ఇక నిముష నిముషానికి స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులు, అవమానాలకు జవాబుదారీతనం లేదనే వాస్తవాన్ని మన ముందుంచింది.

# సాహితీవేత్త డా॥ గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి మరణం

**సాహిత్య** విమర్శ – పరిశోధనారంగాలలో విశేష కృషి చేసిన డా॥ గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి తన 55వ యేట 24-4-2023న సిద్దిపేటలో గుండెపోటుతో మరణించారు. ఆయన మెదక్ జిల్లా పోతారెడ్డిపాలెంలో 5-9-1968లో జన్మించారు.

కొంతకాలం పాత్రికేయునిగా పనిచేసి, సర్దార్‌పటేల్ డిగ్రీ కళాశాల అధ్యాపకునిగానూ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోనూ ఉద్యోగాలు చేసిన బాల శ్రీనివాసమూర్తి 2006లో డిచ్‌పల్లిలో స్థాపించిన తెలంగాణ విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యయనశాఖ ఆచార్యునిగా స్థిరపడ్డారు.

'తెలంగాణ పత్రికలు : సామాజిక సాంస్కృతిక చైతన్యం' అనే అంశంపై పరిశోధన చేశారు. 'సమకాలీనవాదాలు – సాహిత్య విమర్శ', 'తెలంగాణ – తెలుగు మాగాణం', 'ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ', 'మా ప్రసిద్ధిపేట', మొదలగు గ్రంథాలు రచించారు. వానమామలై, ఖండవల్లి లక్ష్మీరంజనం, దేవులపల్లి రామానుజరావు, బి.ఎన్. శాస్త్రి, పి.వి. నరసింహారావు, గుమ్మన్నగారి లక్ష్మీనరసింహ శర్మ మొదలైనవారి జీవిత చరిత్రలు వ్రాశారు.

వ్యాసం

బూర్జువా స్త్రీవాద సిద్ధాంతం: సాహిత్య విమర్శ

# చైనా రచయిత్రి డింగ్ లింగ్ పరిచయం పేరిట కమ్యూనిస్టు విప్లవంపై అసంబద్ధ అవగాహనలు

- జి.వి. భద్రం

**ప్రజాస్వామిక** రచయిత్రుల వేదిక, జిజ్ఞాస వేదిక సంయుక్త ఆధ్వర్యంలో 'స్త్రీవాద సిద్ధాంతం – సాహిత్య విమర్శపై అంతర్జాల ప్రసంగాల పరంపరలో 11వ ప్రసంగం రచయిత్రి కె.ఎన్. మల్లీశ్వరి చేశారు. అది "ఆకాశంలో సగం బోనులో అక్షరం" అనే శీర్షికతో నవంబర్ 14, 2022 ఆంధ్రజ్యోతి, 'వివిధ' శీర్షికలో ప్రచురితమయ్యింది. ఆమె తన ప్రసంగ వ్యాసంలో బూర్జువా స్త్రీవాద దృక్పథాన్ని ఆశ్రయించి స్త్రీల సమస్యల పట్ల కమ్యూనిస్టు సిద్ధాంతపు దృక్పథాన్ని విమర్శించారు. కమ్యూనిస్టు సిద్ధాంతానికి, కమ్యూనిస్టు విప్లవోద్యమాలకు వ్యతిరేక మయినదే బూర్జువా స్త్రీవాదం అని మరోసారి ఋజువు చేశారు.

"ఇది తప్పొప్పుల, మంచి చెడ్డల చర్చకాదు.... కంటికి కనిపించిన వాటిని అంచనా కట్టడం కాదు" అంటూనే ఆమె "మావో చేసుకొన్న నాలుగు పెళ్ళిళ్ళ మీద రాని తీవ్ర చర్చ..... చైనా విప్లవ స్త్రీల లైంగిక బంధాల మీద వచ్చింది. అది కూడా చైనా ప్రభుత్వం చేతిలో ఖైదు అయ్యేంతగా. చైనా విప్లవోద్యమం, సాంస్కృతిక విప్లవాలను రీ విజిట్ చేయాల్సిన అవసరాన్ని జియాంగ్ బింగ్జీ ఉదాహరణ చెబుతోంది" అంటూ ఒక రాజకీయ సిద్ధాంతం యొక్క ఒక కమ్యూనిస్టు వ్యవస్థ యొక్క తప్పొప్పులు, ఒక రాజకీయ విప్లవం యొక్క మంచి చెడ్డల చర్చ జరగాలనే అభిప్రాయాన్ని, అటువంటి చర్చ జరగాల్సిన ఆవశ్యకతను పాఠకులపై వుంచారు. ఆ రకంగా ఆమె డింగ్ లింగ్‌ను తెలుగు సాహిత్యానికి పరిచయం చేసే పేరుతో మహత్తర చైనా విప్లవోద్యమం, సాంస్కృతిక విప్లవాల సమీక్షకు పూనుకొన్నారు. విప్లవోద్యమాలను రీవిజిట్ చేయాలంటూ తమ దృష్టికోణం నుండి కృత్రిమంగా విశ్లేషించారు. వాటిని వక్రీకరించారు. ఈ కోవకు చెందిన రచయితలు తెలుగు నేలపై జరిగిన కమ్యూనిస్టు ఉద్యమాలను కూడ 35 ఏళ్ళ క్రితం రీవిజిట్ చేశారు. ఆత్మాశ్రయవాదం వీరిని పట్టి పీడిస్తున్న జబ్బు. మల్లీశ్వరిగారు డింగ్ లింగ్ అసలు సమస్యను కనుగొనడానికి కృషి చేయలేదు. డింగ్ లింగ్ యొక్క చంచలమైన పరిణతిలేని దృక్పథాలను సమర్థిస్తున్నారు.

మరోవైపు "కళకీ, విప్లవ కార్యాచరణకీ, స్త్రీగా వ్రాయటానికి, విప్లవోద్యమ మిలటరీ జనరల్‌గా వ్రాయటానికీ, మనసు చెబుతున్న దానికీ కార్యాచరణకన్నా, – పార్టీ ఆదేశించినదానికీ, ప్రేమకీ, తోడుకి మధ్య సుదీర్ఘ సంఘర్షణే ఆమె జీవితం (డింగ్ లింగ్ జీవితం)" అంటూ సూత్రీకరించి, విప్లవ కార్యాచరణకన్నా, పార్టీ ఆదేశించినదానికన్నా, స్త్రీగా రాయటం, మనసు చెబుతున్నది చేయటం, అత్యంత ఉన్నతమైన విషయంగా ఆమె ప్రకటించారు.

"ఏ వర్గపు స్త్రీ అయినా స్త్రీగా ఆమె ప్రత్యేకమైన తరగతి" అనీ "బలవంతంగా, విధిలేక తాను ఆత్మవిమర్శ (జియాంతావ్) రాయాల్సి నప్పటి స్థితిని" డింగ్ లింగ్ నర్మగర్భంగా, వ్యంగ్యంగా వ్యక్తీకరించిందనీ, ఆ ఒత్తిడిని కూడా ఆమె కళాత్మకంగా వ్యక్తీకరించటం అన్నది ఆమె జీవితంలోకెల్లా శిఖరాయమాన సందర్భం అన్నది కె.ఎన్.మల్లీశ్వరిగారి విశ్లేషణ.

"యూరోపియన్ ఫెమినిజానికి 'వర్గస్పృహ' లేకపోవటం, చైనీస్ కమ్యూనిస్టు పార్టీకి 'జెండర్ స్పృహ' లేకపోవటం, డింగ్ లింగ్‌ను కలవరపెట్టినట్లుగా చెప్తూ, ఆమె సి.పి.సి.కి జెండర్ స్పృహ అన్నది లేకపోవటం అనే గొప్ప లోపం ఉన్నట్టు అర్థరహిత, హేతురహిత సూత్రీకరణకు దిగారు.

డింగ్ లింగ్ వ్రాసిన కథలను 'సోఫియా డైరీ', 'జియా గ్రామంలో ఉన్నప్పుడు' ప్రస్తావిస్తూ, రెండవ కథలో పార్టీ మీద డింగ్ లింగ్ పరోక్ష విమర్శ పెట్టి సంచలనం సృష్టించినట్లు కె.ఎన్. మల్లీశ్వరిగారు అభిప్రాయపడ్డారు. ఆ సందర్భాన్ని తన స్వీయాత్మక కోణం నుంచి సందర్శించారు.

"మావో మరణించాక ఆమె పార్టీ నుంచి బహిష్కరణ రద్దయి, తర్వాత రెండేళ్ళకి (డింగ్ లింగ్) పార్టీ సభ్యత్వం తిరిగి పొందిందని చెప్తూ, చైనాలో కమ్యూనిస్టు పార్టీలో రివిజనిజం వచ్చి కూర్చొవడం, చైనా సమాజంలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగిన తర్వాత తిరిగి పార్టీలోకి రాగలిగిందని మల్లీశ్వరిగారు స్పష్టంగా చెప్పివుండవలసింది.

"ఐదేళ్ళ జైలుశిక్ష తర్వాత మారుమూల గ్రామ ప్రాంతాల్లో మానవ శ్రమతో బ్రతకమని ఆదేశించారు. పన్నెండేళ్ళు ప్రవాసంలో జీవించింది. ఇన్ని శిక్షలు విధించిన సి.పి.సి. ఈమె రచనల ప్రభావాన్ని ఆపలేక పోయింది". మానవశ్రమ అంటే తన శ్రమతో తాను బ్రతకమనే అర్థం అయితే, అందులో ఆక్షేపించవలసిందేమీ లేదు.

సోషలిస్టు వ్యవస్థ నిర్మాణక్రమంలో నిర్వహించబడిన సాంస్కృతిక విప్లవం పైనా – వాటి స్వభావ, స్వరూపాల పైనా కేవలం ఒక రచయిత్రి జీవన విధానానికి సంబంధించిన ఉదంతాన్ని స్వీయాత్మకంగా పరిశీలించ బూనుకోవడం మల్లీశ్వరి గారికి న్యాయం కాదు. పాఠకులకు

సందేహాలు, అనుమానాలూ, అపోహలూ ఏర్పడేవిధంగా కె.ఎన్. మల్లీశ్వరిగారి విశ్లేషణ వుండవలసిందిగాదు.

నిజానికి చైనా కమ్యూనిస్టు పార్టీ పైనా, అది నిర్మించిన కమ్యూనిస్టు వ్యవస్థపైనా, ఆ సందర్భంగా అవలంబించిన విధానాలపైనా అసంబద్ధంగా రచయిత్రులు అపనిందలూ, అపోహలూ, అనుమానాలూ కల్గించే విధంగా తమ సాహితీ వ్యాసంగాన్ని చేయడం విప్లవోద్యమపక్ష రచయితలు చేయవలసినపని కాదు.

## 'మల్లీశ్వరి వ్యాసంలో అసంబద్ధత'

ఇప్పుడు కె.ఎన్. మల్లీశ్వరిగారు తన వ్యాసంలో కమ్యూనిస్టు విప్లవం - సాంస్కృతిక విప్లవాల పట్ల లేవనెత్తిన అనుమానాలు, అపసవ్య సాధారణీకరణలు, సూత్రీకరణలలో గల అసంబద్ధత గురించి పరిశీలిద్దాం.

"నాలుగు పెళ్ళిళ్ళు (మావో చేసుకొన్న) మీద రాని తీవ్ర చర్చ, చైనా విప్లవ స్త్రీల లైంగిక బంధాల మీద వచ్చింది" అన్న ఆరోపణలను పరిశీలిద్దాం!

మల్లీశ్వరి గారికి మావోకు నలుగురు భార్యలు- లేక నలుగురు స్త్రీలు ఏక కాలంలో లేరన్న సంగతి తెలియదా? ఆహా, ఎంత బేసబబు? పైగా ఆయన విశృంఖలత్వంతో వ్యవహరించలేదు. ఉద్యమానికి నష్టం కలిగేట్లు సామాజిక స్పృహ, కమ్యూనిస్టు స్పృహను కోల్పోలేదు. తన కమిటీ కామ్రేడ్స్‌కి సంబంధం లేకుండా నిర్ణయాలు తీసుకోలేదు, వ్యవహరించనూలేదు.

పార్టీలో పెళ్ళిళ్ళు, లైంగిక సంబంధాల పట్ల ఎందుకు మెలకువగా వుంటారో, వుండాలో అన్న అంశంపై పార్టీకి ఒక దృక్పథం వుంది.

కొన్ని వేల కుటుంబాల నుంచి వచ్చిన స్త్రీ, పురుషులు పార్టీలోనూ, సైన్యంలోనూ వుంటారు. ఎంతోమందిని ఎన్నో వ్యక్తిగత జీవితాలను తీర్చిదిద్దిన పార్టీ ఒక్క డింగ్ లింగ్ పట్ల అలా ప్రవర్తించజాలదు. ఆమె స్వేచ్ఛా స్వభావం తెలిసిన మావో ఆమెకు సగౌరవంగా ఆహ్వానం పలికారు. బరువైన బాధ్యతల నప్పగించారు. ఆ బరువైన బాధ్యతలు ఆమె చంచలమైన, వ్యక్తిగతవ్యామోహ భావాలను కట్టడి చేసి వుండవలసింది. కానీ అలా జరుగలేదు. మావో ఆశించిన విధంగా జరుగలేదు. డింగ్ లింగ్ వ్రాసిన కథలలో ఆమె వెల్లడించిన బూర్జువా, పెటీ బూర్జువావర్గ విప్లవ ప్రతీఘాతుక అభిప్రాయాల గురించి మాత్రమే చర్చంతా? ఆమె కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు. ఉన్నత కమిటీలో సభ్యురాలయినప్పటికీ, 1954లోనే తాను మొట్టమొదటి జాతీయ ప్రజా కాంగ్రెస్‌కు (పార్లమెంటుకు) డిప్యూటీ సభ్యురాలుగా ఎన్నికయినప్పటికీ, డింగ్ లింగ్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక కీలకమైన సమాచారాన్ని పార్టీకి తెలియజేయకుండా దాచిపెట్టింది. అందువల్ల ఆ విషయం గురించీ, ఆమె తన కథల్లో వ్యక్తం చేసిన అభిప్రాయాల గురించి, చర్చ జరిగింది, ఆమె ఆత్మవిమర్శనా రిపోర్టును (జియాంతావ్)ను రాయాల్సి వచ్చింది. ఆ రిపోర్టు కూడా పలు కోణాల్లో చర్చించబడిన తర్వాత ఆమె పలుమార్లు ఆ జియాంతావ్‌ను తిరిగి రాయాల్సి వచ్చింది. వాస్తవాలతో కూడిన, ఆత్మవిమర్శనా రిపోర్టును తయారుచేయవలసి వచ్చింది. ఆమెతో ఎన్నో అనుభవాల తర్వాత ఆమె భావజాలం పైన, దృక్పథాల పైన చర్చ చేయవలసిన అవసరం వుండవచ్చు.

## డింగ్ లింగ్‌ను ప్రశంసించిన మావో

డింగ్ లింగ్ ఒక పేరు పొందిన రచయిత్రిగా, కుమింటాంగ్ ఏరియా నుండి, కమ్యూనిస్టు నియంత్రణలో వున్న యెనాన్ ఏరియాకు వచ్చిన తర్వాత, కమ్యూనిస్టు పార్టీ ఆమెకు ఎనలేని గౌరవాన్నిచ్చింది. 1936లో మావో జెడాంగ్, స్వయంగా "లింజియాంగ్ నుండి అమరమైన వ్యక్తి" అన్న పద్యాన్ని వ్రాసి డింగ్ లింగ్‌కు అంకితం చేశాడు. ఆమె యొక్క కలం లాంగ్పాన్ పర్వతాలవైపుకు ముందుకు సాగుతున్న తుపాకీలు బట్టిన మూడు వేలమంది సైనికుల శక్తితో సమానం" అని అభివర్ణిస్తూ, "నిన్నటిదాకా నీవొక సాహితీ మహిళవు, కానీ నేడు నీవు ఒక సైనిక జనరల్‌గా మారిపోయావు" అంటూ పేర్కొన్నారు.

అయినా యింతటి మహత్తరమైన గౌరవాన్ని పొందిన డింగ్ లింగ్ యొక్క నాన్‌కింగ్‌లోని ఆచరణ-అనుభవాల వలన 1940లో ఆమె 'కొమింటాంగ్‌కు లొంగిపోయిందనే' అనుమానం వచ్చింది. అప్పుడు ఆమె కమ్యూనిస్టు పార్టీని, యీ విషయమై సమీక్ష చేయమని కోరింది. అయితే ఆ సందర్భంలో కూడా ఆమె నిజాయితీగా తాను వ్రాసిన ఒక "నోట్" గురించి పార్టీకి తెలియజేయలేదు. ఆ విషయాన్ని దాచిపెట్టింది. పార్టీని తమ ముందు వున్న ఆధారాలతో సమీక్ష జరిపి అక్టోబరు 4 నాటి నిర్ణయం తెలిపిన, శాఖాపర సమీక్ష జరిపిన కేంద్ర సంస్థ, 'ఆమె లొంగిపోయింది' అనే కట్టుకథ నమ్మవీలు లేదనే నిర్ణయానికి వచ్చింది. "కామ్రేడ్ డింగ్ లింగ్ యిప్పటికీ పార్టీకి, విప్లవానికి విధేయురాలైన కామ్రేడ్‌గానే పరిగణించాలి" అంటూ తెలియచేసింది. ఆ వాక్యాన్ని వ్రాసింది మరెవరో కాదు స్వయానా మావో-సే-టుంగే!

తనపై కలిగిన అనుమానాన్ని (తాను లొంగుబాటును ప్రదర్శించినట్లు) సమీక్షించమని పార్టీని అడిగిన సందర్భంగా ఆమె దాచిపెట్టిన నోట్ గురించి ఆమె సెప్టెంబరు 1933లో యీవిధంగా వ్రాసింది: "పొరపాటుగా భావించటం వలన నేను అరెస్టు చేయబడ్డాను. అయినా నేను ప్రత్యేకంగా ప్రాధాన్యత గల (ప్రిఫరెన్సియల్) అభిమానంతో చూడబడ్డాను. నాపై ఏరకమయిన విచారణ జరగలేదు. నేను ఏరకమైన శిక్షకూ గురికాబడలేదు. నేను జైలు నుండి బయటకు వెళ్ళిపోయాక రాజకీయాల్లో చురుకుగా వుండను. నేను కేవలం అధ్యయనం చెయ్యాలని, మా అమ్మ సంరక్షణను చూడాలని కోరుకుంటున్నాను". (ఆమెను ఫెంగ్‌డాతో కలిపి అరెస్టుచేసి, గృహ నిర్బంధంలో మే 1933లో నాన్‌కింగ్‌కు కుమింటాంగ్ రహస్యంగా పంపినప్పటి కాలంలో డింగ్ లింగ్ యీ నోట్‌ను వ్రాసింది.)

1931లో జనవరి 17న డింగ్ లింగ్ భర్త హ్యూయెపిన్‌ను అతడు కమ్యూనిస్టులతో సంబంధాలు కలిగి, వారితో సంచరిస్తున్నాడన్న కారణంతో కొమింగ్‌టాంగ్ ప్రభుత్వం, అరెస్టుచేసి ఫిబ్రవరి 7న షాంగైలో గల లాంగ్ హువా టెంపుల్ దగ్గర కాల్చి చంపింది. ఆమెను కొమింగ్‌టాంగ్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆ సందర్భంలో ఆమె పైన పేర్కొన్న నోట్ గురించి పార్టీకి తెలియజెయ్యకుండా దాచిపెడితే,

ఆ విషయంపై ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ రాజకీయ దర్యాప్తు కమిటీ దర్యాప్తు జరిపినప్పుడు బయటపడింది. ఆ విషయంపై 1945లో ఆమె "నైతిక నిష్ట (ఇంటెగ్రిటీ) కోల్పోయిన వ్యక్తి" అని ఆమెపై ఆరోపణ చేశారు. అనంతరం 1956, 1975లలో ఆమె ప్రవర్తన, ఒక విద్రోహి ప్రవర్తన అనీ, ఆమెకు పార్టీ పట్ల విధేయత కానీ, నిజాయితీ కానీ లేవని" ఆరోపించారు. ఈ కారణంగా డింగ్ లింగ్‌పై విచారణ, ఆమె ప్రవర్తనపై చర్చ, ఆమె ఆత్మవిమర్శన వ్రాయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఇటువంటి విద్రోహకర, నిజాయితీ లేని ప్రవర్తనను "కళకీ- విప్లవ కార్యాచరణకీ, స్త్రీగా వ్రాయటానికీ- మిలటరీ జనరల్‌గా వ్రాయటానికీ, మనసు చెబుతున్నదానికీ పార్టీ ఆదేశించిన దానికీ మధ్య జరిగిన సుదీర్ఘ సంఘర్షణగా" చిత్రీకరించటం, వాస్తవ విరుద్ధం. మల్లీశ్వరి గారు పొరబడ్డారు.

విప్లవ కార్యాచరణకన్నా, పార్టీ ఆదేశించినదానికన్నా, 'స్త్రీగా వ్రాయటమే' 'మనసు చెప్పినట్లు చేయటమే' అత్యంత ఉన్నతమైన విషయం అని చెప్పడం సమాజం పట్ల బాధ్యతారాహిత్యమేగాక, రాజకీయ సిద్ధాంత భూమిక సరైనదిగా లేకపోవడం కిందికి వస్తుంది.

ఇక కళకూ రాజకీయాలకు గల సంబంధాల గురించి, కమ్యూనిస్టుల వైఖరిని మార్క్స్, లెనిన్, స్టాలిన్‌లు ఎన్నడో స్పష్టపరిచారు. అసలు కళ లేదా సాహిత్యం అన్నదానికి రాజకీయ సంబంధంలేదనటాన్ని మించిన అబద్ధం మరొకటిలేదనీ, అయితే కళలకు దోపిడీ అనుకూల రాజకీయాలతో సంబంధం అయినా వుంటుంది, లేదా దోపిడీ వ్యతిరేకించే రాజకీయాలతోనైనా సంబంధముంటుందని సకారణంగా నిరూపించారు, నిర్ధారించారు. రాజకీయాలతో సంబంధంలేని (ఎపొలిటికల్) కళ లేదా సాహిత్యం అన్నవి ఏమీ వుండవని స్పష్టపరిచారు.

## సాహిత్యం - కళలపై యెనాన్ మావో ప్రసంగం

ఇక చైనా కమ్యూనిస్టు పార్టీ విషయానికొస్తే దాని అత్యున్నతస్థాయి నేత అయిన మావో, 1942లో ప్రారంభమయిన తప్పులు 'సరిదిద్దే ఉద్యమ సందర్భంగా' డింగ్ లింగ్ 'లిబరేషన్ డే' పత్రికకు సంపాదకురాలిగా వ్రాసిన కొన్ని వ్యాసాలను విమర్శించారు. మే 2వ తేదీన యెనాన్ ఫోరం ఆన్ లిటరేచర్ అండ్ ఆర్ట్‌లో : "సాహిత్యంలోనూ, కళాసృష్టిలోనూ ఏ సమస్యలు పరిష్కరించబడాలి? మార్క్సిజం యొక్క మౌలిక అభిప్రాయం (అవగహన) ఏమిటంటే మానవుల మనుగడే (అస్తిత్వమే) వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. మన ఆలోచనలనూ, అనుభూతులను నిర్ణయించేది ప్రస్తుత దశలో దోపిడీ వర్గంపైన జరుగుతున్న వర్గ పోరాటం. విదేశీ దురాక్రమణకు వ్యతిరేక జాతీయ పోరాటం. కానీ మన కామ్రేడ్లు కొందరు ఆలోచనలను అనుభూతులను, ప్రేమ, వ్యామోహాలు, అది ఏరకమైన వ్యామోహమైనా నిర్ణయిస్తుందన్న వాదన చేస్తున్నారు. ఇది బూర్జువావర్గ దృక్పధాన్నుండి పుట్టినదే. ఇక్కడ విషయాన్ని తలక్రిందులు చేస్తే ఎవరేం చేయగలరు? మల్లీశ్వరి గారు పరిశీలించుకోగలరు. కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలుగా కొనసాగాలంటే మార్క్సిజం-లెనినిజాలకు నిబద్ధులు కావలసిందే.

ఇక డింగ్ లింగ్ యొక్క రచనలపై - వాటి స్వభావంపై జరిగిన విమర్శలు, చర్చలు వాటి ఔచిత్య అనౌచిత్యాలను గురించి తెలుసుకొందాం!

## డింగ్ లింగ్ రచనలపై విమర్శలు - చర్చలు

1957లో చైనాలో మితవాద - వ్యతిరేక ఉద్యమం ప్రారంభ మయింది. అప్పుడు, డింగ్ లింగ్, వాంగ్ షీవీ (Wang Shih-Wei) అనే రచయిత వ్రాసిన "అడవి లిల్లీపువ్వు" అనే రచనను ప్రచురించటానికి అధికారిక అనుమతి యిచ్చినందుకు గాను, ఆమెను 'మితవాది'గా నిర్ణయించారు. 1958 ఫిబ్రవరిలో ఆ కారణంచేత ఆమె జాతీయ ప్రజాకాంగ్రెస్‌కు సభ్యురాలిగా (పార్లమెంటు సభ్యురాలు) అనర్హురాలిని చేశారు.

ఎందుకంటే వాంగ్ షీవీ, డింగ్ లింగ్ తదితరులు వ్రాసిన వ్యాసాలను, కొమింగ్‌టాంగ్ గూఢచారి ఏజెన్సీ కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం కోసం వాడుకొంది. ఈ వ్యాసాలు జపాన్ సామ్రాజ్యవాదులకు, ఛాంగ్‌కై షేక్ అభివృద్ధి నిరోధకులకు ఉపయోగపడ్డాయి.

ఆ కారణం చేత 1958, 26న చేసిన ఒక ప్రత్యేక "పున:సమీక్ష" యొక్క ప్రచురణలో ఆమెను తీవ్రంగా నిరసించారు. ఆ ప్రచురణను స్వయంగా మావో-సేటుంగ్ ఎడిట్ చేశారు. అందులో డింగ్ లింగ్‌తో సహా యితర రచయితలను పేరుపేరునా పేర్కొంటూ, డింగ్ లింగ్ నాన్‌జింగ్‌లో వుండగా వ్రాసిన నోట్ గురించీ, ఆ విషయం దాచిపెట్టి (పార్టీకి చెప్పకుండా) పార్టీ యొక్క విశ్వాసాన్ని మోసగించిన సంగతీ, ఆ ఉత్తరం ద్వారా కమ్యూనిస్టు పార్టీకి చెందిన శ్రామికవర్గాన్ని వంచన చేసిన విషయాన్నీ గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆమె వ్రాసిన యెనాన్‌లోని 'లిబరేషన్ డైరీ' అనే పత్రికలో ప్రచురింపబడ్డ "మార్చి 8 పండుగ యొక్క అనుభూతులు" అన్న వ్యాసం గురించి ప్రస్తావించారు. 1936లో డింగ్ లింగ్ నాన్‌జింగ్ నుండి తప్పించుకోవటానికి సహాయపడిన, ఆమెకు ఒకనాటి సహచర రచయిత అయిన "హ్యూ ఫెంగ్ విప్లవ ప్రతీఘాతుక ముఠా"కు నాయకత్వం వహించాడన్న కారణంచేత, తీవ్రమయిన ప్రక్షాళనకు గురయిన వ్యక్తి అన్న విషయం యీ సందర్భంగా గుర్తుచేసుకోవాల్సిన విషయం. నాటి రాజకీయ వాతావరణంలో డింగ్ లింగ్, హ్యూ ఫెంగ్‌ను విమర్శిస్తూ వ్రాసిన "శత్రువులు ఎక్కడ నుండి వస్తారు" అన్న వ్యాసం 1953, 'పీపుల్సు డైలీ' పత్రిక ప్రచురించింది కూడా. ఈ నేపథ్యంలోనే ఆమెను డిసెంబరు 1955న కమ్యూనిస్టు పార్టీ నుండి బహిష్కరించారు. పైన పేర్కొన్న కారణాల వల్లనే ప్రధానంగా ఆమె వెనక్కుతగ్గి బహిరంగ స్వయం - నేరాంగీకారానికి గురికావలసి వచ్చింది.

## డింగ్ లింగ్ రాసిన కథల గురించి :

'మిస్ సోఫియా డైరీ' అన్న కథ డింగ్ లింగ్ వ్రాసిన మొట్టమొదటి కథల్లో ఒకటి. ఇది 1928 ఫిబ్రవరిలో ప్రచురించబడింది. ఈ కథ 1927-28 మధ్య గల శీతాకాలంలో, బీజింగ్ నగరంలో జరిగినట్లు చిత్రీకరింపబడింది. ఇందులో ఉన్నత మధ్యతరగతికి చెంది, క్షయవ్యాధికి వైద్యం చేయించుకొంటున్న సోఫియా అనే ఒక యువతి యొక్క "లైంగిక అనుభూతులు, భావాల" గురించి వివరించారు.

ఈ కథలో సోఫియా ద్వారా రచయిత్రి డింగ్ లింగ్ వ్యక్తం చేసిన భావాలు పాశ్చాత్య పెట్టుబడిదారీ వ్యవస్థకు సంబంధించిన పతన సంస్కృతికి చెందిన అభిప్రాయాలు. ఇది దిగజారిన సంస్కృతి తప్ప మరేంకాదు. మరింత సూటిగా చెప్పాలంటే సోఫియా చేత వ్యక్తం చేయించిన అభిప్రాయాలు, కడుపు నిండి, భోగభాగ్యాలు అనుభవిస్తూ దాసదాసీలచేత సేవలు చేయించుకొంటూ, పనీపాటా లేకుండా విలాసానుభూతులతో వున్న అతికొద్దిమంది బూర్జువావర్గ మహిళలకు చెందిన అభిప్రాయాలే అవి. ఇవి చైనా దేశంలో తరతరాల నుండి తిండీ, బట్టా లేక ఆజన్మాంత దాస్యం (బానిసత్వం)లో కూరుకుపోయి బలమైన ఫ్యూడల్ వర్గాల పీడనలకూ, అణచివేతకూ గురవుతున్న కోట్లమంది యువతులకు చెందిన అభిప్రాయాలు, ఆలోచనలు ఎంతమాత్రమూ కాదు. వీరు ఇటువంటి వికృతమైన లైంగిక వాంఛలూ, వికృతాలూ కోరుకోరు.

అటువంటప్పుడు ఒకవైపు మొత్తం దేశ ప్రజలను ఫ్యూడల్ దోపిడీ, పీడన పాలనావ్యవస్థ బంధనాల నుండి చైనా దేశ ప్రజలను విముక్తి పరిచే మహత్తర విప్లవ పోరాటాన్ని నిర్వహిస్తున్న చైనా కమ్యూనిస్టు పార్టీ, యిటువంటి అభిప్రాయాలను తప్పుపట్టడంలో, విమర్శించటంలో, చర్చ జరపటంలో అనౌచిత్యమేముంది? ప్రజలను చైతన్యపరచడానికి ఏ పరిస్థితిలో ఏమి వ్రాయలన్న స్పృహ వుండాలని హెచ్చరించడం, గుర్తింపచేయడంలో తప్పేముంది?.

## మహిళా సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ అవగాహన

స్త్రీ సమస్య విషయంపై రోజా లక్సెంబర్గు – క్లారా జట్కిన్‌లు, లెనిన్‌తో చర్చలు జరిపిన కాలంనాటి నుండీ కమ్యూనిస్టు పార్టీకి స్పష్టమైన అవగాహన వుంది. ఈనాడు కె.ఎన్. మల్లీశ్వరి లేవనెత్తిన అంశాలన్నింటికీ జవాబులు వచ్చాయి. ఫెమినిజానికుందంటున్న 'జెండర్ స్పృహ'ను కమ్యూనిజం అంగీకరించదు. విస్తృతమైన, అన్ని కోణాలను, అన్ని అంశాలను స్పృశించిన వర్గస్పృహ వున్న కమ్యూనిస్టు పార్టీకి, ప్రత్యేకించి ఫెమినిస్టులు ప్రబోధిస్తున్న రకపు జెండర్ స్పృహతో పనిలేదు. అటువంటి రకపు స్పృహ, పీడన – దోపిడీ – అసమానతలకు గురిచేయబడుతున్న శ్రామిక ప్రజానీకపు ఐక్యతకు ఆటంకంగా వుంటుంది – ఆటంకంగా వుంది కూడా! ఇదే నేటి సార్వత్రిక వాస్తవికత.

ఇక డింగ్ లింగ్ విప్లవ ప్రభుత్వం చేతిలో ఖైదు కావటానికి కారణం, ఆమె పార్టీతో నిజాయితీగా, ఒక నిబద్ధ కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా పార్టీ నిబంధనలకూ క్రమశిక్షణకు కట్టుబడి వుండకుండా ప్రవర్తించటం, పార్టీలోనే తన భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయటానికీ, చర్చింప బడటానికీ, పార్టీ నిర్ణయాలను విమర్శించటానికీ, ప్రత్యేకంగా ఆమెకు నేరుగా మావో–సేటుంగ్‌తోనే తన అభిప్రాయాలను వెల్లడించటానికీ అవకాశాలు వున్నా, తన రచనలు, కథల ద్వారా బహిరంగంగా పార్టీ విధానాలను విమర్శించి, గందరగోళపర్చటమూ, క్రమశిక్షణను ఉల్లంఘించటమనే కారణాలు తప్ప, వ్యక్తిగతంగా ఆమె స్త్రీ అనో, రచయిత్రి అనో జరిగిన విచారణ కాదు. లేదా ఆమె ఏర్పరచుకొన్న బహుళ లైంగిక సంబంధాల వలన (అవి ఏ కారణంతో ఏర్పరచుకొన్నా) కూడా జరిగిన విచారణ, నిర్బంధాలు ఎంతమాత్రం కావు.

## సాంస్కృతికవిప్లవ కాలంలో అతివాదం

కాకపోతే, డింగ్ లింగ్‌పై చేయబడ్డ ఆరోపణల విచారణ కాలంలోనే, సాంస్కృతిక విప్లవం ప్రారంభం కావటం, ఆ సాంస్కృతిక విప్లవాన్ని ఆసరా చేసుకొని, అధికారానికి రావాలనుకొన్న లిన్‌బియావో, చియాన్–చాంగ్ నలుగురి ముఠా ఆ విప్లవ కాలంలో, అతివాదంతో, ఆ విప్లవంలో పైచేయి సాధించటం వలన, మిగిలిన అనేకమంది రచయితలు, రచయిత్రులు, మేధావులు, శాస్త్రవేత్తలు, ఉన్నతస్థాయిలో వున్న పార్టీ నాయకులతోపాటు, డింగ్ లింగ్ కూడా ఆ అతివాదుల మితిమీరిన వేధింపు చర్యల్లో చిక్కుకొంది. తీవ్రమయిన శిక్షలకు గురిచేయబడింది. 'ది సాంగ్ ఆఫ్ యూత్' (ఉదయగీతిక) లాంటి నవల వ్రాసిన ప్రఖ్యాత రచయిత్రి యాంగ్ మో కూడా ఆ మితిమీరిన వేధింపు చర్యలపాలయింది. డెంగ్–సియావో–పెంగ్ లాంటి ఉన్నత స్థాయి నాయకులు కూడా ఆ విష కోరల్లో చిక్కుకొన్నారు. షాంగై నగరానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి నాయకులు కూడా కఠిన శిక్షలకు గురిచేయబడ్డారు. ఆఖరికి ప్రపంచ ఖ్యాతిగాంచిన, చైనా ప్రధాని, మహత్తర చైనా విప్లవంలో మరో ప్రధాన నాయకుడిగా పాత్ర వహించిన చౌ–ఎన్–లై సైతం, సాంస్కృతిక విప్లవ కాలంలో, యీ అతివాదుల వేధింపులకు గురయ్యాడు. అంతేకాక ఆయనపై ఆ అతివాదులు చూపించిన వ్యతిరేకత ఎంతటి గరిష్టస్థాయికి చేరిందంటే, చౌ–ఎన్–లై మరణిస్తే, ఆయనకి శ్రద్ధాంజలి ఘటిస్తూ ప్రజలు ఆయన భౌతికకాయంపై వేసిన పూలదండలను తొలగించారు. శ్రద్ధాంజలి తెలిపినవారిని ద్రోహులుగా పరిగణించి అరెస్టు చేశారు.

ఈరకంగా అతివాద మూకల వలన గాడితప్పిన సాంస్కృతిక విప్లవాన్ని, సరిచేయటానికి మావో స్వయంగా పూనుకొన్నాడు. డెంగ్–జియా వోపింగ్‌కు పునరావాసం కల్పించాడు. ఈ అతివాద దుర్మార్గం వలన విచ్ఛిన్నమయిన పాలనావ్యవస్థను తిరిగి సరిచేసే ప్రక్రియను ప్రారంభించాడు. లిన్‌బియావోను పట్టుకొని శిక్షించబోగా, అతడు పారిపోతూ విమాన ప్రమాదంలో మరణించాడు. చియాంగ్–చాంగ్ నల్గురి ముఠాను అరెస్టుచేసి శిక్షించారు. షాంగై తదితర ప్రాంతాల్లో అతివాదుల బారినపడిన పలువురు ఉన్నతస్థాయి పార్టీ నాయకులకు పునరావాసం కల్పించారు. ముందుగా అస్తవ్యస్తం చేయబడిన పాలనా వ్యవస్థను సరిజేయ పూనుకొన్నారు. తరువాత అతివాదుల అక్రమ నిర్బంధానికి గురయిన వ్యక్తుల కేసులను సమీక్షించే క్రమం చేపట్టారు. ఇటువంటి ప్రక్రియ జరుగుతున్న కాలంలో మావో మరణించారు. కానీ ఆయన ప్రారంభించిన తప్పులు సరిదిద్దు ప్రక్రియ (సాంస్కృతిక విప్లవంలో జరిగిన అతివాద తప్పుల) కొనసాగింపులో భాగంగానే డింగ్ లింగ్ లాంటి వారందరినీ, విడుదలచేసి, వారికి తగిన ప్రాధాన్యతను యిచ్చి, పార్టీలో అందుకు తగ్గ స్థాయి కమిటీల్లో వుంచారు. అంతేకానీ కె.ఎన్. మల్లీశ్వరి పేర్కొన్నట్లు, డింగ్ లింగ్ యొక్క రచనా ప్రభావ, పలుకుబడుల ప్రభావాన్ని చైనా కమ్యూనిస్టు పార్టీ తట్టుకోలేక ఆమెకు

పునరావాసాన్నీ, ఉన్నత పదవులనూ కల్పించలేదు. లేదా మావో చనిపోయినందువలన ఆవిధంగా అతివాద తప్పులు సరిదిద్దబడలేదు.

తర్వాతికాలంలో చైనా కమ్యూనిస్టు పార్టీ చేసుకొన్న సమీక్షలలో సాంస్కృతిక విప్లవ కాలంలో జరిగిన అతివాద తప్పుల వల్ల ఎంతగానో నష్టపోయాం, ఎందరో వేధింపులకు గురయ్యారు అని నిర్ణయం చేసింది. తన డాక్యుమెంట్లలో ఆ విషయాన్ని నమోదుచేసింది.

డింగ్ లింగ్ యొక్క రచనలను తిరిగి అధికారికంగా ప్రచురించిన సందర్భంలో ఆమె సాంస్కృతిక విప్లవ కాలంలో అతివాద తప్పిదాలకు గురయిందనీ, అతివాదులచేత మితిమీరిన శిక్షకు, తలవంపులకూ గురయిందని ప్రకటించటం జరిగింది.

యథార్థాలు యివి కాగా వాటి బదులు పాక్షిక సత్యాలతో కె.ఎన్. మల్లీశ్వరి గారు వక్రీకరిస్తూ, డింగ్ లింగ్ ఉదంతం, చైనా విప్లవంలోని స్త్రీల పాత్రకు ప్రతీకగా సాధారణీకరించి చిత్రీకరించారు. మావో మరణించాకే డింగ్ లింగ్ నిర్బంధం నుండి విడుదలయింది. అంటే దీనర్థం ఏమిటి? డింగ్ లింగ్ రచనా ప్రభావానికి చైనా కమ్యూనిస్టు పార్టీ తట్టుకోలేక తలొగ్గినట్లు చిత్రించటం, తాను స్వీకరించిన దృక్పథం, కమ్యూనిస్టు దృక్పథానికి వ్యతిరేకమయినదేనని అనుకోవడంలో పొరపాటేమీ లేదు. దీనిని సమర్థించినవారున్నారు. డింగ్ లింగ్ అపరిణిత భావోద్వేగాల స్వభావంతో ప్రవర్తించిందనిపించిందని వ్యక్తం చేసిన వారూ వున్నారు. కె.ఎన్ మల్లీశ్వరి గారు స్వీయాత్మకంగా ఏ దేశంలోనైనా కమ్యూనిస్టు పార్టీ యిలాగే వ్యవహరిస్తుందని రుజువు చేయడానికి పూనుకోవడం ఆశ్చర్యమూ, విచారమూ కలిగించే విషయమని చెప్పక తప్పదు.

వెనుకబడిన సమాజంలోని వెనుకబాటుతనాలన్నీ ఉద్యమాలు ప్రారంభమయిన వెంటనే తొలగిపోవు. అందుచేతనే విప్లవకారులు తమది దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా అని తమ పంథాని నిర్వచించుకొన్నారు.

# పాలకుల ఆధిపత్య మతభావజాలపు వ్యాప్తిలో భాగమే పాఠ్యాంశాల తొలగింపు


**జాతీయ** విద్యావిధానం – 2020కి అనుగుణంగా పాఠ్యాంశాల హేతుబద్ధీకరణ కార్యక్రమాన్ని కేంద్ర విద్యాశాఖ ప్రారంభించింది. చరిత్ర, సైన్సు సబ్జెక్టులకు సంబంధించిన తొలగింపులను ప్రకటించింది. 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు సామాజిక శాస్త్రం, చరిత్ర, రాజనీతి శాస్త్రం, జీవశాస్త్రాల పాఠ్యపుస్తకాల నుండి కొన్ని అధ్యాయాలను, మరికొన్ని భాగాలను తొలగించాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (NCERT) నిర్ణయం తీసుకుంది. మొఘల్ పాలనాచరిత్ర, గుజరాత్‌లో 2002 మతకల్లోలాలు, ఎమర్జెన్సీ, దళిత రచయితల రచనలు, వారి ప్రస్తావనలు, నక్సలైట్ ఉద్యమానికి సంబంధించిన వివరాలు, ప్రస్తావనలు, సమానత్వం కోసం జరిగిన ఉద్యమాల వివరాలను తొలగించబోతున్నట్లు ప్రకటించారు. వారు తొలగించబోతున్న పాఠ్యాంశాల వివరాలను చూస్తే భారత ఉపఖండపు ప్రజల చరిత్ర అంతా కేవలం అధికారంలో వున్న ఆధిపత్య మత చరిత్రగా ప్రచారం చేసే భావజాలం కార్యక్రమంగా కన్పిస్తుంది. విభిన్న జాతుల, విభిన్న సంస్కృతుల సమష్టి, సమ్మిళిత జీవన విధానాన్ని విచ్ఛిన్నం చేస్తూ 'ఏకత్వం' అనే తప్పుడు భావాన్ని అందించే కార్యక్రమంగా వున్నది.

చరిత్ర పాఠ్యపుస్తకాల నుండి కొన్నిటిని తొలగించడమంటే, కొంత చరిత్రను తీసివేయటమంటే – కేంద్ర విద్యాశాఖవారు ఏమి చెప్పదల్చుకున్నారో దాన్నే విద్యార్థులకు నేర్పటమవుతుంది. అప్పుడు సమగ్రమైన చరిత్ర విద్యార్థులకు అందకపోగా గతం, వర్తమానం, భవిష్యత్‌ల పట్ల ఒక అంచనా లేనివారుగా, ఆఖరికి చారిత్రక నేపథ్యమే, భూమికే లేనివారిగా మిగిలిపోతారు. కేవలం వారు చెప్పదల్చుకున్న ఆధిపత్య మతభావజాలపు బానిసలుగా మిగల్చటమే అవుతుంది.

ఈ పరంపరలో భాగంగానే పదవ తరగతి జీవశాస్త్రం పాఠ్యపుస్తకాల నుండి డార్విన్ జీవపరిణామక్రమం, పునరుత్పత్తి పాఠ్యాంశాలను తొలగించారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం – జాతుల ఆవిర్భావం (ఆరిజన్ ఆఫ్ స్పీసెస్) గతితార్కిక భౌతికవాద సిద్ధాంతాల మీద ఆధారపడినది. నిరూపించబడినది. మనుగడ కోసం పోరాటం ('స్ట్రగుల్ ఫర్ ఎక్సిస్టెన్స్') ప్రకృతి ఎన్నిక (నేచర్ సెలక్షన్) ద్వారా పరిణామక్రమాన్ని శాస్త్రీయంగా ఋజువులతో నిరూపించారు. ఈ పాఠ్యాంశాన్ని తొలగించటమంటే ప్రాపంచిక దృక్పథంతో కూడిన తాత్విక ఆలోచనలు విద్యార్థులకు అందకుండా చేయబూనటమే. కరోనా కాలంలో విద్యార్థులపై సిలబస్ భారం తగ్గించటానికి ఈ పాఠ్యాంశాలను తొలగించామని ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ చెబుతున్నారు. కరోనా కాలం దాటుకుని సాధారణ జీవితం గడుపుతున్న ఈ రోజుల్లో ఈ ప్రకటన హాస్యాస్పదం. ఇప్పటికే అనేకమంది చరిత్రకారులు, శాస్త్రవేత్తలు, సైన్సు అధ్యాపకులు, మేధావులు పాఠ్యాంశాలను తొలగించవద్దని ప్రకటించారు.

చరిత్రకారులకు, పాఠశాల ఉపాధ్యాయులకు, సైన్సు అధ్యాపకులకు, ఆఖరికి ఎన్‌సిఆర్‌టి సభ్యులకు కూడా తెలియకుండా పాఠ్యాంశాలను తొలగించటం పాలకుల వైఖరిని తెలియచేస్తుంది.

## జాతీయ అక్షరయోధులు



కోట
శివరామకరంత్
( 1902 - 1997)

14

సింగంపల్లి
అశోక్‌కుమార్

# కన్నడ సాహిత్య కోట

నూతన ప్రజాతంత్ర విప్లవ సాహిత్యబాట
ఎలుగెత్తిన నిమ్నవర్ణ చోమనదుడి పాట
నర్సరీలు, ప్రీనర్సరీలు చిత్రవధశాలలన్న
కన్నడ ప్రగతిధార శివరామ కరంత్ కోట

**మాతృభాషలో కాకుండా వేరేభాషలో విద్యాబోధననూ, పిల్లలో మానసిక వికాసం రాకుండా పాఠశాలలో చేర్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన కోట శివరామ కరంత్ కన్నడ సాహితీవేత్త, కవి, కథకుడు, నవలాకారుడు, నాటకప్రయోక్త, నృత్యదర్శకుడు సినీరంగ ప్రముఖుడు, సామాజికశాస్త్రవేత్త, పర్యావరణ పరిరక్షకుడు.**

నాటకాలను, నాటకరంగానికి అవసరమయిన దర్శకత్వాన్ని, ఇతర అంశాలను నేర్పించే స్కూలులో కరంత్ పనిచేశారు. ఆ స్కూలు విద్యార్థిని అయిన లీలా అల్వాను కులాంతర వివాహం చేసుకున్నారు. కరంత్ ప్రముఖ హేతువాది, సాంఘిక సంస్కర్త. విలక్షణ వస్తువులతో చిన్న కథలు (4), నవలలు (45), నాటకాలు (29), నృత్యరూపాలు (19), ఆత్మకథలు (2), వైజ్ఞానిక వ్యాసరచనలు (7), నిఘంటువులు (1), కవనం (20), ప్రవాస కథలు (6), ఆంగ్లంలో సాహిత్య రచనలు (5), వ్యంగ్యపూరిత రచనలు (6), ఇలా అనేక రూపాలలో నిర్విరామ రచనాసేద్యం చేశారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తుబహిష్కరణ ఉద్యమాలలో పాల్గొన్నారు. వేశ్యా వివాహాలు జరిపించారు. 'బాలవన' అనే పిల్లల కోసం శిక్షణా సంస్థను ఏర్పాటుచేశారు.

'దేవదూతరు'–సమకాలీన భారతంపై వ్యంగ్య రచన. 'మూకజ్జియ కనసుగళు'–ఒక బాల వితంతువు భయానక అనుభవాల చిత్రణ. 'చోమనదుడి'–సాంఘిక దురాచారమైన కుల అణచివేతకు నవలీకరణ. 'చోమనదుడి' సినిమాగా రూపొంది జాతీయ అవార్డు అందుకుంది. 'హుచ్చు మనస్సిన హత్తు ముఖగళు', 'స్మృతి పటలదింద' ఆత్మకథలు 'మరలిమన్నినే'–మూడు తరాల జీవన వాస్తవాలకు ఎక్స్‌రే ఫోటోగ్రాఫ్. 'జీవితేచ్ఛ', 'విచిత్రకూట', 'సరసమ్మాన సమాధి అళిడామెలే', 'మిరాళిమన్నెగె', 'బెట్టదజీవ', 'ధర్మారణ్య సంసార' మొదలైనవి కరంత్ ప్రసిద్ధ రచనలు. తన గ్రంథాలకు తానే ముఖచిత్రాలను రూపొందించుకొనేవారు.

కన్నడ యక్షగానంలో పరిణతి చెందిన కరంత్ యక్షగానానికి అవసరమైన ఎన్నో జానపద కళా రూపాలకు కొత్త మెరుగులు దిద్దారు. అంతర్జాతీయ ఖ్యాతితెచ్చారు. 'యక్షగాన బయలాట' సంకలనానికి సాహిత్య అకాడమీ అవార్డుపొందారు. 96వ ఏట పక్షులమీద ఓ పుస్తకం రాసిన అవిశ్రాంత సృజనకారుడు. 'దొమింగో', 'భూతరాజ్య' అనే మూకీ చిత్రాలను 1930లో నిర్మించారు. 'దొమింగో' దళితుల జీవితాలు ఆధారంగా తీసిన మూకీ సినిమా.

'మూకజ్జియ కనసుగళు' నవలకు ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ, పద్మవిభూషణ్ అవార్డులు అందుకున్నారు. 8 డాక్టరేట్‌లు పొందారు. భయానక ఎమర్జెన్సీలో ప్రజాస్వామికహక్కులపై జరిగిన దమనకాండకు నిరసనగా తన పద్మభూషణ బిరుదు వాపసు ఇచ్చిన రాజ్యధిక్కార స్వరం ఆయన.

సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ సాహిత్యాన్ని, కళారూపాలను రూపొందించి, మార్పు కోసం కృషిచేసిన కోట శివరామ కరంత్ కర్నాటక ఉడిపిజిల్లా కోటలో 1902లో అక్టోబరు 10న తెలుగు కుటుంబంలో జన్మించారు. 1997 డిశంబరు 19న మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తన 96వ ఏట కన్నుమూశారు.

గల్పిక

# ష్! గప్‌చుప్!!

- శంకరం

**రామాపురం** రాజధానికి కూతవేటు దూరంలోనున్న ఒక కుగ్రామం. ఎక్కువశాతం ప్రజలు రైతులు మరియు రైతుకూలీలు, అక్షరాస్యత తక్కువ. గ్రామంలో రామాలయం పక్కనే ప్రాథమిక పాఠశాల.

పాఠశాల ముందు జనం గుంపులుగా ఉన్నారు, భయం భయంగా ఉన్నారు. పాఠశాల ముందు ఒక పోలీసు వాహనం ఆగి వుంది, పక్కనే ఒక ప్రభుత్వ వాహనం కూడా వుంది. ఎవరెవరో వస్తున్నారు, పిల్లల్ని ప్రశ్నిస్తున్నారు, ఉపాధ్యాయుల్ని ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల్ని కూడా పిలిపించుకొని విచారిస్తున్నారు. గత నాలుగైదు రోజులుగా ఇది కొనసాగుతూంది.

ఈ పద్యం ఎవరెవరు పాడారు?
మీదేవూరు?
మీ అమ్మా నాన్నలెవరు?
ఏం చేస్తుంటారు?
ఈ పద్యం మీకు ఎవరు నేర్పారు?
ఎక్కడెక్కడ పాడుతున్నారు ఈ పద్యాన్ని?
ఎంతమంది మీ ఊరివాళ్ళు విన్నారు?
పక్కూరి విద్యార్థులు కూడా ఈ బడికి వస్తారా?
వాళ్ళకు కూడా ఈ పద్యం వచ్చునా?

మాస్టారూ, మీరేనా ఈ పద్యం పిల్లలకు నేర్పింది?
మీ పేరేమిటి?
మీది ఏ మతం? ఏ కులం?
మీ స్వగ్రామం ఏమిటి?
మీ తల్లిదండ్రులెవరు?
మీరు ఎక్కడ చదువుకున్నారు?
ఈ పద్యం పిల్లల తెలుగు పుస్తకంలో ఉందా?
పుస్తకంలో లేనిది ఎందుకు చెప్పారు?
పిల్లలకు ఈ పద్యం నేర్పమని మీకు ఎవరు చెప్పారు?
ఈ పద్యాన్ని మీరే రాసారా?
పద్యం భావం మీకు తెలుసా?
ఈ పద్యం ఎక్కడైనా ముద్రించబడిందా?
అయితే దాని భావం కూడా చూపిస్తారా?
మీరు నల్లబల్ల మీద పద్యం, దాని భావం రాసారు కదా?

మీరేనా ఈ పిల్లల తల్లిదండ్రులు?
మీరు ఎక్కడ పుట్టారు?
మీది ఏ మతం? ఏ కులం?
ఎంతకాలం నుండి మీరిక్కడ ఉంటున్నారు?
మీ పిల్లలకు ఈ పద్యం నేర్పమని మాస్టారిని మీరడిగారా?
మీ పిల్లలు ఈ పద్యం నేర్చుకున్నట్టు మీకు తెలుసా?
మీ పిల్లల నోటివెంట ఈ పద్యం భావం మీరు విన్నారా?
పద్యం గురించి కాకుండా వాళ్ళేం మాట్లాడుతున్నారో మీకు తెలుసా?

ఏమండీ, మీరు ఈ పాఠశాల హెడ్‌మాస్టారా?
మీ స్వగ్రామం ఏది?
మీది ఏ మతం? ఏ కులం?
తెలుగు మాస్టారు పిల్లలకు ఈ పద్యం నేర్పినట్టు మీకు తెలుసా?
ఈ పద్యాన్ని నేర్పేముందు మీ అనుమతి తీసుకున్నారా?
సిలబస్‌లో లేని విషయాలు నేర్పే అధికారం మీకుందా?

★ ★ ★

ఏమండీ, ఈ వార్త చదివారా? బాక్సు కట్టి మరీ వేసారండి!

ఏమిటీ నిన్ను అంతగా ఆకర్షించిన వార్త? చదువు, నేనూ వింటాను.

"రామాపురం ప్రాథమిక పాఠశాలలో తెలుగు పద్యం నేర్పిన మాస్టారిపై దేశద్రోహం కేసు నమోదు చేసారు. ఉపాధ్యాయునికి పద్యం చెప్పడానికి అనుమతినిచ్చిన ప్రధానోపాధ్యాయుని సస్పెండ్ చేసారు. పద్యాన్ని పాడిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులనూ హెచ్చరించి వదిలివేసారు.

ఇకముందు సిలబస్‌లో లేని విషయాలు బోధించడానికి వీలులేదని, అలా బోధించినవారిపై తీవ్రమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోబడతాయని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది."

మా పత్రిక ప్రతినిధి విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో జరిపిన

ముఖాముఖిలో వెల్లడైన విషయాలు :

మాస్టారు బోధించిన పద్యం :

కనకపు సింహాసనమున
శునకము గూర్చుండబెట్టి శుభలగ్నమునం
దొనరగ బట్టము గట్టిన
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ!

భావం : ఓ మంచి బుద్ధి గలవాడా! కుక్కది హీన గుణము. దానిని మంచి ముహూర్తమునాడు బంగారపు సింహాసనమున కూర్చుండబెట్టినను హీనబుద్ధి విడువదు. అట్లే హీనుని ఉన్నత స్థానమున కూర్చుండబెట్టినను అతని బుద్ధి మారదు.

ఉపాధ్యాయుడు ఈ పద్యమును, భావమును నల్లబల్లపై రాసి వివరిస్తూ మనం ఎన్నికలలో చెడ్డవారికి ఓటు వేసి గెలిపిస్తే, అయిదు సంవత్సరాలపాటు వాళ్ళు మనల్ని దోచుకుతింటారు అని ఉదాహరణగా చెప్పారట. పిల్లలు దానినే వల్లె వేస్తూ తిరిగారట.

స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగిన ఎన్నికలలో గెలిచిన అభ్యర్థులపై విద్యార్థులలో ఉపాధ్యాయుడు చెడు ఆలోచనలు కలిగిస్తున్నాడనియు, అది ప్రజాస్వామ్యాన్నీ, రాజ్యాంగాన్నీ అవమానించడమేనని తీర్మానిస్తూ అతనిపై దేశద్రోహం కేసు నమోదు చేయడమైనదని అధికారులు వివరణనిచ్చారు...."

ఎంత అన్యాయమండీ? ఎంత ఘోరమండీ?

అన్యాయమేమిటే పిచ్చి మొహం? మంచి ప్రభుత్వమంటే ప్రజల్ని అదుపాజ్ఞల్లో పెట్టగలిగిందే. మంచి ప్రజలంటే ప్రభుత్వానికి పూర్తి విధేయులుగానున్నవారే. అదే దేశభక్తి!

ఇకనుండీ బడుల్లో విద్యార్థులకు నీతిబోధ చేయకూడదు, సిలబస్‌ను మించి ఏమీ చెప్పనక్కర్లేదు, చెప్పకూడదు కూడానూ.

అయితే ప్రార్థన, ప్రతిజ్ఞ, సూక్తులూ, వగైరా....

అలాంటివి మాట్లాడకే తల్లీ.... దేశద్రోహం!!

# గుజరాత్‌లో 1-8 తరగతి వరకు గుజరాతీ భాషా బోధన తప్పనిసరి

**CBSE,** ICSE, IB సంస్థల పాఠశాలలతోసహా అన్ని పాఠశాలల్లో 1 నుండి 8వ తరగతి వరకు గుజరాతీ భాషాబోధన తప్పనిసరి చేస్తూ గుజరాత్ శాసనసభ ఫిబ్రవరి 28న ఒక బిల్లును ఏకగ్రీవంగా అంగీకరించింది. 2018లోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందిగాని ఎవరూ అమలు చేయడంలేదన్న వాస్తవాన్ని కోర్టులో ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం వేయగా, ఇప్పుడు 182 మంది శాసనసభ్యులు ఏకగ్రీవంగా ఈ బిల్లును ఆమోదించి చట్టం చేయడానికి సానుకూలత కల్పించారు.

దీని ప్రకారం అన్ని పాఠశాలలవారు 1 నుండి 8వ తరగతి వరకు దశలవారీగా 2023-24 విద్యా సంవత్సరం నుండి దీనిని అమలుచేయాలి. దీనిని అమలుచేయని పాఠశాలలవారికి మొదటి సంవత్సరం రూ. 50,000/- ఆ తర్వాత లక్ష, రెండు లక్షల వరకు జరిమానా విధించి ఆ పాఠశాలల గుర్తింపు రద్దుచేస్తారు. అంతేగాక ఈ పాఠశాలల్లో గుజరాతీ ప్రభుత్వం నిర్ణయించిన గుజరాతీ పాఠ్యపుస్తకాలనే వాడాలి.

# 'కాలేజ్ రొమాన్స్' వెబ్ సిరీస్‌లో వాడుతున్న భాష అశ్లీలం, అసభ్యకరం : ఢిల్లీ హైకోర్టు

**ఓ.టి.టి.** (Over the Top)లో ప్రసారమౌతున్న 'కాలేజ్ రొమాన్స్' వెబ్ సిరీస్ రెండు భాగాలు చూసి ఢిల్లీ హైకోర్టు సింగిల్ జడ్జి బెంచికి చెందిన జస్టిస్ స్వర్ణకాంతశర్మ - దానిపై ఎఫ్.ఐ.ఆర్. తయారుచేయమని అధికారులను ఆదేశించారు. ఆమె ఈ సిరీస్‌లో నటులు నాగరికమైన భాష వాడటంలేదనీ, వీక్షకుల మనసులను కల్మషపరిచే విధంగా వుంటోందనీ వ్యాఖ్యానించారు. సమాచార, సాంకేతిక చట్టంలోని 67వ సెక్షన్ (కామోద్దీపన కల్గించే భాష, సన్నివేశాల) ప్రకారం ఈ సిరీస్ బాధ్యులు సిమ్రి ప్రీతిసింగ్, అపూర్వ అరోరాలపై కేసు నమోదు చేయమని న్యాయమూర్తి ఆదేశించారు.

# బైబిలు ఉచితంగా ఇవ్వకూడదా!

**ఢిల్లీలో** ఫిబ్రవరి 25 - మార్చి 5 మధ్య జరిగిన ప్రపంచ పుస్తక ప్రదర్శనలో గిడియన్స్ ఇంటర్నేషనల్ అనే క్రిస్టియన్ సంస్థకు చెందిన దుకాణం వద్ద బైబిల్ ఉచితంగా పంపిణీ చేయడం పట్ల హిందూ యునైటెడ్ ఫ్రంట్ - ఢిల్లీ అధిపతి ఒక ప్రదర్శన నిర్వహించారు. దీని ద్వారా హిందువులను తమ వలలో వేసుకుంటున్నారని ఆరోపించారు. 1899లో స్థాపించిన ఈ సంస్థ ప్రధాన కార్యక్రమం బైబిల్‌ను ఉచితంగా పంచడమే. ఎప్పటినుండో ఈ పంపిణీ వివిధ పుస్తక ప్రదర్శనలలో కొనసాగుతోంది. బిజెపి ప్రభుత్వం అండదండలతో హిందూ సంస్థలు ఇటువంటి ప్రదర్శనలేగాక, దాడులు కూడా చేస్తున్నాయి.

డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్య గ్రంథాల నుండి తొలగిస్తున్న సందర్భంగా

**సినిమా సమీక్ష**

## 'మంకీ ట్రయల్' పై వచ్చిన సినిమా

# 'ఇన్హెరిట్ ది విండ్' (1960)

- బాలాజీ (కోల్‌కతా)

**గతంలో** కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ డార్విన్ సిద్ధాంతంపై ధ్వజమెత్తాడు. - "ప్రపంచం మొత్తం మీద డార్విన్ సిద్ధాంతం ఛాలెంజిని ఎదుర్కుంటోంది. కోతి మనిషిగా మారినట్టు మన పూర్వులు ఎవరూ చూడలేదు కదా? అంచేత ఇలాంటి సిద్ధాంతాలను స్కూళ్లలోనూ, కాలేజీల్లోనూ బోధించకూడదు" అంటూ చెప్పుకొచ్చాడు. హాస్యాస్పదమైన ఈ మాటలు వింటే ఈయనకు 'పరిణామం' అన్న పదానికి అర్థమే తెలీదనుకోవాలి. 'పరిణామం' అంటే 'ఒక మనిషి జీవిత కాలంలో ఆ మనిషి కళ్లెదుట జరిగే అర్జెంటు ప్రక్రియ' కాదు. 'కొన్ని తరాల పాటు కాలక్రమేణా జరిగే మార్పు'.




అసలు కోతి నుండి మనిషి పుట్టాడని ఎవరు చెప్పారూ? 'ఏప్స్'లోని ఒక ప్రజాతి నుండి పరిణామక్రమంలో మానవుడు ఆవిర్భవించాడు. ఇది జరగడానికి కేవలం ఏప్స్ నుంచి లెక్కవేసుకున్నా కనీసం 8 మిలియన్ల సంవత్సరాల సమయం పట్టింది. హోమోసెపియన్ దశ నుండి శ్రమ కారణంగా' క్రమ క్రమంగా ఆధునిక మానవుడిగా, మెసొపటోమియా నాగరికుడిగా అభివృద్ధి చెందడానికి ఒక లక్షా తొంభై వేల సంవత్సరాల కాలం పట్టింది. కాబట్టి ఒక్క హోమోసెపియన్ల పరిణామక్రమాన్ని వీక్షించడానికే సత్యపాల్ గారి పూర్వీకుడు (ఆయన డైరెక్టుగా మనిషిగా పుట్టాడని అనుకున్నా సరే!) దాదాపు రెండు లక్షల సంవత్సరాలు బ్రతకాలి. అన్నేళ్లు బ్రతికిన మనిషి లేడు కాబట్టి డార్విన్ జీవితకాలం శ్రమించి కనుగొన్నదంతా వృథా అనేస్తారా? పరిణామం జరిగిందని చెప్పడానికి వందల ఆధారాలున్నాయి. శరీర నిర్మాణ శాస్త్రం, శిలాజాల విజ్ఞానం, పిండోత్పత్తి శాస్త్రం ఇలా ఎన్నో రకాల సైన్సు రుజువులు వున్నాయి. జన్యుశాస్త్రం అభివృద్ధి చెందాక మరింత పకడ్బందీ రుజువులు ముందుకొచ్చాయి.

పరిణామ సిద్ధాంతం సృష్టివాదానికి పెద్ద అవరోధం. 'ఆరిజిన్ ఆఫ్ స్పీసెస్' (ప్రాణుల ఆవిర్భావం) గ్రంథం విడుదలైనప్పటి నుంచే దానిపై పెద్ద వివాదం వుంది. డార్విన్ బతికున్నప్పుడే ఎన్నో డిబేట్లు జరిగాయి. డార్విన్ అనారోగ్య కారణంగా అన్ని సభలకూ వెళ్లలేక పోయేవాడు. కానీ అతని ప్రియ శిష్యుడు థామస్ హక్స్లే మాత్రం హాజరయ్యేవాడు. అలాంటి ఓ సభలో హక్స్లే డార్విన్ సిద్ధాంతాన్ని వివరించి కూర్చున్న తర్వాత ఒకాయన లేచి - "ఏమండీ హక్స్లే గారూ! మీరు చెప్పేది నిజమైతే మీ తాతలు కోతులా? మీ తాతల వంశం కోతులా? మీ బామ్మ వంశం కోతులా?" అంటూ ఎగతాళి చేశాడట! దానికి ఆయన - "ఓ మహానుభావా! ఇంత వివరంగా చెప్పినా శాస్త్ర జ్ఞానం వంటపట్టించుకోని నీలాంటి వారికంటే, ఆ కోతులే నా వంశమని చెప్పుకోడానికి నేనెంతో గర్వపడతాను" అని బదులిచ్చాడట!

సత్యపాల్ డార్విన్ వాదం అసత్యమని చెప్పినపుడు చాలా మంది శాస్త్రవేత్తలూ, మేధావులూ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. చాలా నగరాల్లో సైన్సు సంస్థలూ, హేతువాద సంఘాలూ ర్యాలీలు నిర్వహించాయి. కానీ నిమ్మకు నీరెత్తిన ఈ ప్రభుత్వం అన్నంత పనీ చేస్తూ ఈ రోజు ఎన్.సీ.ఈ.ఆర్.టీ. పాఠ్య పుస్తకాల నుండి డార్విన్‌ను తొలగించింది. రేప్పొద్దున్న ఎవరైనా ఉపాధ్యాయుడు విద్యార్థుల ఆసక్తి కొద్దీ తరగతి గదిలో డార్విన్ సిద్ధాంతం బోధిస్తే 1925లో అమెరికా టెన్నిసీలో జరిగినట్టు అది నేరమౌతుందేమో! ఆ అమెరికా సంఘటనపై వచ్చిన సినిమానే 'ఇన్హెరిట్ ది విండ్'.

### సినిమా నేపథ్యం :

అమెరికా టెన్నిసీ రాష్ట్రంలో 1925లో 'మంకీ ట్రయల్' అనే న్యాయ విచారణ జరిగింది. ఆ రాష్ట్రంలోని చట్టం ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో డార్విన్ సిద్ధాంతం బోధించటం నేరం. విశ్వం దైవ సృష్టి. అది పరిణామం చెందుతుందని చెప్పడం దైవదూషణ కింద లెక్క. కానీ జాన్ థామస్ స్కోప్స్ అనే సైన్స్ టీచర్ తన క్లాసులో డార్విన్ సిద్ధాంతం బోధించాడు. ఆ నేరంపై జరిగిన విచారణే స్కోప్స్ మంకీ ట్రయల్'. ప్రముఖ లాయర్లు నిందితుడికి వ్యతిరేకంగానూ

అనుకూలంగానూ వాదించారు. చాలా దుమారం రేపిన ఈ సంఘటన ఆధారంగా 1955 లో 'ఇన్హెరిట్ ది విండ్' అనే ప్రఖ్యాత నాటకం వచ్చింది. ఆనాటి మెకార్థిస్టు నియంతృత్వ పాలనలో మేధావులపై, మరీ ముఖ్యంగా కమ్యూనిస్టులపై నిఘా సాగుతున్న దశలో ఈ నాటకం వచ్చింది. చాలా సంచలనం సృష్టించింది. 1949లో జార్జి ఆర్వెల్ రాసిన '1984' నవలలాగా ఈ నాటకం చాలా సంచలనం సృష్టించింది. నియంతృత్వ పోకడలు పడగవిప్పే ఏ దశలోనైనా, ఆలోచించే హక్కుపై ఉక్కు పాదం మోపే ఏ సందర్భంలోనైనా ఇటువంటి ఇతివృత్తాలు ప్రాసంగికంగా అనిపిస్తాయి. అందుకే ఈ నాటకాలు వేర్వేరు స్థలకాలాల్లో సరికొత్త రూపాల్లో ప్రదర్శితమౌతూనే వుంటాయి. 1960 లో 'ఇన్హెరిట్ ది విండ్' నాటకాన్ని స్టాన్లీ క్రామర్ అనే ప్రగతిశీల దర్శకుడు సినిమాగా తీశాడు. జెరోమ్ లారెన్స్, రాబర్ట్ ఎడ్విన్ లీ రాసిన నాటకం ఆధారంగా నెడ్రిక్ యంగ్, హెరాల్డ్ జాకబ్ స్మిత్ స్క్రీన్‌ప్లే సమకూర్చారు. ఇందులో స్పెన్సర్ ట్రేసీ న్యాయవాది 'హెన్రీ డ్రమ్మండ్'గా, ఫ్రెడ్రిక్ మార్చ్ 'మాథ్యూ హారిసన్ బ్రాడీ'గా అద్భుతంగా నటించారు. ఈ హేమాహేమీల నటన కోసం ఈ సినిమాను మళ్లీ మళ్లీ చూడొచ్చు. 1965, 1988, 1999 సంవత్సరాల్లో ఈ సినిమాను టెలివిజన్ కోసం మరో మూడు సార్లు పునర్నిర్మించారు. సైబల్ మిత్రా మనదేశ తాజా పరిస్థితుల దృష్ట్యా ఇదే నాటకం ఆధారంగా 'ది హోలీ కాన్స్పిరసీ' (పవిత్ర కుట్ర) (2022) అనే సినిమాను నిర్మించాడు. నసీరుద్దీన్ షా, సౌమిత్ర చటర్జీ కలిసి నటించిన ఏకైక సినిమా ఇదే.

**సినిమా కథ :**

సినిమా లేదా నాటకం కోసం ఒరిజినల్ మంకీ ట్రయల్ పాత్రలూ, స్థలాల పేర్లను మార్చారు. హిల్స్‌బోరోలో ఓ పబ్లిక్ స్కూలు ఉపాధ్యాయుడు బెర్ట్రామ్ కేట్స్. యెహోవా ఏడు రోజుల్లో సకల జగత్తునూ సృష్టించాడని బైబిల్ లోని జెనిసిస్ అధ్యాయం చెబుతోంది. కానీ అందుకు భిన్నంగా కేట్స్ క్లాసులో డార్విన్'నిజం' బోధించాడు. అందుకే అతడు ఆ ఊరి చట్టం ప్రకారం నిందితుడు. మతగురువు రెవరెండ్ జెరెమియా బ్రౌన్‌తో సహా ఊరిలోని పెద్దలంతా కేట్స్‌కు మరణ శిక్ష పడాలని కోరారు. ప్రముఖ బైబిల్ పండితుడూ, మూడుసార్లు అధ్యక్ష పదవికి పోటీ చేసిన మాథ్యూ బ్రాడీ ఈ కేసులో కేట్స్‌కు వ్యతిరేకంగా వాదించడానికి రావడంతో ఈ కేసుపై అందరికీ ఆసక్తి పెరిగింది. కానీ కేట్స్ పక్షంలో వాదించే న్యాయవాది కూడా తక్కువ వాడేం కాదు. ఒకప్పుడు బ్రాడీ స్నేహితుడే. ఆయన పేరు హెన్రీ డ్రమ్మండ్. ప్రఖ్యాత వార్తాపత్రిక 'బాల్టిమోర్ హెరాల్డ్' అధిపతి హార్న్‌బెక్ హెన్రీ చికాగో నుండి డ్రమ్మండ్‌ను రప్పించాడు. వార్తాపత్రికలూ, రేడియోలూ ఈ కేసు గురించి దేశవ్యాప్త కవరేజీని అందించాయి.

బ్రాడీ క్రైస్తవ మతానికీ, డ్రమ్మండ్ సైన్సుకూ ప్రాతినిధ్యం వహిస్తూ కోర్టులో భీకరంగా తలపడతారు. ఈ వాదనల సందర్భంగా సైన్స్, మత నమ్మకాలకు సంబంధించిన ఎన్నో అంశాలు చర్చకు వచ్చాయి. డ్రమ్మండ్ సైన్సు టీచర్ను గెలిపించడానికి ఎన్నో రకాలుగా ప్రయత్నించాడు. 'యువరానర్, ఆలోచించే హక్కుపైనే ఈనాడు విచారణ జరుగుతున్నట్టుంది' అని అంటాడు డ్రమ్మండ్. 'ఓ మనిషిపైన విచారణ జరుగుతోంది' – కౌంటరిస్తాడు బ్రాడీ. 'కాదు, ఆలోచించే మనిషిపైన' గర్జిస్తాడు డ్రమండ్. డార్విన్ సిద్ధాంతంపై చర్చించడానికి ఎంతో కష్టపడి శాస్త్రవేత్తల్నీ, పండితుల్నీ కోర్టు ముందు హాజరుపరుస్తాడు. కానీ వారిని విట్నెస్ బాక్సులోకి పిలవబోయిన ప్రతిసారీ ప్రాసిక్యూషన్ అభ్యంతరాన్ని చెబుతుంటే దానికి జడ్జి సమర్థిస్తూ ఉంటాడు. విచారణ 'డార్విన్ సిద్ధాంతాన్ని బోధించడంపై' గానీ, 'డార్విన్నిజంపై' కాదని అవతలి వాళ్లు సమర్థించుకుంటూ ఉంటారు. ఒక దశలో విసుగు చెందిన డ్రమ్మండ్ కోర్టును ధిక్కరించడంతో జడ్జి ఆయనపై జరిమానా విధిస్తాడు. బెయిల్ సొమ్ము కట్టడానికి తన పొలాన్ని తాకట్టు పెడతానని ముందుకు వస్తాడు జాన్ స్టెబిన్స్ అనే ఆయన. స్టెబిన్స్ కుమారుడు కేట్స్ స్నేహితుడు. ఆ అబ్బాయి ఈత ప్రమాదంలో చనిపోతే బాప్టిజం చేసుకోనందున ఆ అబ్బాయి నరకానికి వెళ్తాడని దురుసుగా మాట్లాడతాడు ఈ కేసును బలంగా సమర్థిస్తున్న మతగురువు రెవరెండ్ జెరెమియా బ్రౌన్. మనుషుల్ని భయపెట్టే మతంపై ఆగ్రహం కలుగుతుంది స్టెబిన్స్ దంపతులకూ, కేట్స్‌కు కూడా.

న్యాయవిచారణ సాగుతుండగానే మూకను రెచ్చగొట్టి కేట్స్ ఉన్న జైలు ముందూ, డ్రమ్మండ్ బస చేసిన హోటల్ ముందూ కాగడాలతో హింసాత్మక ప్రదర్శన చేయిస్తారు మత దురహంకారులు. "*ప్రపంచ దుష్టులారా, ఏకంకండి. దహనం చేయడానికి మీ ఎదుట మేధావులు తప్ప ఇంకెవరూ మిగలలేదు.*" అని వేళాకోళం చేస్తాడు హార్న్‌బెక్. తన సాక్షులందరినీ నిరాకరిస్తుంటే చివరికి బ్రాడీనే బోనులో నిలబెట్టి విచారిస్తాడు డ్రమ్మండ్. డార్విన్‌పై సాగాల్సిన చర్చ బైబిల్‌లోని అసంగతాలపై సాగుతుంది.

తన బైబిల్ పరిజ్ఞానంపై అతి నమ్మకంతో రెడీ అయిన బ్రాడీ క్రమంగా క్రాస్ క్వశ్చెనింగులో బోల్తా పడతాడు. దేవుడు క్రీ.పూ. 4004 అక్టోబరు 23 ఉదయం 9 గంటలకు విశ్వాన్ని సృష్టించాడని బల్లగుద్ది చెబుతాడు బ్రాడీ. 'అయితే ఈ సమయం ఈస్టర్ స్టాండర్డ్ టైం ప్రకారమా లేక రాక్ మౌంటెన్ టైం ప్రకారమా? ఎందుకంటే అప్పటికింకా దేవుడు సూర్యుడ్ని సృష్టించలేదుగా?' అని ప్రశ్నిస్తాడు డ్రమ్మండ్. జోషువా సూర్యుడ్ని ఆపేశాడని బైబిల్‌లో ఓ చోట వుంది. "సూర్యుడ్ని ఆపేస్తే భూమి గతి ఏమయ్యుంటుంది", "భూమి సూర్యుడిలోకి జంప్ చేసిందా?" అని చమత్కరిస్తాడు డిఫెన్స్ న్యాయవాది. 'బైబిల్‌లో ట్రాక్టర్ గురించి లేదు, మోజెస్ ఏనాడూ టెలిఫోనును ఉపయోగించలేదు. బైబిల్ ప్రకారమే మనమంతా నడుస్తున్నామా?.... ప్రతి జీవికీ ఆలోచించే శక్తి నిచ్చిన దేవుడు ఈ టీచర్‌కి కూడా ఆలోచించే శక్తి నిచ్చాడని ఎందుకనుకోకూడదూ?' "బైబిల్‌లోని ప్రతి అక్షరాన్నీ సమర్థించలేము. ..... బైబిల్ మంచి గ్రంథమే, కానీ అదొక్కటే గ్రంథం కాదు, 'ఆరిజిన్ ఆఫ్ స్పిసీస్' లాంటి గ్రంథాలు కూడా ఉన్నాయి."

డ్రమ్మండ్ కోర్టులో చెప్పే ప్రతి డైలాగుకూ చప్పట్లు కొట్టాలని పిస్తుంది. "కోర్టు బయట 'రీడ్ యువర్‌బైబిల్' అనే బ్యానర్ ఉంది. దాంతో పాటు 'రీడ్ యువర్ డార్విన్' బోర్డు కూడా పెట్టండి" అని జడ్జిని కోరతాడు డ్రమ్మండ్. బ్రాడీని దేవుడిగా కొలిచే జనాలు కోర్టులో అతడి ప్రతి మాటకూ 'ఆమెన్' అని వంతపాడుతుంటే దాన్ని కూడా కోర్టు ప్రొసీడింగ్స్‌లో నోట్ చేయమని అపీల్ చేస్తాడు డ్రమ్మండ్. ఆ

జడ్జి మత పెద్దలతో కుమ్మక్కై వుండడం చూస్తే నేటి మన దేశ పరిస్థితి మన కళ్ల ముందు కదులుతుంది.

నిందితుడ్ని నిర్దోషిగా ప్రకటించనూ లేక, పెద్ద శిక్ష వేయనూ లేక చివరికి చిన్న జరిమానాతో వదిలేస్తారు. కానీ ఒక్క డాలర్ కూడా చెల్లించేది లేదనీ, పై కోర్టులో తాము అప్పీలు చేసుకుంటామనీ తేల్చేస్తాడు డ్రమ్మండ్. బ్రాడీ మాత్రం తనను దేవుడిగా కొలిచిన జనాల ముందు అభాసుపాలవడం జీర్ణించుకోలేక ఆ బాధతో చనిపోతాడు. అయినా ఆయనపై తన గౌరవాన్ని స్పష్టంగానే ప్రకటిస్తాడు డ్రమ్మండ్.

**సినిమా శీర్షిక :**

తన ఇంటికి తనే ఎసరు పెట్టేవాడికి, 'గాలి మాత్రమే దక్కుతుంది' ('ఇన్హెరిట్ ది విండ్') అంటే 'ఏమీ మిగలదు' – అనే బైబిల్ నీతి సూత్రం ఆధారంగా ఈ సినిమాకు ఆ పేరు పెట్టారు. మతగురువు రెవరెండ్ బ్రౌన్ తన కుమార్తెనే శపిస్తాడు. అతని కుమార్తె రేచెల్ నిందితుడి ప్రేయసి. ప్రియుడికీ, పితరుడికీ మధ్య నలిగిపోతుంటుంది ఆమె. ప్రియుడి మేలు కోసం ప్రైవేటుగా చెప్పిన మాటల్ని కోర్టులో అందరి ముందూ పెడతాడు బ్రాడీ. ఈ అనుభవాలతో ఆమె తన ఊగిసలాటను విడనాడి, తండ్రిని త్యజించి, తన ప్రేమికుడి పక్షంలో చేరిపోతుంది. అంటే ఆ తండ్రికి 'మొండి చేయి' మిగిలినట్టే. అతను 'విండ్'ను 'ఇన్హెరిట్' చేసినట్టే. ఈ శీర్షికను ఇంకొంత విస్తృతంగా వివరిస్తే పిడివాదం తన దేశ మేధస్సును మింగేస్తే ఆ దేశానికి అధోగతి పడుతుందని చెప్పొచ్చు.

**మనదేశంతో పోలిక :**

ఈ సినిమా మన దేశ తాజా పరిస్థితికి అద్దం పడుతుంది. 'మనోభావాలు గాయపడడం' మనకు అనుదిన సమస్య. 'భావాలు కాదు, నిజాలు కావాలి' అని కోర్టు వాదనలో ఓ సారి గర్జిస్తాడు డ్రమ్మండ్. ఆయన అన్న ఏదో మాటను పట్టుకుని 'నువ్వు మా కమ్యూనిటీని అవమానిస్తున్నావ్' అని బ్రాడీ అంటే, 'మరి మీ కమ్యూనిటీ ప్రపంచాన్నే అవమానిస్తోంది కదా?' (డార్విన్ను వ్యతిరేకించడం ద్వారా) అని టక్కున బదులిస్తాడు డ్రమ్మండ్. మన ప్రభుత్వ నిర్ణయాల్నీ, దేశ పరిస్థితుల్నీ చూసి నేడు ప్రపంచమే నవ్వుకుంటోంది. 'నిజాన్ని మాట్లాడిన వాడిని మంటల్లో కాల్చేసిన 16వ శతాబ్దంలోకి సగర్వంగా వెనక్కి వెళ్ళిపోదామా' మన అమెరికా రాజ్యాంగంలో మధ్య యుగపు చెత్తనంతా నింపేద్దామా?' అన్న డ్రమ్మండ్ మాటలు విన్నప్పుడు మన వీపు మనం తడుము కోవలసిందే. 'పిడివాది మాత్రమే తన అవసరం కోసం ప్రతీకారంతో రగిలే దేవుడిని సృష్టిస్తాడు' అన్న మాటలు విన్నప్పుడు హిందూత్వం సృష్టించిన 'యాంగ్రీ రామ, యాంగ్రీ హనుమాన్, మహాకాల్' వంటి స్టిక్కర్లు మన కళ్ల ముందు కదులుతాయి. అలానే యుద్ధ నినాదంలా వాడే 'జై శ్రీరాం' అన్న మాట కూడా! డ్రమ్మండ్ గురించి 'డెవిల్స్ అడ్వకేట్' అని రాసిన బ్యానర్ చూసినప్పుడు ఈ దేశం తన మేధావుల గురించి వర్ణించే ఎన్నో దూషణలు మదిలో మెదులుతాయి. మరోచోట, 'డార్విన్ తప్పే చెప్పాడు. మనిషి పరిణామం చెందలేదు, ఇంకా వానర స్థాయిలోనే పడివున్నాడు' అన్న డైలాగు కరెక్టుగా మన అంధభక్తుల గురించి చెప్పినట్టే అనిపిస్తుంది. ఆ రోజు అమెరికా మీడియా నిజానిజాలను ప్రసారం చేసింది. కానీ ఈ ఆధునిక యుగంలోనూ మన గోదీ మీడియా నిస్సిగ్గుగా వ్యవహరిస్తోంది. అమెరికాలో ఒకప్పుడు 'మంకీ ట్రయల్' సాగినా, ఆ దేశం తర్వాతి కాలంలో ఛాంధస మతవాదం వీడింది. ఇటీవలి 'ప్రజాశక్తి' (23-04-2023) వార్త ప్రకారం 'మతం తమకు ముఖ్యమని' అంటున్న అమెరికన్లు కేవలం 39 శాతం మాత్రమే'నట!

## 'ఆహ్వానం' లక్ష్మిస్మృతి



**'ఆహ్వానం'** తెలుగు సకుటుంబ మాసపత్రిక యజమానీ, సంపాదకురాలు ఎస్.ఎస్. లక్ష్మి తన 74వ యేట విజయవాడలో 17-4-2023న మరణించారు. ఆమె 5-2-1949న ప్రకాశంజిల్లా – వేటపాలెం దగ్గర పందిళ్ళపల్లిలో జన్మించారు.

మెట్రిక్యులేషన్ వరకే చదివిన సమయం సామ్రాజ్యలక్ష్మి, తన 8వ ఏటనే మరణించిన తన తండ్రి ప్రభావం జీవితాంతం తనను నడిపించిందనేవారు. ఆమె స్త్రీవాది. చలం, సంజీవదేవ్‌ల రచనల ప్రభావంతో రచనా వ్యాసంగం చేశారు. ఏప్రిల్ 1993 నుండి 1998 జూలై వరకు 'ఆహ్వానం' పత్రికను ప్రచురించారు.

మనిషికి వుండాల్సిన మూడు విలువలు – స్వేచ్ఛా చింతన, సౌజన్యం (మంచితనం), మంచి అభిరుచి. వీటిని పెంపొందించే సాహిత్యాన్ని అందించడం ధ్యేయంగా 'ఆహ్వానం' పత్రికను 63 నెలలు నడిపారు. తాను రాసిన సంపాదకీయాలను 'అంతరంగ పరిమళం' అనే శీర్షికతో 2010 ఫిబ్రవరిలో ప్రచురించారు. రాధ, వరూధిని, ద్రౌపది, శకుంతల మొదలైనవారిపై ఎస్.వి. భుజంగరాయశర్మ చేసిన ప్రసంగాలను లక్ష్మి 1989 మార్చిలో 'దీపమాలిక' పేరుతో ప్రచురించారు.

వారి మరణానికి సంతాపం తెలియచేస్తున్నాం. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటిస్తున్నాం.

కథ

# అపారమైన దయ

తమిళ మూలం : ప్రభంజన్ ఇంగ్లీషు: పి. రాజా తెలుగు : కొత్తపల్లి రవిబాబు

**ఆ** సమయంలో అరెస్టు అవుతానని కేశవన్ కలలో కూడా అనుకోలేదు.

సూర్యుడు చీకటిని పారదోలడానికి పోరాడుతున్నాడు. చీకటేమో ఈ భూమిపై మరికొంత కాలం వుండే తన హక్కు కోసం పోరాడుతోంది. సూర్యుడు పొగరుగా వున్నాడు. అంధకారం అయిష్టంగా భూమిపై నుంచి నిష్క్రమిస్తోంది. ఉష: కాలం చెరువులో ఒక మునక వేయడానికి చాలా అనువైన కాలం. దుస్తులు తీసేముందు మంచుతో నిండిన చల్లని గాలి నిన్ను ఆపుతుంది. మంచులా చల్లగా వుండే చెరువు నీరు నీ కాళ్ళను కొరికి వేస్తాయి. కానీ ధైర్యం పుంజుకొని చెరువులోకి దిగి ఒక మునక వేస్తే చల్లటి నీటిలో స్నానం చేయాలనే నీ తడబాటు అంతా పారిపోతుంది. ఆ తర్వాత మరలా చెరువునుండి బయటకు రాబుద్ధి కాదు. చెరువులో మునగడం మురికిని వదిలించుకోడానికి కాదు. ఎవరైనా చెరువులో స్నానం చేసి తమ మురికిని శుభ్రం చేసుకున్నారా? చెరువులో దిగడం ఆనందం కోసం.

కేశవన్ ముందు ఆకాశం ఒక పెద్ద అర్ధచంద్రాకారపు కప్పులా వ్యాపించి వుంది. నక్షత్రాలు అక్షరాల్లా వున్నాయి. ఇండియన్ ఇంక్‌తో కళాకారుడి కుంచెతో సృష్టింపబడిందా అన్నట్లు కొద్ది దూరంలో దేవాలయ గోపురం కనబడుతోంది. అతడు రొమ్ము లోతు నీళ్ళలో నుంచున్నాడు. అతని బరువైన హృదయం తేలిక పడుతోంది. ఇంతసేపు భయం గుప్పిట్లో వున్నా, నీడలా అతన్ని అనుసరించినా అదంతా ఇప్పుడు క్రమంగా అదృశ్యమవుతూ వుంది.

చెరువు నుంచి బయటకు రాకుండా నీళ్ళను అటూ ఇటూ చిమ్మ సాగాడు. చెరువుకు అవతల పక్క స్నానం చేయడానికి వచ్చిన స్త్రీల మాటల వల్ల అతని ఆట ఆగిపోయింది. ఉషోదయం అయిందని గుర్తించాడు. దేవాలయ గోపురం వెనుకనుండి సూర్యకాంతి ఆకాశంలో వ్యాపిస్తోంది. అతను అకస్మాత్తుగా గమనించాడు. కొంతమంది ఆ వూరికి చెందనివారు కొత్త వారు తెల్లటి ఫాంట్లు, చొక్కాలు వేసుకుని చెరువు చుట్టూ వున్న మెట్లపైన నిలబడివున్నారు.

వాళ్లెవరో కేశవన్ కు అర్ధమైంది. వలలో చిక్కుకుపోయానని అర్ధం చేసుకున్నాడు. తన నిర్ణయాన్ని ఆచరణలో పెట్టాలనుకున్నాడు. చెరువు మెట్లు ఎక్కాడు. మొదటి మెట్టు పై పెట్టిన తన ఫాంటు తీసుకుని తొడుక్కున్నాడు. టవలు పిండి కింద పెట్టాడు. ఆ తర్వాత చొక్కా తొడుక్కుని, టవలు తీసుకుని తన వైపు కళ్ళార్పకుండా చూస్తున్న ఇద్దరి వైపు నేరుగా నడిచాడు.

సూర్యుని ప్రతాపానికి అంధకారం మటుమాయమైంది.

బొద్దు మీసాలు సవరించుకుంటూ మశూచికం మచ్చలున్న ఒక లావుపాటి వాడు అడిగాడు, ' నీవేనా కేశవన్ అంటే?'

'అవును నేనే'.

అతడి సమాధానం పూర్తికాగానే అతడి ముఖాన్ని ఒక బలమైన గుద్దు తాకింది. ఎన్నో రోజులుగా తిండి లేని కేశవన్ రెండు మూడు రోజుల క్రితం మాత్రమే రెండు ఇడ్లీలు తిన్నాడు. ఆ దెబ్బకు ధక్ మంటూ కింద ఇసుకలో పడ్డాడు.

'అతను తన పేరు చెప్పిన తరువాత కొట్టి వుండాల్సింది కాదు' అన్నాడు చీఫ్ లా వున్న మరో మనిషి. దానికి ఆ లావుపాటి వాడు మౌనం వహించాడు. కేశవన్ కిందనుండి లేవటానికి ప్రయత్నిస్తుండగా ఆ చీఫ్ తన చేతిని అందించాడు సహాయంగా. చెరువుకు నాలుగు వైపులా నుంచున్న వారందరూ అక్కడ గుమి కూడారు.

చీఫ్ నడక ప్రారంభించాడు. కేశవన్ ను ముందుకు నెట్టుకుంటూ మిగిలిన వారు ఆయన్ని అనుసరించారు. నోటి చివర కారిన రక్తాన్ని తడి టవలుతో తుడుచుకుంటూ కేశవన్ తడబడుతూ నడుస్తున్నాడు.

ఒక చెట్టుకింద మెయిన్ రోడ్డులో పోలీసు వ్యాన్ వుంది. చిక్కటి నీలం రంగులో వున్న ఆ కారు ఇనుప చువ్వలూ,తలుపులతో ఒక జైలులా వుంది. వ్యాన్ లోపల కుషన్ వున్న రెండు పొడవైన బెంచీలు అటూ ఇటూ వున్నాయి. కేశవన్ దానిపై కూర్చుందామని వెళ్ళాడు. కానీ ఆ మీసాలపోతు అతన్ని రెండు బల్లల మధ్య కింద కూర్చోమన్నాడు.

' లేదు, లేదు, అతన్ని బెంచీ మీద కూర్చోనీయండి. అతని చెరోపక్క ఇద్దరిద్దరు కూర్చోండి' అన్నాడు చీఫ్. ఆ తర్వాత లావుపాటివాడితో 'నీవు పోయి డ్రైవరు పక్కన కూర్చో' అని చెప్పాడు.

కేశవన్ ఎదురుగా చీఫ్ కూర్చున్నాడు. డ్రైవరు వ్యాన్ స్టార్ట్ చేశాడు. బెంచీల కింద తుపాకులు పిల్లుల్లా నిద్ర పోతున్నాయి. వ్యాన్ వేగం అందుకున్నాక తుపాకులు అటూ ఇటూ కదులుతూ ఒకదాన్నొకటి కొట్టుకుంటున్నాయి. భరింపరాని మోత వస్తోంది.

చీఫ్, కేశవన్‌ను మరింత దగ్గరగా చూశాడు. కేశవన్ ముఖం చిన్న పిల్లవాడి ముఖంలా వుంది. ఇప్పుడిప్పుడే గడ్డం వస్తోంది. ఎందరో మొండి నేరగాళ్లను చీఫ్ చూశాడు.

కేశవన్ అమాయకుడైన స్కూలు పిల్లవాడిలా వున్నాడు. వీడు హత్య చేసివుంటాడా అని అనుమాన పడ్డాడు.

'ఎన్నేళ్ళోయ్ నీకు?'

కేశవన్ రోడ్డుకు రెండు పక్కలా కాపలాగా నుంచున్నట్లున్న చింత చెట్లనూ, దూరంగా వున్న కొండలనూ, వాటిపై వున్న చెట్లు చేమలను చూస్తూ మాట వినిపించేటప్పటికి వాస్తవ ప్రపంచంలోకి వచ్చాడు.' ఏమిటి సార్ అడిగారు?"

చీఫ్ మరలా అదే ప్రశ్న వేశాడు.

'వచ్చే జనవరికి ఇరవై మూడేళ్లు పూర్తి అవుతాయండి'

అంటే తనకంటే కేశవన్ ఏడేళ్లు చిన్నవాడని చీఫ్ అనుకున్నాడు. వచ్చే జనవరి అతడు చూడకపోవచ్చు. అతడింకా మహా వుంటే కొన్నిరోజులు మాత్రమే బతికి వుంటాడు. రేపు ఉదయం అతడిని హెడ్ క్వార్టర్స్‌లో అప్పచెప్పాలి. ఒక రోజంతా విచారణ సాగుతుంది. విచారణ పేరుతో అతన్ని చిత్రహింసలు పెడతారు. నిజాన్ని బయటకు లాగడానికి పాత పద్ధతులూ, కొత్తపద్ధతులూ ఉపయోగించి ఎముకలు విరగకొడతారు.

ఇనుపజల్లెడలోంచి చూస్తూ మీసాల పోతు 'దేవా!......నాకు చచ్చేంత ఆకలిగా వుంది. దగ్గర్లో ఏదైనా వూళ్ళో అన్నం తిందాం' అన్నాడు.

చీఫ్ దానికి 'సరే' అని కేశవన్‌ను అడిగాడు 'ఏమిటి ఆలోచిస్తున్నావ్?' అని.

కేశవన్ తన చేతివేళ్ళు రెండు ముందుకు చాచి, 'ఏదో ఒక వేలు పట్టుకోండి సార్' అన్నాడు.

'ఎందుకు?'

'పట్టుకోండి, చెప్తా'.

పట్టుకున్నాడు.

'కరక్ట్. మీ పేరు దేవ నాధన్ అయి వుండాలి. అవునా?'

'కాదు, దేవకుమార్'.

'అరె! తప్పయిపోయిందే. మీ పేరు దేవరాజన్ లేక దేవనాధన్ కావచ్చు అనుకున్నాను' అంటూ కేశవన్ నవ్వాడు.

దేవాకు, మిగిలినవారికీ కేశవన్ ప్రవర్తన విచిత్రంగా వుంది.

నేరగాళ్ళు పట్టుబడిన తరువాత పోలీసుల చేతుల్లోంచి తప్పించుకోడానికి మార్గాలు వెదుకుతారు. లేదా పోలీసు అధికారులు అడిగే వేలాది ప్రశ్నలకు బట్టీ పట్టిన జవాబుల గురించి మనస్సులో రిహార్సల్ వేసుకుంటుంటారు. అంతేగానీ ఎవరూ ఇలాంటి ఆటలు ఆడాలనుకోరు.

వ్యాన్ ఆగింది. అందరూ కిందకు దిగారు. కేశవన్ మాత్రం కదల్లేదు. మెదల్లేదు.

మీసాలోడు అడిగాడు 'వీడిని చూస్తూ ఎవరుంటారు?'

దేవా అన్నాడు 'వాడిని కూడా మనతో పాటు రానీయండి.'

'ఇక వాడు కూడా వస్తే మనకు డబ్బు చాలదు. హంతకుడికి అన్నం పెట్టారు అంటారు.'

'కానీ వాడికి కూడా ఆకలి వేస్తుందిగా.'

'సరే.'

'దిగిరావయ్యా. కేశవన్!' అన్నాడు దేవా.

అందరూ మొదటి ఇడ్లీ తినేటప్పటికి కేశవన్ మూడు ఇడ్లీలు తిన్నాడు.

'ఎన్నాళ్ళైంది, తిండి తిని?'

జవాబివ్వడానికి కేశవన్‌కు సమయం పట్టింది. 'ఈరోజు శుక్రవారం. నిన్న ఏమి తినలేదు. బుధవారం మధ్యాహ్నం తిన్నాను.... కామ్రేడ్ ఒకరు తెచ్చారు. ........'

కేశవన్ అకస్మాత్తుగా ఆపేశాడు. ఒక్క క్షణం పాటు అతను మరచిపోయాడు. కామ్రేడ్ పేరు గుర్తు వుంచుకోవడం గానీ, గుర్తు పట్టడం కానీ ఎట్టి పరిస్థితిలోనూ చేయగూడదన్న సూచనలను.

'ఎవరు వాడు?' అడిగాడు లావుపాటి వాడు.

'......................................'

'ఆహా! నోరు విప్పవు కదా...... రేపు ఆఫీసర్లు అడగాల్సిన పద్ధతిలో అడుగుతారులే.... అప్పుడు జవాబులు ప్రవాహంలా వస్తాయిలే.'

వారు ప్రయాణం కొనసాగించారు. కేశవన్ రోడ్డుకు రెండు వైపులా ఏపుగా పెరిగిన చెట్లనూ, రోడ్డుమీద పోయే వారిని చూస్తూ ఆనందిస్తున్నాడు. అతడు ఈ ప్రపంచానికి దూరంగా పగటి పూట దాక్కుంటూ, రాత్రిపూట నడుస్తూ ఆరునెలలు కాలం గడిపాడు. అతన్ని కలిసిన కామ్రేడ్లతో చేసిన సంభాషణే అతన్ని ఓదార్చాయి. మరలా మనుషుల మధ్య చాలా కాలం తర్వాత వుండటం ఆనందంగా వుంది. తిరణాలకు పోయే పిల్లలు ఎంత ఆనందిస్తారో అంత ఆనందాన్ని అనుభవిస్తున్నాడు.

హెడ్ క్వార్టర్స్ పట్టణానికి కొంచెం దూరంగా ఒక తోపులో వుంది. అది అక్కడ వుందని తెలిస్తేనే కనబడుతుంది. మామూలుగా అయితే కనుక్కోవడం అసాధ్యం.

'వీడికి సంకెళ్ళు తగిలిద్దామా?' అని అడిగాడు మీసాలపోతు.

'వీడు అట్లాంటి వాడు కాదులే...' దేవా

'పైపైన చూసి మోసపోకు.'

'నాకు తెలుసులే. ఈ విషయం నీవు పట్టించుకోకు.'

'మరి రేపు ఇతన్ని ఆఫీసర్లకు అప్పగించే విషయం సంగతేమిటి.'

'అది నా కర్తవ్యం. దీన్ని కూడా నీవు పట్టించుకోకు.'

'సరే..సరే.'

ఆ హెడ్ క్వార్టర్స్‌లో కేశవన్‌ను బంధించిన గదిలో చిన్న చిన్న చెక్క పెట్టెలున్నాయి. గోడకు కొట్టిన మేకులకు ఖాకీ చొక్కాలు వేలాడుతున్నాయి. ఖాకీ నిక్కర్లు ఆ పెట్టెల మీద పెట్టి వున్నాయి.

దేవా దుస్తులు మార్చుకున్నాడు. అతడి దుస్తులు చూసి 'ఈ యూనిఫాం మీకు బాగా సరిపోయింది సార్!. అన్నాడు కేశవన్.

దేవా అతనివంక చూసి 'కానీ ఈ యూనిఫాంకు నేను సరిపోను.....హు.....నా కర్మ ఇదంతాను.' అన్నాడు.

గోడకు జారబడి కూర్చున్నాడు కేశవన్. దేవా అతన్ని వదలి వెళ్తూ 'ఒక్క నిముషంలో వస్తాను' అని చెప్పి వెళ్ళాడు.

ఒంటరిగా వున్న కేశవన్ ఆలోచనలో పడ్డాడు. తను చేరాల్సిన చోటుకు చేరాడు. విచారణ ప్రారంభమౌతుంది. తను అర్హుడైనా కాకపోయినా చిత్రహింసల పర్వం మొదలౌతుంది. తనకు యావజ్జీవ శిక్ష గానీ, ఉరిశిక్ష గానీ పడవచ్చు. ఉచ్చల వాసన మధ్య యేళ్ళ తరబడి కటకటాల వెనుక వుండటం దుర్భరం. దీనికంటే చావే నయం. అది తలచుకుంటే వెన్నెముకలో చలి ప్రారంభమైంది. ఒక్క క్షణం శరీరమంతా జలదరించి తిమ్మిరెక్కింది. ఆ గదిలోకి గాలి రావడానికి ఏ మాత్రం అవకాశం లేకపోయినా.

'సుమతీ' అని గొణుక్కున్నాడు తనలో తానే. సుమతిని ఎప్పుడు గుర్తు తెచ్చుకున్నా అతనికి మచ్చల లంగా, ముదురు ఎరుపు రంగు ఓణీ వేసుకుని స్కూలుకు వెళ్ళే అమ్మాయే కళ్లముందు మెదలుతుంది. సుమతి గుండ్రంగా వుండేది. తెల్లవారుఝామున పారిజాత పుష్పాలు ఏరుతుండేది. ఏదైనా చిన్న గుండ్రటి రాయి కనబడితే సంతోషంతో ఎగిరి గంతు వేసేది. దాన్ని తెచ్చుకుని ఉమ్మి రాసి తన ఓణి చెంగుతో శుభ్రం చేసి తన తుప్పుపట్టిన జామెట్రి బాక్స్‌లో పెట్టుకునేది. ఆమెను ఆఖరిసారి చూసినప్పుడు ఆమె శవం దుస్తులు సరిగా లేకుండా అశోక వృక్షం వద్ద తుప్పల్లో పడేసి వుంది. ఆ అమ్మాయి స్థనాలపైనా, తొడలపైనా, బుగ్గలపైనా గాట్లు వున్నాయి. 'ఎంత దారుణం?' అనుకున్నాడు కేశవన్.

'సుమతీ!' అని అరిచాడు దుఃఖంతో

'ఎవరావిడ?' అడిగాడు గదిలోకి వచ్చిన దేవా.

అలా బయటకు ఉద్వేగంతో అరచినందుకు సిగ్గు పడ్డాడు కేశవన్.

'ఆ అమ్మాయి నా స్నేహితురాలు'

'అలాగా.'

'గదిలో ఉక్కగా వుంది. రా! బయటికి పోయి కూర్చుందాం' అని పిలిచాడు దేవా. ఇద్దరూ బయటికి పోయి కూర్చున్నారు.

ఆ పాత భవనం వెనుక ఒక పెద్ద తోపు వుంది. కాంపౌండు గోడల దగ్గర పెద్ద పెద్ద చెట్లు వరుసగా వున్నాయి. ఇంకా రెండు, మూడు రోజులకు పౌర్ణమి రాబోతుంది.

కేశవన్ బాగా ఊపిరి పీల్చి అడిగాడు 'ఆ చెట్లలో పారిజాతం ఉన్నదా ఏమిటి?'

దేవా నుదురు చిట్లించి 'అవును కొన్ని వున్నాయి' అన్నాడు.

'అందుకే మంచి వాసన వేస్తోంది.' అన్నాడు కేశవన్.

'నీకు బాగా ఇష్టమా పారిజాతాలు?'

'సుమతీ వాటిని బాగా ఇష్టపడేది. కానీ వాటిని గట్టిగా వాసన చూడకూడదు. ముక్కు వెంట రక్తం వస్తుంది'.

'అలాగని ఎవరు చెప్పారు?'

'సుమతి'.

'ఆ సుమతి గురించి వివరంగా చెప్పు'.

కేశవన్ ఒక్క క్షణం మౌనం వహించాడు. ఆ తర్వాత అడిగాడు 'నన్నేమి చేస్తారు రేపు?'

దేవా తల అవతలకు తిప్పి చెప్పాడు 'విచారణ చేస్తారు.'

'ఎందుకా విచారణ?'

'నీవు దండపాణిని హత్య చేశావా లేదా అని తేల్చుకోడానికి.'

'చేశాను... నేనే ఆ హత్య చేశానని అంగీకరిస్తాను. నేను చేయలేదని అనలేదు.'

'నీవీ పని ఆరునెలల క్రితం చేసి వుండాల్సింది.'

'మొదట్లో నాకు భయమేసింది. తర్వాత లొంగి పోదామనుకున్నాను. కానీ మా కామ్రేడ్లు .......'

'ఆపావే.....చెప్పు.'

'వారు నన్ను ఆపారు. ఎలాగో నన్ను వెతుక్కుంటూ వచ్చి పరిచయం చేసుకున్నారు. నేను చేసింది హత్య కాదు సామాజిక సేవ అన్నారు.'

'అయితే మెలక్కవేరి హత్య గురించి ఏమిటి? తిరువయ్యూర్ రేషన్ షాపు తగలబెట్టడం మాటేమిటి? ఇవికూడా సేవా కార్యక్రమాలేనా.. చెప్పు.'

'వాటన్నిటితో నాకు సంబంధం లేదు. అయితే ఆ చర్యలన్నిటినీ నాకు అంటగట్టారు.'

'వాళ్లెక్కడ వుంటారు?'

'నాకు తెలియదు సార్!'

'అది అబద్ధం.'

'నిజంగా చెబుతున్నా సార్! నిజంగా నాకు తెలియదు. వాళ్ళు వుండే చోటు గురించి నాకు ఎప్పుడూ చెప్పలేదు. వాళ్ళే నన్ను వెతుక్కుంటూ వచ్చారు. నేను వాళ్లదగ్గర కెన్నడూ పోలేదు.'

దేవాకు అర్థమైపోయింది. కేశవన్ అబద్ధాలు చెప్పడం లేదు. అతను అబద్ధాలు చెప్పలేడని అతని అమాయకమైన ముఖమే చెబుతోంది. కానీ రేపు ఇతన్ని విచారించే అధికారి ఇతన్ని నమ్ముతాడని హామీ ఏముంది? అతడు చచ్చినా నమ్మడు. అతడు నమ్మకూడదు. అతనికి అటువంటి శిక్షణ ఇస్తారు మరి. అనుమానించు.....ఇంకా అనుమానించు... ప్రతిదీ అనుమానించు..... ప్రతి వ్యక్తినీ అనుమానించు. అనుమానించడం వారి ఏకైక సూత్రం. దేవా నిట్టూర్చాడు.

రేపు రెండు గంటలకు అతని గోళ్ళల్లో సూదులు గుచ్చుతారు. మృదువైన వాడి శరీర భాగాలపై మిరప పొడి రాస్తారు. తొడలపై రూలరు దొర్లిస్తారు. నాడాలతో వున్న బూట్లు వాడి కాళ్ళను పచ్చడి పచ్చడి చేస్తాయి.

కేశవన్ బాదం చెట్టు మొదలుకు ఆనుకుని కూర్చున్నాడు. చందమామ నడినెత్తిన వున్నాడు.

'నీవా హత్య చేసి వుండాల్సింది గాదు.' అన్నాడు దేవా.

'నాకూ ఇప్పుడలానే అనిపిస్తోంది సార్! కానీ మీలాంటి అన్నయ్య నాకు లేడు. వుంటే మంచి సలహా ఇచ్చి ఆ నేరం చేయకుండా ఆపేవాడు. నా స్నేహితులు నన్ను బాగా రెచ్చ గొట్టారు. సుమతి శవం తుప్పల్లో చూసిన క్షణం నేను పశువునైపోయాను. మా నాన్న దగ్గర వెదురు పొదలను నరికే తళతళ లాడే పదునైన కత్తి వుంది. అది సమయానికి దొరికింది. ఆ ముళ్ళతుప్పల్లో మూడు రోజులు దాక్కొని వేచి వున్నా. ఆశించిన అవకాశం మూడో రోజున దొరికింది. మామూలుగా

దండపాణి ఆ రోజు సాయంత్రం తుప్పల్లోకి దీర్ఘ శంక తీర్చుకోడానికి వచ్చాడు. అతనికీ ఒక చెట్టు వెనుక కూర్చోవడం అలవాటు. చీకటి పడుతోంది. మోచేతులతో ముళ్ళ తుప్పలను తొలగించి వాడి మెడ మీద పదేట్లు కత్తిని విసురుదామనుకున్నాను. తుప్పల గల గల శబ్దం విని భయపడ్డాడు. వెనక్కి తిరిగాడు. నన్ను చూశాడు. నేనేం చేయబోతున్నానో వూహించాడు.. ప్రాణభయంతో పరిగెత్తడం ప్రారంభించాడు. అప్పుడు కత్తిని వాడిపై బలంగా విసిరాను. అయితే అది లక్ష్యాన్ని చేరలేదు. వాడి కాలికి వెనుక భాగంలో అది తగిలింది. అరుస్తూ కింద పడిపోయాడు. అప్పుడు నేను వాడిపై లంఖించాను.'

కేశవన్ తల వంచుకున్నాడు. అతడు వణకడం దేవా గమనించాడు.

'సార్! వాడు చావడం నేను కళ్ళారా చూచాను. అతను ఏదో చెప్పడానికి ప్రయత్నించాడు. ఎవరైనా చావబోయే ముందు నిజమే చెబుతారు. అతడూ ప్రయత్నించాడు. కానీ నోరు తెరిచే లోపల చనిపోయాడు. వాడు నేరం చేశాడు. కానీ నేనెవర్ని వాడిని శిక్షించడానికి? సరే. నేనొక క్షమించరాని నేరం చేశాను. చనిపోయిన దండపాణి శవం ముందు నేను ఏడ్చాను. వాడి శవం ముందు ముడుచుకుని కూర్చొని క్షమించమని అడిగాను. కాని నన్ను ఎవరు క్షమిస్తారు?

కేశవన్ కన్నీళ్లు మోకాలిపై పడ్డాయి. అతడు మామూలు మనిషయ్యేవరకూ దేవా వేచి వున్నాడు.

'ఇంకా మీ ఇంటి దగ్గర ఎవరెవరున్నారు?'

'మా నాన్న ఒక్కరే సార్!'

కేశవన్ దేవాని అడిగాడు, ఒక కొత్త స్నేహితుడు దొరికినట్టు 'మీ కుటుంబం ఎక్కడ వుంటోంది?'

'అమ్మా నాన్నలు బెంగళూరులో వున్నారు. గత వారం వరకు ఒక సోదరుడుండేవాడు. అతనిదీ నీ వయసే. కాలేజీలో చదివేవాడు. మంచి వెయిట్ లిఫ్టరు. బరువులు ఎత్తుతుంటే ఒక పెద్ద ఇనుపచక్రం వూడిపడి తలపై పడింది. మాకెవరికీ ఈ విషయం చెప్పలేదు. కాని ఎప్పుడూ తలనొప్పి అనేవాడు. ఏవేవో మందులు ఇప్పించాం. కాని ఒకరోజు స్పృహ కోల్పోయాడు. డాక్టరు మెదడులో ఒక వుండు ఏర్పడింది అన్నారు. అప్పటికే చాలా ఆలశ్యమై పోయింది. చనిపోయాడు.

'అతడెప్పుడు చనిపోయాడు సార్!'

'గత శుక్రవారం........ నేను మొన్నే డ్యూటీలో చేరాను. అదీ ...నిన్ను పట్టుకోడానికే.'

'సారీ సార్! నాకూ బాధగానే వుంది.'

తెల్లవారబోతోంది. కేశవన్ కాళ్ళు ముడుచుకుని నిద్రపోయాడు.

దేవా అతన్ని చూస్తున్నాడు. కేశవన్ మరో ఉషోదయాన్ని చూడక పోవచ్చు. రేపటి సూర్యోదయాన్ని కేశవన్ చూడడని అతనికి ఖచ్చితంగా తెలుసు.

రేపు ఈ యువకుణ్ణి ఎలా చిత్రహింసలు పెడతారో దేవా వూహించుకున్నాడు. ఏ మనిషి పైనా ప్రయోగించని, వూహకందని చిత్రహింసలకు అతన్ని గురిచేస్తారు. ఆ ఆలోచనకే దేవా వణికిపోయాడు. న్యాయం, అన్యాయం గురించి ఆలోచించే హక్కు తనకి లేదనుకున్నాడు. ఒక క్షణం కేశవన్‌ను పారిపోడానికి అవకాశం ఇస్తే అన్న భావం తళుక్కున మెరిసింది. కాని పారిపోవాలనే కోరిక లేని, తను చేసిన నేరాన్ని ఒప్పుకునే కేశవన్‌ను ఏం చేయాలి? తీవ్రమైన గందరగోళంలో పడ్డాడు దేవా.

ఒక్కసారిగా పక్షుల కలకలం మొదలైంది. కేశవన్ వులిక్కిపడి లేచాడు.

'నిద్ర వచ్చింది సార్!' అన్నాడు కేశవన్. 'ఈ రోజు నాకు గాఢనిద్ర పట్టింది చాలాకాలం తర్వాత. ఇప్పటివరకు ప్రతిక్షణం ఎన్నో సార్లు నేను మరణించాను. పోలీసులు ఏ క్షణమైనా రావచ్చునని ఎదురు చూశాను. నిద్రలేని రోజులు ఎన్నో గడిపాను'.

ఎండ క్రమంగా విస్తరిస్తోంది. ఆ తోపు సౌందర్యం చూసి ఆశ్చర్యపోయాడు కేశవన్. అది మొదటి పురుషుడు, మొదటి స్త్రీ సంచరించిన ఈడెన్ ఉద్యానవనంలా వుంది.

'అబ్బ! ఎంత అందమైన తోట సార్!'

భవనానికి కొంత దూరంలో ఎత్తుగా పెరిగిన పారిజాత వృక్షం వుంది. దాన్ని అతను చూశాడు. పూలన్నీ కింద్ర రాలి వున్నాయి. అక్కడికి పోయి వాటి వాసన పీల్చాలని వుంది.

'సార్! అక్కడికి పోయి ఆ పూవులు ఏరుకు రావచ్చునా?'

'తీసుకురా! ఏం అభ్యంతరం లేదు.'

కేశవన్ నుంచున్నాడు. ఆ చెట్టు దగ్గరకు వెళ్తున్నాడు.

దేవా మనసులో ఒక భావం తళుక్కుమంది.... వెంటనే గదిలోకి వెళ్ళి తుపాకీతో తిరిగివచ్చాడు. ఆ తుపాకి లోడులో రెడీగా వుంది.

కేశవన్ ఆ చెట్టు దగ్గరకు చేరి వంగొని పూలు ఏరుతున్నాడు. కొన్ని క్షణాల్లో దేవ గురి సరిచూసుకున్నాడు.

తుపాకి శబ్దం విని చెట్ల పైన పక్షులు ప్రాణభయంతో ఎగిరిపోయాయి. కేశవన్ మరుక్షణమే కిందపడి మరణించాడు.

'ఏమిటేమిటి? ఏం జరిగింది?....' అందరూ పరుగుపరుగున వచ్చారు.

'వాడు పారిపోడానికి ప్రయత్నించాడు. కాల్చేశాను..'

'మంచి పని చేశారు.' అన్నాడు మీసాల పోతు. 'వాడే కనుక పారిపోయి వుంటే మనమందరం జైలుకు వెళ్లాల్సి వచ్చేది.'

వాళ్ళందరూ పారిజాత వృక్షం వైపు వెళ్లారు. కేశవన్‌లో ప్రాణం వున్న జాడలేమీ లేవు. కానీ పారిజాతాలు ఏరుతున్నపుడు అతను అనుభవించిన ఆనందం అతని ముఖంలో స్పష్టంగా కనబడుతోంది.

దేవా ఒక గాఢమైన నిట్టూర్పు విడిచాడు. ఒక యువకుడిని చిత్రహింసల నుండి రక్షించానునుకున్నాడు. కానీ అతని హృదయంలోని ముల్లులు అతనికి వినబడకుండా పోలేదు.

★ ★ ★

**(కేంద్ర సాహిత్య అకాడమీ వారి 'ఇండియన్ లిటరేచర్' ఇంగ్లీషు ద్వైమాసిక జూలై-ఆగష్టు 1994 సంచికలో ప్రచురితం)**

# స్త్రీ విముక్తి సంఘటన మహాసభలను విజయవంతం చేయండి

## 2023 మే 9, 10 తేదీలు - అనంతపురం

*మిత్రులారా!*

శ్రమదోపిడి, పితృస్వామిక పీడన అణచివేతలకు వ్యతిరేకంగా, నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో మహిళా ఉద్యమాన్ని నిర్మించే కృషిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో స్త్రీ విముక్తి సంఘటన పనిచేస్తున్నది. మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా నిరంతరాయంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. సరైన దృక్పథం, స్పష్టమైన లక్ష్యం కలిగిన సంఘ నిర్మాణం మాత్రమే స్త్రీ విముక్తికి బాటలు వేయగలదన్న అవగాహనతో పనిచేస్తున్నది. సంఘ నిర్మాణాలలో కొనసాగుతూ ప్రజాఉద్యమాలలో భాగస్వాములవటం ద్వారా మాత్రమే మహిళలు తమ చైతన్యాన్ని పెంపొందించుకోగలుగుతారనే దృక్పథంతో మహిళా ఉద్యమాలను నిర్మించే కృషిలో స్త్రీ విముక్తి సంఘటన నిమగ్నమై ఉంది.

దేశంలో ధనికుల, పేదల మధ్య అంతరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. కోవిడ్ కాలంలో అత్యధికమంది భారతీయులు మరింత పేదరికంలో కూరుకుపోగా, అదే కాలంలో బడా కుబేరుల సంపద అనేక రెట్లు పెరిగింది. పాలకవర్గాలు తమ అవినీతి, దోపిడీ ప్రయోజనాలకు అనుగుణంగా వివిధ కులాల మధ్య, మతాల మధ్య, భాషల మధ్య, ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. అత్యధిక ప్రజానీకం ఆధారపడిన వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. పెట్టుబడి ఖర్చులు పెరిగి, గిట్టుబాటు ధరలేక రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కార్మికులలో అత్యధికులు అసంఘటితరంగ కార్మికులుగా ఏ విధమైన హక్కులు, ఉద్యోగ భద్రత లేకుండా దుర్భర పరిస్థితుల మధ్య పనిచేస్తున్నారు. ప్రస్తుత విద్యావిధానంతో వత్తిళ్ళకు గురైన విద్యార్థులు, నిరుద్యోగ సమస్య తీవ్రత కారణంగా నిస్పృహకు లోనైన యువత, విద్యాసంస్థల్లో, పని ప్రదేశాల్లో పురుషాధిపత్యపు పీడనకు గురౌతున్న మహిళలు అనేకమంది ఆత్మహత్యలవైపు నెట్టబడుతున్నారు. యువతలో, విద్యార్థుల్లో నీచ అభిరుచులను ప్రేరేపించే విషసంస్కృతి నలుమూలలా కోరలుసాచి ఉంది. మద్యం, మత్తుపదార్థాలు విచ్చలవిడిగా లభ్యమౌతూ ప్రజల జీవితాలను కల్లోల భరితం చేస్తున్నాయి. యువతలో నేర ప్రవృత్తి పెరుగుతోంది. మహిళలపై హింస నానాటికీ తీవ్రమౌతున్నది. దళితులపై, ఆదివాసులపై మైనారిటీలపై ఆధిపత్య శక్తుల దాడులు నిత్యకృత్యమయ్యాయి.

మహిళాభివృద్ధి, మహిళా సాధికారత అంటూ పాలకులు ఎన్ని ప్రగల్భాలు పలుకుతున్నా వాస్తవం వేరుగా ఉంది. దేశ వ్యాపితంగా మహిళలపై దాడులు నానాటికీ తీవ్రమౌతున్నాయి. సినిమాలు, టీవీ కార్యక్రమాలు, ఇంటర్నెట్ ద్వారా ప్రసారమయ్యే కార్యక్రమాలు స్త్రీలను అత్యంత నీచంగా చిత్రిస్తూ అవమాన పరుస్తున్నాయి. స్త్రీలను వ్యక్తిత్వం లేనివారుగా, కుళ్ళు కుతంత్రాలతో కుట్రలకు పాల్పడే వారుగా, తమ శరీరాలతో పురుషులను లోబరచుకునేవాళ్ళుగా చూపుతూ అవమాన పరుస్తున్నాయి. అడ్డూ అదుపూ లేకుండా ఇంటర్నెట్ ద్వారా సెల్‌ఫోన్లలో లభ్యమయ్యే బూతు వీడియోలు యువతపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. స్త్రీలను అవయవాల కుప్పలుగా తప్ప సాటి మనిషిగా చూడాలన్న వివేకాన్ని నశింపచేస్తున్నాయి. సమాజంలో వేళ్ళూనుకొని వున్న పురుషాధిపత్యపు భావజాలానికి మద్యం మత్తు తోడవటంతో మహిళల మీద దాడులు, వాటి తీవ్రత పెరుగుతున్నాయి. ఇటువంటి ఘటనల సందర్భంగా మీడియాలో జరుగుతున్న చర్చలుగానీ, పాలకులు చేస్తున్న వ్యాఖ్యలు గానీ సమస్య అసలు లోతుల్లోకి వెళ్ళకపోవటమేగాక తరచుగా పక్కదారి పట్టించేవిగా ఉంటున్నాయి. ఇంకా కఠినమైన చట్టాలు చేయాలని, బాధిత మహిళల కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించాలనే వైపుగా పరిష్కారాలు సూచిస్తున్నారు. జరుగుతున్న సంఘటనలన్నింటినీ విడివిడి ఘటనలు చూస్తూ వాటిల్లో ఉన్న సామాజికాంశాలను చూడ నిరాకరిస్తున్నారు. సామాజిక సమస్యలకు వ్యక్తిగత పరిష్కారాలు వెదకటమనేది సమస్యను పక్కదారి పట్టించటం తప్ప మరొకటి కాదు. నేరస్తులు బలవంతులైతే చట్టాల ద్వారా ఎలా తప్పించుకుంటారో బిల్కిస్ బానో, వాకపల్లి ఉదంతాలు స్పష్టం చేస్తుంటే, బాధితులనే వివిధ రూపాలలో ఎంత క్రూరంగా హింసిస్తారో ఉన్నావ్‌లో అధికారపార్టీ ఎమ్మెల్యేచే అత్యాచారానికి గురికాబడిన మహిళ ఉదంతం స్పష్టం చేస్తోంది. రాజ్యంపై వత్తిడి తీవ్రమైనప్పుడు బలహీనులను ఎలా సమిధలుగా చేస్తారో, చట్టాలను ఉల్లంఘించి మరీ ఎన్‌కౌంటర్ల పేరిట వారిని ఎలా హతమారుస్తారో 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్ స్పష్టం చేస్తున్నది. ఈ సమస్యలు వేటికవి విడివిడి ఘటనలు కావని, వాటిలోని సామాజిక మూలాలను వివరిస్తూ, ప్రతిఘటించమని మహిళలకు పిలుపునిస్తూ స్త్రీ విముక్తి సంఘటన కరపత్రాలు ప్రచురించి విస్తృతంగా పంపిణీ చేసింది. రెండు రాష్ట్రాలలో సభలు, సమావేశాలు నిర్వహించింది.

ప్రజల వ్యక్తిగత విశ్వాసాలకు సంబంధించిన మతాన్ని ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే సాధనంగా మారుస్తున్న పాలకుల విధానాలను ఎండగడుతూ, అవి మహిళలపై కలిగించే దుష్ప్రభావాలను వివరిస్తూ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు చేపట్టింది. ప్రజలలో శాస్త్రీయ భావజాలాన్ని వ్యాప్తిచేయాల్సిన పాలకులు దానికి పూర్తి విరుద్ధంగా తమ స్వార్థ ప్రయోజనాల కోసం మూఢత్వాన్ని పెంచి పోషించే విధానాలకు

వ్యతిరేకంగా "మతతత్వానికి, అశాస్త్రీయ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడుదాం" అంటూ మహిళల జీవితాలపై అశాస్త్రీయ భావజాలపు ప్రభావాన్ని తిరస్కరించాలని వివరిస్తూ కార్యక్రమం చేపట్టింది.

రైతాంగానికి, ప్రజానీకానికి తీవ్ర నష్టం చేకూర్చే మూడు వ్యవసాయ నల్లచట్టాలకు, విద్యుత్ బిల్లు 2020కి వ్యతిరేకంగా ఢిల్లీలో రైతాంగం చేపట్టిన ఆందోళనకు స్త్రీ విముక్తి సంఘటన సంఘీభావం తెలియచేయటంతోపాటు రెండు రాష్ట్రాలలో జరిగిన అనేక కార్యక్రమాలల్లో భాగస్వామ్యమైంది. కరోనా వ్యాప్తి, ఆ సందర్భంగా విధించిన లాక్‌డౌన్ ప్రజల ఆర్థిక పరిస్థితులను మరింత దిగజార్చాయి. కోట్లాదిమంది ఉపాధిని కోల్పోయారు. ఈ పరిస్థితుల్లో కరోనా కాలంలో వివిధ రంగాలలో పనులు కోల్పోయినవారందరికీ ఉపాధి కల్పించాలి" అని డిమాండ్ చేస్తూ 2022లో రాష్ట్ర సదస్సు నిర్వహించటంతోపాటు వివిధ జిల్లాలలో సభలు, సమావేశాలు నిర్వహించింది.

విద్యా, వైద్యరంగాలలో పాలకులవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాలు ప్రజలకు భారంగా మారాయి. ఈ పరిస్థితిలో "విద్య, వైద్యం ప్రజలందరికీ మౌలిక హక్కుగా అందాలని డిమాండు చేద్దాం" అంటూ కార్యక్రమం చేపట్టింది.


రైతాంగం, విద్యార్థులు, మహిళలు, యువతీయువకులు వివిధ కారణాల వల్ల ఆత్మహత్యలు చేసుకుంటున్న స్థితిలో నిరాశా, నిస్పృహలకు లోనుగాకుండా సమస్యల పరిష్కారానికై పోరాటబాట చేపట్టవలసిన కర్తవ్యాన్ని గుర్తింపజేస్తూ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు చేపట్టింది. మద్యం దోపిడీకి వ్యతిరేకంగా, పాలకుల మద్యం విధానాలను ప్రతిఘటిస్తూ, ప్రజల కష్టార్జితాన్ని ఏవిధంగా దోచుకుంటున్నారో వివరిస్తూ కార్యక్రమాలను కొనసాగిస్తున్నది. కాశ్మీర్ లోయలో 8 సం॥ల చిన్నారి ఆసిఫాపై మతతత్వశక్తుల హత్యాచారానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనాందోళనలు నిర్వహించింది. ప్రముఖ పాత్రికేయురాలు, సామాజిక కార్యకర్త గౌరీలంకేష్ హత్యకు వ్యతిరేకంగా పలు ప్రాంతాలలో నిరసనాందోళనలు చేపట్టింది. వివిధ మహిళా సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సుల నుండి, ప్రాంతీయంగా సభలు, సమావేశాలు, ప్రదర్శనలు విస్తృతంగా నిర్వహించింది. సమస్యల మూలాలను వివరిస్తూ, కర్తవ్యాలను నిర్దేశిస్తూ సందర్భానుసారం సాహిత్యాన్ని తీసుకువచ్చి విస్తృతంగా ప్రజానీకంలో పంపిణీ చేసింది.

మిత్రులారా! సమస్త దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా నిర్మించే సంఘటిత ఉద్యమాల క్రమంలో మాత్రమే స్త్రీ విముక్తికి భూమిక ఏర్పడుతుందన్న అవగాహనతో స్త్రీ విముక్తి సంఘటన తన కార్యాచరణను కొనసాగిస్తోంది. ఇది కొద్దిమంది వ్యక్తులు, శక్తులు చేయగలిగే పనికాదు. సరియైన దృక్పథము, ఆచరణ కలిగిన సంఘ నిర్మాణం మాత్రమే ఆ కృషిని సాగించగలదు. ఇటువంటి నిర్మాణ దృక్పథం, ఆచరణతో స్త్రీ విముక్తి సంఘటన పనిచేస్తున్నది. నిర్మాణాన్ని మరింత సంఘటిత పరచుకునే కృషిలో భాగంగా గత మహాసభల నుండి నేటివరకు సాగించిన కృషిని సమీక్షించుకుంటూ 2023 మే 9, 10 తేదీలలో అనంతపురంలో మహాసభలు నిర్వహించుకోనున్నది.

**శ్రామిక మహిళలు, మధ్యతరగతి మహిళలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యార్థి యువజనులు ఈ మహాసభలకు హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాం. మహాసభల నిర్వహణకు అవసరమైన ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలందించ వలసిందిగా ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.**

**– స్త్రీ విముక్తి సంఘటన**

# ప్రజాతంత్రవాది లాలం సుబ్బయ్య మరణం



**తన** సంచినిండా కరపత్రాలను, పుస్తకాలను తీసుకువెళ్తూ, దారి పొడవునా వాటిని పంచుకుంటూ జీవించిన లాలం సుబ్బయ్య 6-4-2023న కర్నూలులో 87వ ఏట అనారోగ్యంతో మరణించారు. ఆయన 1936లో కర్నూలులో జన్మించారు.

లాలం సుబ్బయ్య ఉద్యోగ ప్రస్థానం బిఎస్ఎన్ఎల్‌లో ఆపరేటర్‌గా గుంటూరు నుండి ప్రారంభమయింది. ఉద్యోగస్థుల సమస్యలపట్ల స్పందిస్తూ వారిని సంఘటితపరిచేవారు. కర్నూలుకి బదిలీ అయిన తర్వాత బిఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘం నాయకుడిగా ఎనలేని కృషిచేశారు. ఉన్నతాధికారుల నుండి వచ్చే ఒత్తిడులను తట్టుకుంటూ ఉద్యోగస్థుల పక్షాన నిజాయితీగా నిలబడ్డారు. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్మిన సుబ్బయ్య చివరివరకూ ఆ భావజాల వ్యాప్తికై కృషిచేశారు.

అన్ని ప్రజాసంఘాల సభలకు హాజరయ్యేవారు. ప్రజాసంఘాల పత్రికలకు చందాలు కట్టించేవారు. మీటింగ్‌లకు వెళ్ళటానికి డబ్బులు లేక ఆగిపోయేవారుంటే – తన స్వంత డబ్బులతో వారిని మీటింగ్‌లకు తీసుకెళ్ళేవారు. పత్రికలకు చందాలు తనే కట్టి ప్రోత్సహించేవారు. ప్రచారం కావాల్సిన వ్యాసాలను జిరాక్స్ కాపీలు తీయించి పంచేవారు. ప్రజాసంఘ కార్యకర్తగా, నాయకునిగా తను నమ్మిన సిద్ధాంత భావజాలాన్ని చివరివరకూ ఆచరించారు.

సుబ్బయ్యగారు 'ప్రజాసాహితి'కి చిరకాల మిత్రులు, సాహిత్యాభిమాని, ప్రజాతంత్రవాది లాలం సుబ్బయ్య మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం తెలియచేస్తుంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియచేస్తున్నాం.

# వీరే భా.జ.పా విజ్ఞానశాస్త్ర ఘనులు

**భారతీయ** జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అంతకు ముందు అజ్ఞాతంగా వున్న పలువురు శాస్త్రవేత్తలు వెలుగులోకి వచ్చి, ప్రజలకు కొత్త విజ్ఞానాన్ని పంచిపెడుతున్నారు. సైన్సు కాంగ్రెసు సమావేశాల్లో తాము కనుగొన్న విశేషాలను సభ్యులకు, విద్యార్థులకు తమ పత్రాల ద్వారా తెలియచేస్తున్నారు. వీరందరికీ నాయకత్వం వహిస్తూ ప్రధానమంత్రి మోదీ వినాయకుడికి ఏనుగు తల అతికించడమంటే, ఆనాడే (?) ప్లాస్టిక్ సర్జరీలో మన దేవుళ్ళు (శివుడు) నైపుణ్యం సాధించాడని వాక్రుచ్చారు. ఇక దీనితో మిగిలిన (కుహనా) శాస్త్రజ్ఞులందరూ చెలరేగిపోయి, మనకు తెలియని ఎంతో విజ్ఞానాన్ని పంచిబెట్టారు. వారి గురించి క్లుప్తంగా :

**1). జగదీప్ ధన్‌కర్** (పశ్చిమబెంగాల్ గవర్నరు) – 2020 జనవరి 14న 45వ తూర్పు ఇండియా సైన్స్ సమ్మేళనంలో మాట్లాడుతూ, రామాయణ కాలంలోనే ఎగిరే యంత్రాలున్నాయనీ, అర్జునుడి బాణాల్లో అణుశక్తి నిక్షిప్తమై వుందనీ ప్రకటించి, అక్కడ హాజరైన శాస్త్రజ్ఞులందర్నీ ఆశ్చర్యంలో ముంచేశాడు. "విమానాలను 1910లోనో 1911లోనో కనిపెట్టారంటారు. కాని రామాయణ కాలంనాటికే ఉరన్ ఖటోలా (విమానాలు) వున్నాయని రామాయణంలో వుంది. అంతేగాక మహాభారతంలోని అర్జునుడి బాణాలకు అణుశక్తి వుంది."

**2). విప్లవదేవ్** (త్రిపుర ముఖ్యమంత్రి) ఈయన తండ్రి కమ్యూనిస్టు కావచ్చు. కనుక ఇటువంటి పేరు పెట్టారు. ఈయన మాత్రం పచ్చి మితవాది. గతంలో జిమ్‌లో వ్యాయామం నేర్పేవాడు. మార్చి 2018లో మాట్లాడుతూ మహాభారతంలో గుడ్డివాడైన ధృతరాష్ట్రుడికి ఎప్పటికప్పుడు కురుక్షేత్ర యుద్ధంలోని విశేషాలు చేరాయి అంటే అప్పటికే ఉపగ్రహం ద్వారా సమాచారం అందించడం, ఇంటర్నెట్ (అంతర్జాలం) ఉండేవని వాక్రుచ్చారు. మరో సందర్భంలో ఈయన ఉద్యోగాలకు మెకానికల్ ఇంజనీర్లుగాక సివిల్ ఇంజనీర్లు బాగా పనికి వస్తారని ప్రకటించారు.

**3). అనంతకుమార హెగ్డే** (నైపుణ్యాభివృద్ధిశాఖ కేంద్ర మంత్రి). ఈయన సంస్కృతభాషా ప్రియుడు. 2018 జూన్ 21న ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధ శాస్త్రవేత్తలు భవిష్యత్తులో సూపర్ కంప్యూటర్లు సంస్కృతభాషను వాడతాయన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారని ప్రకటించారు. ఈ ప్రసిద్ధ శాస్త్రవేత్తల పేర్లుగాని, ఏ సందర్భంలో ఎక్కడ ఈ అభిప్రాయాన్ని వారు ప్రకటించారో మాత్రం అడిగినా చెప్పలేదు.

**4). త్రివేంద్రసింగ్ రావత్** (ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి) 1919 జులై 27న ఈయన ఒక ఆశ్చర్యకరమైన అబద్ధాన్ని చెప్పారు. ఆవులు ఆక్సిజన్ పీల్చి ఆక్సిజన్‌ను వదులుతాయన్నదే ఆ అబద్ధం. ఆవులతో సన్నిహితంగా మెలిగితే క్షయవ్యాధి తగ్గుతుందట. ఎంత సన్నిహితమో మాత్రం చెప్పలేదు. మరో సందర్భంలో, గర్భిణీ స్త్రీలు బాగేశ్వర్ జిల్లాలోని గరుడగంగా నీళ్ళు త్రాగితే సిజేరియన్ ఆపరేషన్ లేకుండా సుఖ ప్రసవం అవుతుందని ప్రకటించాడు.

**5). రంజిత్ శ్రీవాత్సవ** (ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకి ప్రాంతపు చిన్నస్థాయి బిజెపి నాయకుడు) 28 జులై 2019న ఈయన ఆవులు చనిపోతే ఖననం (పాతిపెట్టడం) చేయకూడదనీ, అవి హిందూ మతానికి చెందినవి గనుక ముస్లిముల ఆచారమైన పాతిపెట్టడం చేయగూడదన్నాడు. చనిపోయిన ఆవులను తెల్లటి వస్త్రం కప్పి, హిందూ సంప్రదాయం ప్రకారం చితిపై దహనం చేయాలి లేదా విద్యుత్ దహన వాటికలో అంతిమ కర్మ చేయాలి అన్నారు. ఇంకా పది కాలాలపాటు జ్ఞాపకం వుంచుకోదగ్గ మరో విషయం చెప్పారు. "ముస్లిముల ఇళ్ళల్లో వున్న ఆవులను తెచ్చేసుకోవాలి. మన బాలికలు వారిని వివాహం చేసుకుంటే 'లవ్ జీహాద్'. అయితే, గోమాత వారి ఇళ్ళకు వెళ్ళడం 'లవ్ జీహాద్' కాదా? ఆవుల బదులు ముస్లిములు గొర్రెలను పెంచుకోవచ్చని సలహా ఇస్తూ, గొర్రె వారి తల్లి అన్నాడు.

**6). గిరిరాజ్‌సింగ్** (చేపలు, పశువులు, పాడిశాఖ కేంద్రమంత్రి) 2020 జనవరి 14న శాస్త్రజ్ఞులతో మాట్లాడుతూ వారిని ఆవుపేడ, ఆవు మూత్రంపై ఇంకా లోతైన పరిశోధన చేయమని కోరారు. గొడ్డుపోయిన ఆవులను నిర్లక్ష్యం చేయకుండా, రైతులు వాటి పేడ ద్వారా, మూత్రం ద్వారా ఆదాయాన్ని సంపాదించుకోవచ్చు.

**7). సత్యపాల్‌సింగ్** (ఉన్నత విద్యాశాఖ స్టేట్ మంత్రి) ఈయన గతంలో బొంబాయి పోలీసు కమీషనరుగా పనిచేశారు. 2019 జులై 19న, జనవరి 2018న, జూన్ 30, 2018న పార్లమెంటులో ఇలా ప్రకటించాడు. "మన సంస్కృతి మనల్ని రుషుల సంతానం అని చెబుతోంది. అంతేకాని మనం కోతుల నుండి పుట్టామని చెప్పిన చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతం సరైనది కాదని ప్రకటించారు. ఈయన వాదన అంతా కోతి మనిషిగా మారుతున్నప్పుడు ఎవరూ చూడలేదు. అనే వాదనతో పాఠ్యపుస్తకాల్లోని పరిణామ సిద్ధాంతాన్ని తొలగించాలని, సింగ్‌గారి వీరాభిమానులు కోరారు.

**8). ప్రజ్ఞాఠాకూర్** (భోపాల్ యం.పి.; మాలేగావ్ బాంబింగ్ కేసులో ఆరోపణకు గురైన వ్యక్తి) బిజెపివారంతా గోమాతకు ప్రణామములు చేస్తుంటే, ఈమె 2019 ఏప్రిల్ 22న తాను గోమూత్రపానం చేసి కాన్సర్‌ను తగ్గించుకున్నానని ప్రకటించారు. 'పంచగవ్యతో కలిసిన ఆయుర్వేదిక మూలికలతోపాటు గోమూత్రం తాగి కాన్సర్‌ను నయం చేసుకున్నాను.' పంచగవ్య అంటే ఆవుపేడ, మూత్రం, పాలు నిర్దిష్టమైన పాళ్ళల్లో మిశ్రమం చేయడం. కాని ఆమెకు చికిత్స చేసిన వైద్యులు మాత్రం వాస్తవాన్ని తెలియచేస్తూ తాము ఆమెకు చాల సర్జరీలు చేసి నయంచేశామని ప్రకటించారు. అయినా ఆమె మాత్రం రక్తపోటు తగ్గడానికి ఆవును ఒక పద్ధతిలో నిమరాలి అని చెప్పారు. చాల వ్యాధులు గోవుతో సన్నిహితంగా వుంటే తగ్గుతాయని ప్రకటించారు.

**9). హర్షవర్ధన్** (సైన్స్, టెక్నాలజీశాఖల కేంద్రమంత్రి) 2015 జనవరి 4న ఈ కేంద్రమంత్రి భారతదేశమే మొదట ఆల్జీబ్రాను, పైథాగరస్ సిద్ధాంతాన్ని కనుగొన్నదనీ, కానీ అరబ్బులకు ఆల్జీబ్రా కనుగొన్నట్లు ప్రచారం చేసుకోడానికీ, గ్రీకులకు పైథాగరస్ సిద్ధాంతాన్ని రూపొందించినట్లు చెప్పుకోడానికి భారతదేశం అనుమతినిచ్చిందనీ ప్రకటించారు.

ప్రపంచ ప్రసిద్ధ భౌతికశాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ చనిపోగానే, మార్చి 2018లో ఈయన మరల రంగంలోకి దిగి, ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం కంటే విలువైన, శక్తిమంతమైన శాస్త్రజ్ఞానం వేదాలలో వుందని హాకింగ్ చెప్పాడని గట్టిగా చెప్పాడు. హాకింగ్ ఏ పుస్తకంలో ఎక్కడ అలా చెప్పాడని అడిగిన విలేఖరులతో అవి మీరే వెతుక్కోండి అని తప్పించుకున్నాడు. అసలు ఇబ్బంది ఏమిటంటే కేంద్రమంత్రి ఈ ప్రకటనలను భారత సైన్స్ కాంగ్రెస్ సభలో చేయటం.

**10). జి. నాగేశ్వరరావు** (ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, విశాఖపట్నం వైస్-ఛాన్సలర్) సైన్స్ కాంగ్రెస్‌లో ఒక పత్రం సమర్పిస్తూ భారతంలో 100మంది కౌరవులు స్టెమ్‌సెల్, టెస్ట్‌ట్యూబ్ సాంకేతికతతో పుట్టారు అని ప్రకటించారు. విష్ణువు దగ్గరున్న విష్ణుచక్రం క్షిపణాస్త్రం అని చెప్పారు.

**11). జునాగఢ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం** ఈ సంస్థలో పనిచేస్తున్న శాస్త్రజ్ఞులు తాము ఐదేళ్ళపాటు పరిశోధన చేసి, గోమూత్రంలో బంగారం ఆనవాళ్ళు కనుగొన్నామన్నారు. అథర్వవేదం ఆధారంగా ఈ పరిశోధనలు చేశామన్నారు. అంతేగాక వర్షాకాలంగాక, వేసవిలో గోమూత్రంలో ఎక్కువ బంగారం వుంటుందన్నారు.

**12). సుదర్శనరావు** (ఐ.సి.హెచ్.ఆర్. భారత చరిత్ర పరిశోధనా మండలి ఛైర్మన్) చరిత్రకు సంబంధించిన ఈ ప్రసిద్ధ సంస్థకు, తగిన అర్హతలు లేని ఈయన్ను నియమించగానే, భారతం, రామాయణం నిజంగా చరిత్రేననీ, అవి కవుల కల్పన కాదనీ తాను నిరూపిస్తానన్నారు. అయితే త్రవ్వకాలు జరపాల్సిన చోట్ల అశేష ప్రజానీకం నివసిస్తున్నందున నిరూపణ అసాధ్యమైందని ప్రకటించారు. ఇవేగాక, మగ నెమలి కన్నీరు తాగితే ఆడ నెమలి గర్భిణీ అవుతుందనీ, కృష్ణబిలాల గురించి ఉపనిషత్తుల్లోనే ప్రస్తావించారనీ, సూర్యగోళంలోంచి ఓంకార ధ్వని వస్తుంటుందనీ, టెస్ట్‌ట్యూబ్ టెక్నాలజీతో కర్ణుడు పుట్టాడనీ - ఇలా ఎన్నెన్నో కాకమ్మ కథలను ప్రాచీన విజ్ఞానశాస్త్ర వైభవంగా ఈనాటి పాలకులు, వారి ప్రతినిధులు విరివిగా ప్రచారం చేస్తూ వున్నారు.

వీరేగాక, మొత్తం దేశవ్యాప్తంగా మూఢనమ్మకాలనూ, అర్థంపర్థం లేని ఆచారాలనూ భక్తి ప్రధానమైన అనేక టీ.వీ. ఛానల్స్ ద్వారానూ, ప్రవచనాల ద్వారానూ, ప్రసంగాల ద్వారానూ ఆధ్యాత్మిక గురువులు ప్రచారం చేస్తున్నారు. మనం వేదాల కాలంనాటికి వెళ్ళిపోదామన్న తిరోగమన దృక్పథం ప్రచారమౌతోంది. నిజానికి అలా వెళ్ళడం అసాధ్యమని వారికీ తెలుసు. కాని ప్రజలు అసలు సమస్యలను పట్టించుకోనీయకుండా, వారిని ప్రక్కదారులు పట్టించడానికే ఈ ప్రచారం కొనసాగిస్తున్నారు. పాత వ్యవస్థను పునరుద్ధరించడానికీ, ప్రజలను అజ్ఞానంలో కొన్ని తరాలపాటు వుంచడానికీ జరుగుతున్న ఈ ప్రచారాన్ని శాస్త్రీయంగా త్రిప్పికొట్టాల్సిన ఉద్యమం ఇంకా ఉధృతం కావాల్సిన అవసరం కనబడుతోంది. ●

## ముప్పై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

## 1993 మే, సంపుటి : 16, సంచిక : 10

**వ్లదీమిర్** కొజ్లిన్‌స్కీ అనే చిత్రకారుడు రష్యాలో 1919 సభను చిత్రించిన (లినోకట్ పద్ధతిలో) బొమ్మ ముఖచిత్రంగా ఈ సంచిక వెలువడింది. "విప్లవ ఐక్య కార్మికోద్యమమే 'మేడే' సందేశం" అనే సంపాదకీయం; జ్యోతిరాణి, కాత్యాయనీ విద్మహే రాసిన 'ఓల్గా నుంచి గంగకు' పుస్తక పరిచయం, నారాయణస్వామి 'కల్లోల కలల మేఘం' కవితాసంపుటిపై అద్దేపల్లి రామమోహనరావు రాసిన 'కలల మేఘం నిజాల్ని వర్షిస్తుంది' అనే పుస్తక సమీక్షనూ, డా॥ సుమన్ సహాయ్ రాసిన 'డంకెల్ డ్రాఫ్టులో ఏముంది'? అనే వ్యాసం, బమ్మిడి జగదీశ్వరరావు రాసిన 'గడ్డి' కథ, నవీన్ రాసిన 'యజ్ఞం' సినిమాపై సమీక్ష, యం. కృష్ణారావు రాసిన 'గోవిందం - భజగోవిందం' అనే వ్యంగ్య రచన వున్నాయి. సాహు రాసిన 'నీ జంటగా నేనుంటా రారా చిన్ని తమ్మయ్య', వెంకన్న రాసిన 'ఏ బావిలన్నపడి - పాణమిడిసిన మేలు', నిరంజన్ రాసిన 'డంకెల్' పాటలూ, అరణ్యకృష్ణ రాసిన 'నీ చావు గురించే రాస్తున్నాను' కవితలనూ ప్రచురించారు. పి. చంద్రశేఖర్ ఆజాద్ నిర్వహణలో 'పిల్లల ప్రపంచం' శీర్షిక మరియు చైతన్యవాహిని, ఉత్తరాలు, స్వీకారం శీర్షికలనూ ప్రచురించారు. రెండవ అట్ట కవరుపేజీలో డా॥ మానేపల్లి రాసిన "మరణంతో కొత్త జీవం", మూడవ కవరుపేజీలో డా॥ మిరియాల రామకృష్ణ రాసిన 'అనుకున్నట్లు జరిగే యుగం' కవితలను ప్రచురించారు. నాలుగవ కవరు పేజీలో "ప్రజాసాహితి" రాహుల్జీ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ ఫొటో, జనసాహితి ప్రచురించిన 'జన విజయం' సాహిత్య కళారూపకం పుస్తక ఆవిష్కరణ ఫొటోలను ముద్రించారు.

1/8 డెమ్మీలో 60 పుటలు. వెల : రూ.5/- ●

# చైతన్యవాహిని

**26-3-2023న తెనాలి**లో దివికుమార్ అధ్యక్షతన 'తెలుగు మాధ్యమం - ఎదుర్కొంటున్న సవాళ్ళు'పై సదస్సును జనసాహితీ మిత్రులు నిర్వహించారు. పరిపాలనా భాషగా ప్రజల భాష వున్నపుడే ప్రభుత్వానికీ ప్రజలకీ మధ్య సత్సంబంధాలు బలపడతాయని నందివెలుగు ముక్తేశ్వరరావు (విశ్రాంత ఐ.ఏ.యస్) చెప్పారు. నల్లగొండ జిల్లా కలక్టరుగా తెలుగు వాడకంపై చేసిన కృషి వివరించారు. మాతృభాష పట్ల ఈనాటి ప్రభుత్వ విధానాలను డా॥ గుంటుపల్లి శ్రీనివాస్ నిశితంగా విమర్శించారు.

ఈ సభలో చందు నాగేశ్వరరావు రాసిన 'అమ్మనుడి కందము - పంచశతి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. దానిలోని పద్యాలను వివరిస్తూ డా॥ పిల్లి వాసు (నాగార్జున విశ్వవిద్యాలయం) మాట్లాడారు. చివర్లో ఈ శతక రచయిత చందు నాగేశ్వరరావు తన స్పందన తెలియచేసి వందన సమర్పణ చేశారు.

**4-4-2023న ఒంగోలు**లోని శ్రీ హర్షిణీ డిగ్రీ కళాశాలలో జనసాహితి ఆధ్వర్యంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (PDSO), నవయువసమాఖ్య (NYS) సంయుక్తంగా ప్రచురించిన 'భారత జాతీయోద్యమం - మహోజ్వల వారసత్వం' పుస్తక పరిచయసభ జరిగింది. మనందరికీ ఉజ్వలమైన భవిష్యత్తు ఇవ్వడానికి ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరుల స్ఫూర్తిని విద్యార్థులు స్వీకరించాలని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎం.హర్ష ప్రీతం దేవ్‌కుమార్ అన్నారు. జాతీయోద్యమం అనేది వ్యక్తుల కృషి మాత్రమే కాదని, బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఈ దేశం నుండి వెళ్ళగొట్టడంలో సామాన్య రైతులు, కార్మికులు, గిరిజనులు, విద్యార్థులు ప్రధాన పాత్ర పోషించారని అయన స్పష్టం చేశారు. కానీ 75 సంవత్సరాల స్వాతంత్ర్య పాలన తర్వాత కూడా శ్రామిక గిరిజనులు, దళితులు, బలహీన వర్గాల ప్రజలు పోషకాహారానికి, నాణ్యమైన విద్యకీ, సరైన వైద్యానికి కూడా నోచుకోక దుర్భర జీవితం గడుపుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండటంతో పాటు చైతన్యవంతమైన సమాజాన్ని సాధించడానికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తరగతి పుస్తకాలతో పాటు సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలని, సమాజం పురోగమించడానికి కృషిచేయాలని అయన పేర్కొన్నారు.

ఈ సభలో జనసాహితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జి.వి.కృష్ణయ్య ప్రసంగిస్తూ దేశం కోసం కేవలం 23 సంవత్సరాల వయసులో ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్ ఈ దేశం నుండి కేవలం బ్రిటీష్ దొరలు వెళ్ళిపోవడం మాత్రమే చాలదనీ, ఒక మనిషిని ఇంకో మనిషి, ఒక జాతిని మరో జాతీ దోచుకోవడానికి, అణచివేయడానికి, పీడించడానికి అవకాశం లేని వ్యవస్థ కావాలని కోరుకున్నాడని స్పష్టం చేశారు. అలాంటి వ్యవస్థను ఇంకా సాధించుకోవాల్సిన స్థితిలోనే భారత దేశం ఉన్నదనీ, 'నన్ను చంపగలరు కానీ నా ఆశయాలను, ఆలోచనలను చంపలేరని' ఎలుగెత్తి చాటిన భగత్‌సింగ్ మన మీద ఎంతో విశ్వాసం ఉంచాడన్నారు. అయన ఆశయాల సాధన కోసం కృషి చేయడం యువత తమ బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు.

ఈ సభలో ఏపిటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఐ.విజయసారధి, శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి, జనసాహితి జిల్లా కార్యదర్శి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

**13-04-23న అనకాపల్లి,** నర్సింగరావుపేటలో గల కోలపర్తి అప్పారావు (ఏపిటిఎఫ్) భవన్‌లో జనసాహితి మరియు ఓపిడిఆర్ సంయుక్తంగా నిర్వహించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి శతజయంతి సభ జరిగింది. జనసాహితి జిల్లా అధ్యక్షులు ఐ.టీ.ఆర్.వి.శివాజీరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ జస్టిస్ చిన్నప్పరెడ్డిగారు న్యాయవాదిగా పనిచేసే కాలంలోనూ ఆ తర్వాత హైకోర్ట్ చీఫ్ జస్టిస్‌గానూ మరియు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గాను పనిచేసే కాలంలోనూ సాధారణ ప్రజలకు న్యాయం ఎలా చేరాలని నిరంతరం ఆలోచించేవారన్నారు. ఆయన సుప్రీంకోర్టులో పనిచేసే కాలంలో మైలురాళ్ళు అనదగ్గ తీర్పులు ఇచ్చారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆనాటికి కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్న హైర్ అండ్ ఫైర్ విధానాన్ని రద్దు చెయ్యడం వంటి ఆయన ఇచ్చిన తీర్పులు నేటికీ వాటి ప్రాసంగికతను కోల్పోలేదనీ, నేటి సంక్షోభ సమయంలో ప్రజలకు మేలు చేసే చిన్నపరెడ్డిగారి వంటి న్యాయమూర్తులు, చట్టాలు మరింతగా అవసరం అని అన్నారు.

సీనియర్ అడ్వకేట్ మరియు ఎక్స్ ఏపిపి పిళ్ళా హరశ్రీనివాసరావు మాట్లాడుతూ జస్టిస్ చిన్నపరెడ్డిగారు ప్రజానుకూల కోణంలో అనేక తీర్పులు ఇచ్చారని, భారత న్యాయవ్యవస్థ చరిత్రలో చిరస్మరణీయుడు జస్టీస్ చిన్నపరెడ్డి అని అన్నారు. చిన్నపరెడ్డిగారి తీర్పులు మరియు ఆయన వివిధ సందర్భాలలో ఇచ్చిన ప్రసంగాలు పరిశీలిస్తే నేటి యువ న్యాయవాదులకు పాఠ్యాంశాలలా ఉపయోగపడతాయన్నారు. ఆయన తీర్పులను అధ్యయనం చేస్తే న్యాయ వ్యవస్థను ప్రజలకు చేరువగా తీసుకు వెళ్ళడం ఎలా అన్నది తెలుసుకోవచ్చు అని అన్నారు. చిన్నపరెడ్డిగారి తీర్పులు, ప్రసంగాలు ప్రగతిశీల భావాలతో కూడి మానవత్వాన్ని ప్రతిబింబిస్తుంటాయి అని అన్నారు.

అడ్వకేట్ మరియు ఓపిడిఆర్ సభ్యులు అయిన శ్రీమతి పి. భారతీలక్ష్మి మాట్లాడుతూ రాజ్యాంగ సంబంధ కేసులలోనే కాకుండా సివిల్, క్రిమినల్, సర్వీస్ లా, ఖైదీల హక్కులు, దళితుల - వెనుకబడిన కులాల హక్కుల విషయంలో చిన్నపరెడ్డిగారి పరిజ్ఞానం అపరిమితమైనది అని అన్నారు. జీవిత పర్యంతం ఆయన గొప్ప విలువలు కలిగి ఉన్నారనీ, ఆయన తీర్పులు, ఉపన్యాసాలు పెద్ద గ్రంథాలయం అవుతాయని అన్నారు. న్యాయవాదులుగా ఆయన బాటలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

ఓ.పి.డి.ఆర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ గౌరీశంకర్ మాట్లాడుతూ చిన్నపరెడ్డి సామాజిక న్యాయ విషయాలలో నూతన ఆవిష్కరణలు

చేశారనీ, న్యాయమూర్తిగా ఉంటూనే ఎలాంటి సంకోచాలు లేకుండా ప్రజల కోసం, సమాజ ప్రగతి కోసం ధైర్యంగా నిలబడ్డారన్నారు. ఆయన ఇచ్చిన తీర్పులు, ఉపన్యాసాలు చూపిన ఆచరణ, కరకుతనం మన ముందున్నాయి. ఈ తరం విద్యార్థులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు స్వీకరించాల్సి ఉంటుంది అని అన్నారు. ఈ సభలో న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**23-04-2023న రేపల్లె**లోని హంస జూనియర్ కాలేజీ నందు జనసాహితి ఉమ్మడి గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో చార్వాక రామకృష్ణ స్మారకోపన్యాసం మరియు పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగినది. ఈ సమావేశానికి ఉమ్మడి గుంటూరు జిల్లా జనసాహితి కన్వీనర్ పి.డి. సోషలిజం అధ్యక్షత వహించారు. 'అంకురం' సినిమా దర్శకులు సి. ఉమామహేశ్వరరావు "పతనమవుతున్న సాంస్కృతి విలువలు మన బాధ్యత" అనే అంశం మీద మాట్లాడుతూ మన సంస్కృతి పుక్కిటి పురాణాలతో హేతుబద్ధతను నిరాకరించే విధంగా సర్దుబాటు మనస్తత్వంతో తయారైందని అన్నారు. అదేవిధంగా ఒక విషయాన్ని అనేక అబద్ధాలతో రంగరించి వాస్తవం అని నమ్మేలా తయారు చేస్తున్నారనీ, అదే నిజమైన సంస్కృతిగా చలామణి అయ్యేలా మీడియా, పాలకవర్గాలు ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తెలియజేశారు. పతన సంస్కృతి విలువల వ్యాప్తికి వ్యవస్థీకృతంగా వున్న కారణాలను వివరించారు. ప్రపంచీకరణ విధానాలు విలువలను మరింతగా దిగజార్చాయని చెప్తూ ప్రపంచవ్యాప్తంగా వచ్చిన సాహిత్యాన్ని పరిచయం చేశారు. చార్వాక రామకృష్ణ జీవితం-ఆచరణ గురించి విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.సి. హెచ్ రాజరత్నం ప్రసంగిస్తూ రామకృష్ణ జీవితమంతా హేతువును అన్వేషిస్తూ , భౌతిక వాదం పునాదుల మీద పనిచేశారని తెలియజేశారు. ఆర్థిక సాంఘిక విప్లవాలు బొమ్మా బొరుసుగా జరగాలని అందుకు ప్రజలను ప్రశ్నించే వైపుకి నడిపించడం కోసం చార్వాక విద్యాపీఠాన్ని స్థాపించి నిత్య భౌతిక వాదిగా ఆయన తన జీవితాన్ని గడిపారని తెలియజేశారు. డాక్టర్ ఆర్కే రచించిన "ప్రాచీన ప్రపంచ చరిత్ర - సామాజిక విశ్లేషణ" అనే పుస్తకాన్ని ఆవిష్కరించిన జనసాహితి ప్రధాన కార్యదర్శి బి. అరుణ మాట్లాడుతూ, క్రీ.పూ. 3500 సంవత్సరాల నుండి నేటి వరకు చరిత్ర పరిణామ క్రమం ఏవిధంగా జరిగిందీ సరళమైన పదాలతో విద్యార్థులు కూడా సులభంగా అర్థం చేసుకునే విధంగా ఈ పుస్తకాన్ని డాక్టర్ ఆర్కే వ్రాశారని తెలియజేశారు. అదేవిధంగా చరిత్రలో పాలకులు పాలితులుగా సమాజం ఎలా విభజించబడిందో, దోపిడీ ఏ విధంగా కొనసాగిందీ, పాలకులు ప్రజలను అణగ ద్రొక్కటానికి రాజ్యం, మతాన్ని ఏ విధంగా ఉపయోగించుకున్నదీ అనే విషయాలను ఈ పుస్తకంలో ఆర్కే విపులంగా చర్చించారని తెలియజేశారు. ఆదిమ సమాజం మొదలుకుని వివిధ వ్యవస్థలలో వర్గ పోరాటాలు ఏ విధంగా జరిగాయో, ప్రజలు తమ హక్కుల కోసం ఏ విధంగా పెనుగులాడారో విశ్లేషణాత్మకంగా డాక్టర్ ఆర్కే వివరించారని అరుణ తెలియజేశారు. ముక్కామల నాగభూషణం రచించిన "వెర్రి పడగల" పుస్తకాన్ని జనసాహితి అధ్యక్షులు దివికుమార్ ఆవిష్కరించి, మాట్లాడారు. ఫ్యూడల్ భావాలను సమర్థిస్తూ విశ్వనాథ సత్యనారాయణ 'వేయిపడగలు' నవలలో వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఏ విధంగా మెరుగైన సమాజానికి ఉపయోగపడవో ముక్కామల నాగభూషణం తెలియజేశారని దివికుమార్ అన్నారు. వర్ణవ్యవస్థ, నిచ్చెన మెట్ల కులవ్యవస్థ మొదలగు విషయాలను 'వేయి పడగలు' పుస్తకం ఏ విధంగా సమర్థించిందో ఈ పుస్తకములో ముక్కామల నాగభూషణం తెలియజేశారని దివికుమార్ అన్నారు. బ్రిటిష్ వారు స్వప్రయోజనాల కోసమే అయినా, వారు ఏర్పాటు చేసిన రైల్వేలు, ఆధునిక చదువులు, సాంఘిక సంస్కరణలు భారతీయ సమాజానికి ఉపయోగపడినాయని, కాని వేయి పడగలు నవలలో కవిసమ్రాట్ వ్యతిరేకించడాన్ని ముక్కామల నాగభూషణం తన విమర్శలో ఆక్షేపించారని దివికుమార్ తెలియజేశారు. ఈ సమావేశానికి ఉపాధ్యాయులు, సాహిత్యాభిమానులు, నాస్తికోద్యమ కార్యకర్తలు హాజరయ్యారు.

**23-4-2023న శ్రీకాకుళం**లో 'ఇడబ్ల్యుఎస్. : రిజర్వేషన్లను అంతం చేసే కుట్ర' పుస్తకావిష్కరణ సభ జరిగింది. సిక్కోలు బుక్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దుప్పల రవికుమార్ సభ ఉద్దేశాన్ని వివరించగా, ఎన్జీఓ సంఘ నాయకులు హనుమంతు సాయిరాం అధ్యక్షత వహించారు. ఈ సభలో విశ్రాంత ఐఏఎస్ అధికారి రుంకు అప్పారావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్ల బిల్లు చరిత్రలో రికార్డు సృష్టించే వేగంతో కేవలం 48 గంటలలో పార్లమెంటు ఉభయ సభలలో పాసయ్యి, చట్టంగా రావడం వెనుక ఏదో కుట్ర దాగి ఉందని ప్రముఖ అనువాదకులు సిద్దార్థి సుభాష్ చంద్రబోస్ అన్నారు. తాను అనువదించిన "ఇడబ్ల్యుఎస్ : రిజర్వేషన్లను అంతం చేసే కుట్ర" పుస్తకం పరిచయ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో 'ప్రజాసాహితి' సంపాదకుడు పి.ఎస్. నాగరాజు మాట్లాడుతూ - వేల సంవత్సరాల సామాజిక వెనుకబాటుకు, సాంస్కృతిక అణచివేతకు, అట్టడుగు వర్గాలు కులం పేరుతో గురికావడానికి, భూస్వామ్య సాంస్కృతిక ఆర్థిక రాజకీయాలే కారణమని, పాశవికమైన అణచివేతకు జవాబుగా ఆనాటి చారువాకుల నుండి, మొన్నటి జ్యోతిరావు పూలే ఉద్యమం, అంబేద్కర్ పోరాటాల నుండి సామాజిక చలనం పురోగమించిందనీ అన్నారు. దోపిడీ మూలాలను బట్టబయలు చేసిన మార్క్సిస్టు అవగాహన ఈ సాంస్కృతిక అణచివేతకు కారణాలను వెలికి తీసిందన్నారు. నిజానికి ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ మార్గంలోకి నెట్టబడుతూ ఉంటే, రిజర్వేషన్లు ఉనికే ప్రశ్నార్థకం అయిపోయిన వర్తమానంలో ఇ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్లు ప్రకటించటం మోసకారితనం అన్నారు. కులపరమైన అణచివేతలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలు మరియు సామ్రాజ్యవాద ఆర్థిక సామాజిక సాంస్కృతిక దోపిడీకి వ్యతిరేకంగా, ప్రైవేటైజేషన్‌కి వ్యతిరేకంగా జరిగే పోరాటాలలో మమేకం కావాలని పి.ఎస్. నాగరాజు అన్నారు.

బిసి అడ్వకేట్ సంస్థ అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు, బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బంగారు తాతారావు, సీనియర్ పాత్రికేయులు బెందాళం క్రిష్ణారావు, బిర్లంగి రామ్మోహనరావు, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.




**పూర్ణచంద్రోదయం :** డా॥ జి.వి. పూర్ణచందు సాహిత్యానుశీలన. సంపాదకులు : ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్

కృష్ణాజిల్లా రచయితల సంఘం కార్యదర్శి, విషయ వైవిధ్యం గల 130 గ్రంథాల రచయిత, ఆయుర్వేద వైద్యుడు జి.వి. పూర్ణచందు సాహిత్యాన్ని విశ్లేషిస్తూ 2021 జనవరి 1, 2, 3 తేదీలలో (కరోనా కాలంలో) మాడభూషి సాహిత్య కళాపరిషత్తు ఒక అంతర్జాల సదస్సును నిర్వహించింది. పూర్ణచందు రాసిన దాదాపు 50 రచనలపై సాహితీవేత్తల ప్రసంగవ్యాసాల సంకలనం ఇది.

లైంగిక విజ్ఞానం, ఆహార చరిత్ర, జీవిత చరిత్రలు, నవలలు, కవిత్వం, మాతృభాష, ప్రముఖ కవుల పద్యాల విశ్లేషణ, రామాయణ విశేషాలు, కాలచక్ర తంత్రం, గ్రామ దేవతలు, తరాలుగా సాగుతున్న సామాజిక జీవనంలో తటాలున మెరిసే కొసమెరుపులు, వైద్యగ్రంథాలు మొదలగువాటిపై 1978లో ప్రారంభించి 46 ఏళ్ళ సాహిత్య జీవితంలో 130 పుస్తకాలు ప్రచురించారు.

ఏ పుస్తకం చదివినా పూర్ణచందు విశేష కృషి కనబడుతుంది. క్షేత్ర పర్యటనల ద్వారా ఖచ్చితమైన సమాచారం పాఠకులకు అందించడం ఆయన అలవాటు. కావ్యాలు, ప్రబంధాలు, ఇతర సాహిత్య గ్రంథాలలో ప్రస్తావించిన ఆహారపుటలవాట్లను, ఆరోగ్యం గురించి 16 పుస్తకాలు, సాహిత్య గుబాళింపుతో రాశారు. వీరి 'తెలుగే ప్రాచీనం' గ్రంథం హిందీలోకి, ఇంగ్లీషులోకి అనువదింపబడింది. ఆరోగ్య గ్రంథాలు రెండు కన్నడంలోకి ఎం.ఎల్. రాఘవేంద్రరావు అనువదించారు. ఇవిగాక కృష్ణాజిల్లా రచయితల సంఘంవారు, ప్రపంచ తెలుగు రచయితల సంఘంవారు ప్రచురించిన వ్యాస సంపుటులకు సంపాదకత్వం వహించారు. వీరు సృష్టించిన 'ముక్కాలు' కవితారూపంలో పద్యాలను ఇంగ్లీషులో 'ట్రైపాడ్'గానూ, హిందీలో 'తిపాయీ'గాను ప్రసిద్ధులు అనువదించారు. తన సాహిత్య వ్యాసంగపు తొలిదశలో మినీ కవితల రచయితగానూ, ఎన్నో మినీ కవితలకు చిత్రకారునిగానూ, వాటిని వివిధ ప్రాంతాలలో ప్రదర్శించి మినీ కవితా ఉద్యమకారునిగానూ పూర్ణచందు కృషిచేశారు. అయితే మినీ కవితా ఉద్యమంలో ఆనాడు కృషి చేసిన రావి రంగారావు గురించి కొందరు ప్రస్తావించారు కాని 'మినీ కవితా విప్లవం' అనే తొలి మినీ కవితా సంకలనం ప్రచురించిన కవి కొల్లూరి గురించి ఎవరూ ప్రస్తావించలేదు.

ఈ అంతర్జాల ప్రసంగాల సంకలనంలో పూర్ణచందు కొన్ని రచనలను విహంగ వీక్షణంగా పరిచయం చేసిన వ్యాసాలను చదివితే, ఆ రచయిత గ్రంథాలు సేకరించి చదవాలనిపించే కుతూహలాన్ని కల్గిస్తున్నాయి.

1/8 డెమ్మీలో 318 పుటలు. వెల : రూ. 350/– ప్రథమముద్రణ : 26–6–2022. శ్రీమతి గుత్తికొండ రామరత్నం ఛారిటబుల్ ట్రస్ట్, మచిలీపట్నం వారి ప్రచురణ. ప్రతులకు : డా॥ జి.వి. పూర్ణచందు, మొదటి అంతస్తు, సత్నాం టవర్స్, బకింగ్‌హామ్ పోస్టాఫీసు ఎదురుగా, గవర్నరుపేట, విజయవాడ – 520002. email : purnachandgv@gmail.com ఫోన్ : 94401 72642.

**వచన గబ్బిలం – ఉత్తర గబ్బిలం :** రచయిత : చార్వాక (బి) రామకృష్ణ

దళిత సాహిత్యంలో ప్రముఖ స్థానంలో వున్న జాషువా ఛందోబద్ధ కావ్యం 'గబ్బిలం' మొదటిభాగం 1941లో, రెండవ భాగం 1946లో వెలువడ్డాయి. ఈనాటి పాఠకులకు ఆ కావ్యాన్ని సులభ వచనంలో బి. రామకృష్ణ 1996లో రాశారు. దాని మూడవ ముద్రణ ఇది.

1997లో బి. రామకృష్ణ రాసిన 'ఉత్తర గబ్బిలం' రెండు భాగాలు ఈ పుస్తకంలో ప్రచురించారు. ఈ రచనలో రామకృష్ణ సమకాలీన భారతంలో చెలరేగిన అనేకానేక రుగ్మతలను చీల్చి చెండాడారు.

ఈ రెండు పుస్తకాలకూ ముందుమాటలు 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు రాశారు.

**చార్వాక కేలండర్ 2023 :** భారతీయ తాత్త్విక చింతన. ఒక పరిచయం. రచన – డా॥ ఆర్.కె.

1982 నుండి చార్వాకాశ్రమంవారు నాస్తిక కేలండర్‌ను ముద్రిస్తూ వున్నారు. గత సంవత్సరం నుండీ ఈ కేలండర్ రూపురేఖలు మార్చి, కేలండర్‌తోపాటు భౌతికవాదాన్ని పరిచయం చేసే చిరు పుస్తకాన్ని ప్రచురించడం ప్రారంభించారు. గత ఏడాది (చార్వాక శకం 5022 – బూటకపు శకం 2022) డా॥ ఆర్.కె. రాసిన 'కులం పునాదులు' అనే 20 పుటల వ్యాసాన్ని కేలండర్‌తోపాటు ప్రచురించారు. ఈ ఏడాది 60 పేజీలు విస్తరించిన 'భారతీయ తాత్త్వికచింతన' అనే వ్యాసాన్ని అందించారు. ఈ వ్యాసంలో 'తత్త్వశాస్త్రం అంటే ఏమిటి?; భావవాదం – భౌతికవాదం; తాత్త్విక పద్ధతులు; జీవపదార్థం నుండి ఆలోచించే పదార్థం; ఉపనిషత్తులలోని తాత్త్విక ఆలోచన; భావ విప్లవం – మతం; చార్వాక లేదా లోకాయత; అజీవకులు – మక్ఖలి గోశాలి, బౌద్ధమతం, బుద్ధుని బోధనలు భావవాదమా? భౌతికవాదమా?; బౌద్ధంలో గతితర్కం; భారతీయ దర్శనాలు; మధ్యయుగాల్లో భారతీయ తత్త్వశాస్త్రం; భక్తి ఉద్యమాలు; బ్రిటిష్ ఇండియాలో విభిన్న తాత్త్విక ధోరణులు, అనే అంశాలపై విశ్లేషణ వుంది. సమాజ మార్పుకై ఆలోచించే ప్రజాతంత్రవాదులంతా తమ జ్ఞానాన్ని ఇనుమడింపచేసుకోవడానికి తప్పక చదవాల్సిన వ్యాసం.

వచన గబ్బిలం – ఉత్తర గబ్బిలం. 1/8 డెమ్మీ 72 పుటలు. వెల : రూ. 75/–

చార్వాక కేలండర్. 1/8 డెమ్మీ, 70 పుటలు. వెల : రూ.50/- ప్రతులకు : చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు), మంగళగిరి మండలం, గుంటూరుజిల్లా - 522503. ఫోన్ : 92906 19550.

**ఏది నిత్యం :** డాక్టర్ మక్కెన శ్రీను కథాసంపుటి.

రచయిత వెటర్నరీ కళాశాలలో ప్రొఫెసరు. 'విశాలాక్షి', 'విశాఖ సంస్కృతి', 'ప్రతిలిపి', పత్రికలలో ప్రచురించిన 10 కథల సంపుటి ఇది. రచయిత 13వ పుస్తకం ఇది.

1/8 డెమ్మీలో 94 పుటలు. వెల: రూ. 110/- ప్రథమముద్రణ : 2022. ప్రతులకు : డా॥ మక్కెన శ్రీను, టి.ఎఫ్.3, బొడ్డపాటి మాన్షన్, బైబిలు స్కూలు ఎదురుగా, గుణదల, విజయవాడ - 520004. ఫోన్ : 98852 19712.

**కూతవేటు దూరంలో ఢిల్లీ; రాజద్రోహ నేరం :** రెండు గల్పికలు : రచయిత - డా॥ ఎస్. సుధాకర్.

ఢిల్లీ సరిహద్దుల్లో భారత రైతాంగం ముఖ్యంగా పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు చెందినవారు. మోడీ అప్రజాస్వామికంగా చేసిన మూడు రైతాంగ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదిపాటు అహింసాయుతంగా నిరసన ప్రదర్శనలు చేశారు. కరోనాకు, చలికి, వాతావరణ మార్పులకీ 700 మంది రైతులు ఈ ప్రదర్శన సందర్భంగా చనిపోయారు. ప్రభుత్వం వీరితో 11 సార్లు చర్చలు జరిపింది. ఈ విషయాలన్నీ వస్తువుగా ముగ్గురు మిత్రుల సంభాషణ రూపంలో మొదటి గల్పిక 'కూతవేటు దూరంలో.....' రచించారు. ఈ ముగ్గురిలో ఒకరు రైతులతో జరిగిన చర్చల సందర్భంలో ప్రభుత్వం తరఫు బృందంలో ఒక అధికారి. చర్చల్లో పాల్గొన్న రైతుసంఘాల నాయకులు ఉన్నత విద్యావంతులే. వారి గురించి వివరాలు ఆయన ఇద్దరు మిత్రులకు చెప్పాడు. ఈ కథ రాసేనాటికి ప్రభుత్వం తను చేసిన రైతాంగ వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోలేదు.

రెండవ కథ 'రాజద్రోహనేరం'లో ఇద్దరే పాత్రలు. కథకుడు ఒక క్లబ్‌లో మరో పెద్దాయనతో కరోనా గురించి, దానిని అరికట్టడంలో ప్రభుత్వ వైఫల్యం గురించి, సిఎఎ చట్టాల గురించీ, చరిత్రలో నియంతల గురించి, గోబెల్స్ ప్రచారం గురించి మాట్లాడుతుంటాడు. ఇంతా చేస్తే, అదంతా ఒక కల. కలలు కూడా దేశభక్తి కలలు, దేశద్రోహ కలలుంటే వాటికి కూడా శిక్ష వేస్తారేమో. ముందస్తు బెయిల్ అవసరమంటారా అంటూ కథ కాని కల ముగుస్తుంది.

గల్పిక అన్నారుగాని, ఈ రెండింటికీ గల్పిక లక్షణాలు లేవు. ఇంకా క్లుప్తంగా వుండాలి. కథాశిల్పం లేదు, కేవలం వివిధ విషయాలపై చర్చలాగా వున్నాయి. అయినా ఈనాటి పరిస్థితుల్లో ఇటువంటి రచనలు కూడా పాఠకులను చైతన్యపరుస్తాయి.

1/8 డెమ్మీలో 32 పుటలు. వెల : రూ.20/- సాహితీస్రవంతి ప్రచురణ.

దీర్ఘ కవిత

## రంగు వెలిసిన చిత్రం

– శీలా సుభద్రాదేవి

(గత సంచిక తరువాయి....)

**బలుపో** వాపో
బయట పడని ఎదుటివాడి కదనోత్సాహం
కత్తిలా గుండెల్లో దిగుతూనే ఉంటుంది
అనుమాన భూతం ఆవహించిన కళ్ళకు
వాళ్ళనీడే వాళ్ళను భయపెడుతోంది
చలువ గదిలో కూర్చున్నా
నుదుటిమీద చెమటచుక్కలు మొలుస్తుంటాయ్

అయినా తప్పదు మరి
పెదాలపైపూత నవ్వులు
ఛాలెంజులూ పందేలు
మీసాల మెలివేతలూ
తొడకొట్టుడు పంతాలు
తమతమ గజబలాల ప్రదర్శనలు
అశ్వాలతో కవాతులూ
చదరంగం బల్లమీదే కాదు
ప్రాపు కోరే వందిమాగధ సౌరంభాలతో
ఎవరికివారు ఎన్నికల కదనరంగాన్ని
కబ్జా చేసే సవాలక్ష ప్రయత్నాలు
ఎన్నికల్లో తప్పదు కాక తప్పదు కదా

సామాన్యులకు మాత్రం
ఎదురుచూసి ఎదురు చూసి
కంటిదీపం కొడిగడ్తుంటే
పగిలిన స్వప్నాలను చిరుగులకొంగులో
మూటకట్టుకోక తప్పటం లేదు
ఎంత జాగ్రత్తగా కట్టాలనుకున్నా
రాలిపోతున్న స్వప్నశకలాలు
గుండెల్ని ఛిద్రం చేస్తున్నా ఏదో చిగురాశ
రేపో మాపో పేదల్ని అక్కున చేర్చుకునే
దయార్ద్ర మారాజు అందలం ఎక్కుతాడని
కళ్ళదీపాల్ని ఆశలతో ఎగదోస్తూ
ఇంటినిండా వెలుగులు పరిచి
ఆరిపోకుండా నమ్మకాన్ని అడ్డుగా చేర్చి
ఏరోజు కారోజు
ఛిద్రమౌతున్న కలల్ని కూడగట్టుకుంటూ
అవసరమైనప్పుడు జైకొడుతూ
భద్రజీవితాల్ని కలగంటూ.....కలగంటూ...
మాన్యులు కాని సామాన్యులు!

(ఇంకావుంది)

# డార్విన్ జీవపరిణామక్రమ సిద్ధాంతం

*(వాట్సాప్ నుండి)*

నా పుట్టుక ఆనవాళ్లను నేను
మర్చిపోవాల్సిందేనా...
మతం పునాదుల మీద ఏర్పడ్డ
కులసమూహ నివాసాల్లో నేను
మగ్గిపోవాల్సిందేనా...

కొన్ని కోటానుకోట్ల లక్షల
సంవత్సరాల
పుట్టుపూర్వోత్తరాలను శోధించి
సాధించగలిగిన నేను...

రాబోవు ప్రళయాలను ముందుగానే
పసిగట్టగలిగిన నేను...
చెంత చేరిన రోగాలను పురిటిలోనే
మట్టుపెట్ట గలిగిన నేను...

విశ్వ విష వలయాలను ఛేదిస్తూ
విశ్వాంతరాలపై ప్రయాణిస్తున్న
నేను...

చీకటి, రాతీ, ప్రాచీన, మధ్యయుగాల
అంతరాల - అవరోధాలను దాటి

ఆధునిక సమాజంలోకి
అడుగుపెట్టిన నేను...
మళ్లీ ఆ చీకటి ప్రపంచంలోకి
పరుగులు తీయాల్సిందేనా...

అబద్ధపు అక్షరాల చేత
వక్రీకరించబడ్డ చరిత్ర నుండి
నా జన్మ రహస్యం ఎక్కడ ఉందో
అని వెతుక్కోవాల్సిందేనా...

డార్విన్ జీవ పరిణామక్రమ
సిద్ధాంతాలను
పక్కకు నెట్టిన నేను...
మతమౌఢ్యపు భక్తిలోపడి
భజనలు చేయాల్సిందేనా...

గాఢాంధకార అనాగరిక సమాజం
నుండి నవనాగరికత వెలుగులు
విరజిమ్మే విజ్ఞాన కాంతిరేఖల వైపు
నడిచిన నేను...

చీకటి యుగం వైపు మళ్ళీ
తిరోగమనించవలసిందేనా...

విశ్వం రహస్యమును,
జీవం పుట్టుకను,
జీవరాశుల మనుగడను
విశ్లేషించి వివరించిన నేను...
విచక్షణ కోల్పోయిన జీవిలాగా
వింతలు, విడ్డూరాలు అంటూ
అభూత కల్పనకు ఆజ్యం
పోయాల్సిందేనా...

తెలివితో, మాటలతో, చేతలతో
సమస్త విశ్వ మండలాన్ని
నిర్మించుకున్న నేను...
గొంతెత్తి ప్రశ్నించలేని మూగజీవిగా
మారిపోవలిసిందేనా...

మీరు పన్నిన కుట్రల కుతంత్రాలతో
నా భవిష్యత్తు తరాలు ఆగమవుతు
అంతమవబోతున్నాయి.

(పాఠ్యపుస్తకాల నుంచి డార్విన్ పరిణామ క్రమ సిద్ధాంతాన్ని తొలగించిన సందర్భంగా తిరిగి మళ్లీ యధావిధిగా పాఠ్యపుస్తకాలలో చేర్చాలని) (నేను = మనిషి)

# చిత్రకారుడు, రచయిత 'బాలి' మరణం



**అందరికీ** ఆత్మీయుడు, రేఖాచిత్రకారుడు, కథారచయిత 'బాలి' అనే కుంచె పేరు గల మేడిశెట్టి శంకరరావు తన 82వ యేట విశాఖపట్టణంలో 17-4-2023న మరణించారు. ఆయన అనకాపల్లిలో 29-9-1941న జన్మించారు.

బాలి తండ్రి సైన్యంలో సుబేదారుగా పనిచేస్తూ చిత్రకళ ప్రవృత్తిగా వున్నవాడు. ఆయన బాలి బాల్యంలోనే మరణించారు. ఇంటిముందు అమ్మ వేసే ముగ్గులు చూస్తూ బాలి చిత్రకళపట్ల మక్కువ పెంచుకున్నారు.

ఇంటర్మీడియట్ తర్వాత సర్వీస్ కమీషన్ పరీక్ష రాసి బాలి పి.డబ్ల్యు.డిలో గుమాస్తాగా కొంతకాలం పనిచేశారు. 1974లో 'ఈనాడు' (విశాఖ)లో రెండేళ్ళు పనిచేసి 1976లో 'ఆంధ్రజ్యోతి'లో చేరారు. ఆ తర్వాత స్వతంత్రంగా వుండి, కొన్నేళ్ళు హైదరాబాదు కలర్ చిప్స్ కంపెనీలో చేరారు.

ఆయన మొదటి చిత్రం 'ఉబుసుపోక' 1958 ఆంధ్రపత్రిక (సచిత్ర వారపత్రిక)లో ప్రచురితమైంది. ఇక అప్పటి నుండి వేలాది కార్టూన్లు, వందలాది పుస్తకాలను ముఖచిత్రాలని, గ్రీటింగ్ కార్డులు ద్వారా చిత్రకళాభిమానులకు చేరువయ్యారు. ప్రత్యేకంగా 'ప్రజాసాహితి' పత్రికకు అనకాపల్లికే చెందిన మా సంపాదకులు నిర్మాలానంద ద్వారా పరిచయమై విజయవాడలో వున్నంతకాలం అడిగినంతనే ముఖచిత్రాలు గీసి ఉచితంగా ఇచ్చేవారు. ఆవిధంగా ఆయన చిన్న పత్రికలకు ఒక కల్పవృక్షం.

బాలి 'చిత్రమైన జీవితం' శీర్షికతో తన స్వీయ చరిత్ర రాశారు. 34 కథలు, రెండు పిల్లల నవలలు, చిత్రకళపై పుస్తకం, ఏడు కార్టూన్ సంకలనాలు రాసి ప్రచురించారు. షికాగో, ఢిల్లీ, చెన్నై, బెంగుళూరు, హైదరాబాదులలో ఆయన చిత్రాల ప్రదర్శనలను నిర్వహించారు.

గత మార్చి 26న ఛత్తీస్‌ఘడ్ నుండి వెలువడుతున్న 'కార్టూన్ వాచ్' పత్రిక వారు బాలికి జీవన సాఫల్య అవార్డు ఇచ్చింది. జర్మనీ - ఫ్రాంక్‌ఫర్ట్‌లో పర్యావరణ శాఖవారు బాలి బొమ్మల పుస్తకాన్ని ముద్రించి విడుదల చేశారు. గోర్కీ 'అమ్మ' నవలను బాలల కోసం 'అమ్మ'గా జనసాహితి ప్రచురించింది. దానికి బొమ్మలు 'బాలి' గారే వేశారు. 2022 డిశంబరులో వారి అబ్బాయి గోకుల్ అమెరికాలో మంచు తుపానులో చిక్కుకున్నవారిని రక్షిస్తూ తానే మరణించారు. ఆయన భార్య ధనలక్ష్మి 15 ఏళ్ళ క్రితమే మరణించారు. 'బాలి' మరణానికి 'ప్రజాసాహితి' ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తోంది.

PRAJA SAAHITI May 2023 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

# ఎర్రజెండాలెత్తిపట్టిన ఆడవాళ్ళు

– డా॥ బి. అరుణ

పాయలు పాయలుగాపారే
వాగులన్నీ కలసి
ఊరేగింపై ప్రవహిస్తున్నాయ్
ప్రతి చేతి పిడికిట్లోనూ
ఎర్రజెండా!

ఎర్రజెండా కర్రను ఒడిసిపట్టుకుని
బిగిసిన పిడికిళ్ళు
ఎర్రజెండాపై పట్టున్న
నినాదాల పిడికిళ్ళు

పితృస్వామిక దోపిడీ పీడనలు
నశించాలని
శ్రమ విముక్తి జరగకుండ
స్త్రీ విముక్తి జరగబోదనీ
స్త్రీలూ పురుషులూ సమానమేనన్న
సమాజం కావాలని
మత సంప్రదాయ సంకెళ్ళను
తెంచుకుందామని
మద్యం మత్తుల నుండి
బయటపడాలని

..................

నినాదాల హోరు



తలుపుల చాటున, కిటికీల చాటునున్న
గాజుల చేతులు
జెండా కర్రపై వాలాయి
నాట్లు వేస్తూన్న చేతులూ
నట్లు బిగించే చేతులూ
బట్టలపై అల్లికలైన చేతులు
కీబోర్డుపై నాట్యమాడే చేతులు
జెండాకర్రను భుజానికానించాయ్
అది ఒక మహోద్యమం

ఆ నినాదాల శబ్దాలను
నిశ్శబ్దంగా గాలి మోసుకెళ్తుంది
మున్ముందుకు

ఏళ్ళతరబడి సంప్రదాయాల మాటున
బంధింపబడ్డవారు
విషసంస్కృతి విషవలయంలో
చిక్కుకున్నవారు
ఒంటరివారు
అపహాస్యం చేయబడ్డవారూ
అస్పృశ్యులు
కులాల, మతాల, ఆధిపత్యాల
సంకెళ్ళను తెంచుకుంటూ
అమ్మలు, అమ్మమ్మలు, అక్కలు, అత్తలు, కూతుళ్ళు
అందరూ ఊరేగింపై
ప్రవహిస్తున్నారు.

ఆ ప్రవాహానికి అదురూ బెదురూ లేదు
దారిలో ఆగిపోతున్నవారిపై చింత లేదు
ఆగిపోతూ అడ్డంకులౌతున్నవారిపై
ద్వేషమూ లేదు
కర్ర చివర ఎర్రజెండా
ఎగరటం లేదనీ
మాసిపోయిందనీ
చిరిగిపోతుందనీ అనే
వెటకారాలు, వెక్కిరింపులపై
లెక్కేలేదు. వెరపూ లేదు.

ఎర్రజెండా కట్టుకునే చీరకాదు
సమున్నతంగా ఎగిరే శ్రమజీవుల ఎజెండా
శ్రమశక్తి ఒడిలో పురుడుపోసుకున్న
నెత్తుటి సూర్యోదయం
లక్ష్యాలను చేరేవరకూ
విశ్రమించని ప్రవాహం
ఎర్రజెండా కర్రను ఆడవాళ్ళ చేతుల
పిడికిళ్ళు బిగిసి పట్టుకున్నాయ్
ఎర్రజెండాలెత్తిపట్టిన
ఆడవాళ్ళ సమూహం
మున్ముందుకు సాగుతుంది.

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI